శుక్రవారం
25-4-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 213
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్ర లో
మ్యాగజైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్
మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

ఏకచ్ఛత్రాధిపత్యమే మోదీ లక్ష్యం

- సమాఖ్య వ్యవస్థకు తూట్లు
- రాజ్యాంగం నిర్వీర్యానికి కుట్రలు
- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా

తిరువనంతపురం: మోదీ ప్రభుత్వం సమాఖ్య స్వరూపాన్ని సర్వనాశనం చేస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ రాజ్యాంగాన్ని, లౌకికవాదాన్ని రూపుమాపేందుకు నిరంకుశత్వంగా ముందుకెళుతోందని విమర్శించారు. ప్రజాప్రభుత్వంగా కాకుండా నియంత రాజ్యంగా భారత్‌ను మారుస్తోందని దుయ్యబట్టారు. భారత వైవిధ్యతను దెబ్బతీస్తూ ఒక దేశం-ఒక భాష/మతం/ఎన్నిక అంటూ ఏకచత్రాధిపత్యం కోసం యత్నిస్తోందన్నారు. స్వాతంత్ర్య సమరంలో కమ్యూనిస్టులు రక్తం చిందిస్తే... ఆర్‌ఎస్‌ఎస్-బీజేపీ వలసవాద రాజ్యాలకు వంత పాడాయని రాజా ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశ సమైక్యత పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారని రాజా నొక్కిచెప్పారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నాయన్నారు. లౌకికవాదాన్ని, సామ్యవాదాన్ని, దేశ ఐకమత్యాన్ని పరిరక్షించడం కోసం, వైవిధ్యతను కాపాడటం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగాన నిలిచి పోరాడుతోందని, ఇదే ధ్యేయంగా ముందుకెళుతున్నామని రాజా చెప్పారు. కేరళలోని తిరువనంతపురంలో సీపీఐ జాతీయ సమితి సమావేశం గురువారం జరిగింది. ఆపై పార్టీ శతవార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన సభలో పార్టీ కార్యదర్శులు కె.నారాయణ, అనీరాజా, రామకృష్ణ పాండా, అమర్‌జిత్ కౌర్, గిరీశ్ శర్మ, కాంగో, కేరళ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం తదితరులు పాల్గొన్నారు. రాజా మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి సూత్రధారులు ఎవరని ప్రశ్నించారు. 26 మందికిపైగా అమాయకులు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రంతి వ్యక్తంచేశారు. సీపీఐ కశ్మీరీలకు ఎల్లప్పుడు తోడుగా నిలిచిందని, స్వాతంత్ర్య పోరాటం నాటి నుంచే కశ్మీరీలకు కమ్యూనిస్టుల అండ ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌లో కమ్యూనిస్టులు నేటికీ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారన్నారు. అధికరణ 370 రద్దు తర్వాత రాష్ట్ర హోదా కోల్పోయిన జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉందని గుర్తుచేశారు. 'ఉగ్రవాదాన్ని నియంత్రిస్తామని అధికరణ 370ను మోదీ ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పుడు ఉగ్రదాడి ఎలా జరిగింది? చొరబాట్లు ఎలా జరుగుతున్నాయి? దేశంలోకి చొరబడి... పౌరుల రక్తాన్ని పారిస్తుంటే అమిత్‌షా అధ్వర్యంలో కేంద్ర హోంశాఖ ఏం చేస్తోంది? అని రాజా నిలదీశారు. ప్రజలను కాపాడటం కోసం, ప్రజల ఐక్యతను పరిరక్షించడం కోసం, సౌభ్రాతృత్వాన్ని కాపాడటం కోసం కమ్యూనిస్టుల పోరాటం కొనసాగుతోందని ఉద్ఘాటించారు.

'బీజేపీ అధికారంలోకి వచ్చాక అధికరణ 370ను రద్దు చేసింది. మరి అధికరణ 371 సంతేమిటి? ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని అనుసరించరా... అమిత్‌షాకు రాజ్యాంగాన్ని ఎలా చదవాలో తెలియాలి. అధికరణ 370 రద్దు చేశారు కానీ అక్కడితో ఆగకుండా జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను హరించారు. కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌లో ఎన్నికైన ప్రభుత్వం -అసెంబ్లీ ఉన్నాగానీ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి అధికారాలు కరువయ్యాయి. సీఎం ఒమర్ అబ్దుల్లా సంపూర్ణ రాష్ట్ర హోదా కోసం డిమాండ్ చేస్తున్నారు. జమ్మూకశ్మీర్ ప్రభుత్వ న్యాయమైన డిమాండ్లను మోదీ ప్రభుత్వం విస్మరిస్తోంది' అని రాజా వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడికి సరిహద్దు భద్రతా వైఫల్యమే కారణమని, దీనికి ఎవరు బాధ్యత తీసుకుంటారో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో గురువారం రాజకీయ పార్టీలతో కేంద్రం సమావేశమైంది. కానీ జమ్మూకశ్మీర్ పార్టీలు పాల్గొనలేదు. నాడు వాజ్‌పేయి సైతం జమ్మూకశ్మీర్ ప్రజలతో మమేకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల మనస్సులోని మాట తెలియాలంటే జమ్మూకశ్మీర్ ప్రభుత్వం, అక్కడి పార్టీలతో మరింత సమన్వయం చేసుకోవడం కేంద్రానికి అవసరం' అని సీపీఐ ప్రధాన కార్యదర్శి హితవు పలికారు. దేశానికి తామే ప్రతీక అన్నట్లుగా జాతీయ పతాకాన్ని మోసే హక్కు తమకే ఉన్నట్లుగా ప్రచారం చేసుకోవడానికి బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌కు

- మిగతా 2 లో

ఉగ్రవాదంపై ఉక్కుపాదం

అఖిలపక్ష భేటీలో కేంద్రం

అండగా ఉంటామని నేతల భరోసా

న్యూదిల్లీ: ఉగ్రవాదంపై కఠిన చర్యలు తీసుకుంటామని అఖిలపక్ష నేతలకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. పహల్గాం ఉగ్రదాడిపై గురువారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం వివరాలను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. 'జమ్మూకశ్మీర్ ఆర్థిక వ్యవస్థ పుంజుకుని, పర్యాటకం వృద్ధి చెందుతున్న సమయంలో స్థానిక పరిస్థితులను ప్రభావితం చేసే లక్ష్యంతోనే పహల్గాం ఉగ్రదాడి జరిగింది. ఈ ఘటన, తదనంతరం తీసుకున్న చర్యలను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అఖిలపక్ష నేతలకు వివరించారు. ఉగ్రదాడికి దారితీసిన లోపాలు, అవి పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యల గురించి ఇంటెలిజెన్స్ బ్యూరో, కేంద్ర హోంశాఖ అధికారులు వివరించారు. ఉగ్రవాదంపై పోరులో ప్రభుత్వం వెన్నంటే ఉన్నట్లు అన్ని పార్టీల నేతలు చెప్పారు' అని కిరణ్ రిజిజు తెలిపారు. పార్లమెంట్ సముదాయంలోని భవనంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ కీలక భేటీ నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నేతలందరూ నిలబడి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు జైశంకర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ సహా ఆయా పార్టీల ముఖ్య నేతలు హాజరయ్యారు. పహల్గాం ఉగ్రదాడిని అందరం ముక్తకంఠంతో ఖండించామని, కేంద్రం తీసుకునే ఏ చర్యకైనా పూర్తి మద్దతు ఇస్తామని హామీ ఇచ్చామని రాహుల్ గాంధీ చెప్పారు. కశ్మీర్‌లో శాంతియుత పరిస్థితుల కోసం కేంద్రం తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని మల్లికార్జున ఖడ్గే తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటంలో ప్రభుత్వం వెన్నంటే ఉన్నామని, ప్రధాని మోదీ వీలైనంత త్వరగా అన్ని పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశామని తృణమూల్ నేత సుదీప్ బందోపాధ్యాయ సూచించారు.

ఐఎన్‌ఎస్ సూరత్ ప్రయోగం సక్సెస్

న్యూదిల్లీ: భారత నావికాదళం గురువారం స్వదేశీ గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్‌ఎస్ సూరత్‌ను విజయవంతంగా ప్రయోగించింది. సముద్ర ఉపరితలంపై నుంచి దూసుకెళ్లే తక్కువ ఎత్తులో వెళ్లే వేగవంతమైన క్షిపణి ఇది. ఐఎన్‌ఎస్ సూరత్ తన లక్ష్యాన్ని విజయవంతంగా అడ్డుకుని నాశనం చేసిందని భారత నావికాదళం ప్రకటించింది. ఈ విజయవంతమైన పరీక్ష భారతదేశ రక్షణ సామర్థ్యాలను పెంపొందించడంలో మరో ముఖ్యమైన భూమిక పోషిస్తుంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత ఈ పరీక్ష నిర్వహించింది. ఐఎస్‌ఐ పాక్ సైన్యం ఈ మారణహోమానికి కుట్ర

- మిగతా 2 లో

పాక్ వికృతానందం

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై పెద్దఎత్తున ఆగ్రహావేశాలు వెల్లువెత్తుతున్నాయి. దిల్లీలోని పాక్ హైకమిషన్ వద్ద ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాల నడుమ ఓ వ్యక్తి కేక్ బాక్స్‌తో పాక్ హైకమిషన్ కార్యాలయానికి వెళుతున్నట్లు కనిపిస్తున్న ఓ వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీనిపై నెట్టింట విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఏ సంబరాలు చేసుకునేందుకు కేక్ తీసుకెళ్తున్నారు? మీరు పాకిస్థాన్ హైకమిషన్‌కు చెందిన వ్యక్తా? ఈ బాక్స్‌లో ఏముంది? కేక్ తీసుకెళ్లేందుకు సందర్భం ఏంటి?' అని మీడియా ప్రతినిధులు ప్రశ్నలు కురిపించినప్పటికీ... ఎటువంటి సమాధానం చెప్పకుండానే ఆ వ్యక్తి వెళ్లిపోయినట్లు వీడియోలో కనిపిస్తోంది.

స్మార్ట్ పాలన

- మానవీయ కోణంలో ఏఐ వినియోగం
- త్వరలో భారీ డేటాలేక్ ఏర్పాటు
- ఏఐ వర్క్‌షాప్‌లో సీఎం చంద్రబాబు

నేడు దిల్లీకి చంద్రబాబు

2లో

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సాంకేతిక పరిజ్ఞానం పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా స్మార్ట్ పాలన అందించవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)కు ప్రాధాన్యత ఇస్తూనే, ప్రజలకు సేవల విషయంలో మానవీయకోణం చూపాలని సీఎం సూచించారు. ఏఐ ఆధారిత స్మార్ట్ వ్యవస్థ ఏర్పాటుతో రియల్ టైమ్‌లో సేవలు అందించవచ్చని, ఇందుకోసం పాత విధానాల స్థానంలో నూతన సాంకేతికతను ప్రవేశ పెట్టాల్సి ఉందన్నారు. టెక్నాలజీ అనేది ప్రజల కోసం ఉపయోగపడాలని, త్వరలో భారీ డేటా లేక్‌ను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టామని ముఖ్యమంత్రి చెప్పారు. 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్' అంశంపై గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన వర్క్‌షాప్‌ను ప్రారంభించి చంద్రబాబు ప్రసంగించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల ఆవశ్యకత, పాలనలో వాటి వినియోగంపైన ముఖ్యమంత్రి మార్గనిర్దేశనం చేశారు. ఇంటర్నెట్ కోసం ఎదురుచూసిన రోజుల నుంచి డేటా ఆధారిత పాలన దిశగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దిన నేటి వరకు తన ప్రయాణాన్ని ముఖ్యమంత్రి ఈసందర్భంగా గుర్తు చేసుకున్నారు. 30 ఏళ్లనాడు చేసిన ప్రయత్నంతో నేడు ఏపీ టెక్నాలజీలో కీలకంగా ముందుందని ప్రస్తావించారు. మన ప్రభుత్వ వ్యవస్థల్లో మేథాసంపత్తి ఉన్నవారు ఉన్నప్పటికీ ఇంకా పాత విధానాలు

- మిగతా 2 లో

సమీకరణ కాదంటే సేకరణే

- అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఆవశ్యం
- స్మార్ట్ ఇండస్ట్రీస్‌తోనే అభివృద్ధి
- ప్రధాని పర్యటనకు తుది దశ ఏర్పాట్లు: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పరిశ్రమలు వస్తేనే రాజధాని అభివృద్ధి జరుగుతుందని, అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం ఆవశ్యమని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. మరోసారి భూమి సమీకరణపై స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చిసున్నట్లు తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు రైతులు ముందుకు రాకపోతే భూసేకరణపై ఆలోచిస్తామన్నారు. మే2 న ప్రధాని రాష్ట్ర మోదీ పర్యటన కోసం చేస్తున్న ఏర్పాట్లను మంత్రి గురువారం పర్యవేక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఒక

- మిగతా 2 లో

హైదరాబాద్, తిరుమలలో హై అలర్ట్

విశాలాంధ్ర- హైదరాబాద్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో హైదరాబాద్, తిరుమలలో పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. భాగ్యనగరంలోని సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టారు. పాత బస్తీతో పాటు వివిధ ప్రాంతాలపై పోలీసులు దృష్టి పెట్టారు. పర్యాటక ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. నగరంలోని గతంలో టెర్రరిస్టుల దాడులకు గురైన ప్రాంతాలు సహా వివిధచోట్ల భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గత ప్రభుత్వం ఏమీ చేయలేదయ్యా, అంతా నాశనం. ఈ ప్రభుత్వంలో మేము ఏమీ చేయలేం, ఇంటి కెళ్లిపో!

'కర్రెగుట్ట'లో భీకర ఎన్‌కౌంటర్

- ఐదుగురు మావోయిస్టుల మృతి
- కొనసాగుతున్న గాలింపు
- వేలాదిగా బలగాల మోహరింపు

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లో భద్రతాబలగాలు-మావోయిస్టుల మధ్య పెద్ద యుద్ధమే జరుగుతోంది. కీలక మావోయిస్టు నేత హిడ్మాతో పాటు పెద్ద సంఖ్యలో మావోయిస్టులు భీమారంపాడు సమీపంలోని కర్రెగుట్టలో ఉన్నట్లు నిఘావర్గాలకు ఇటీవల సమాచారం అందింది. దీంతో కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో భద్రతాబలగాలు రెండు రోజులుగా అటవీ ప్రాంతం మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేయడంతో పాటు హెలికాప్టర్లతోనూ మావోయిస్టుల కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే భీమారంపాడు అటవీ ప్రాంతంలో తారసపడ్డ మావోయిస్టులపై కాల్పులు జరిపి ఐదుగుర్ని హతమార్చారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్ నేపథ్యంలో భీమారంపాడు గ్రామస్తులు ఎవరూ కూడా బయటకు రావద్దని భద్రతా బలగాలు హెచ్చరికలు జారీ చేశాయి. బీజాపూర్ జిల్లా ఊసూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్రెగుట్టల కేంద్రంగా అగ్రనేతలు, మావోయిస్టులు పెద్ద

- మిగతా 2 లో

ప్రపంచ నిపుణులకు తెలంగాణ విజన్ వివరిస్తాం: భట్టి

భాగ్యనగరంలో భారత్ సమ్మిట్...

విశాలాంధ్ర-హైదరాబాద్: భాగ్యనగరంలో భారత్ సమ్మిట్ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శుక్రవారం నుంచి నిర్వహించే సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నిపుణులను ఆహ్వానించినట్లు తెలిపారు. కాంగ్రెస్ మూల సిద్ధాంతాలైన ప్రపంచశాంతి, అహింస, న్యాయం, పెట్టుబడులే లక్ష్యంగా ఈ సమ్మిట్ నిర్వహించనున్నట్లు వివరించారు. 'ఈ సమ్మిట్‌లో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వ విజన్ వివరిస్తాం. ఇందిరా మహిళా శక్తి బజార్లు, గ్రామాల్లో ఉపాధి కల్పన తదితర అంశాల గురించి చెబుతాం. ఎకనమిక్ జస్టిస్, పొలిటికల్ జస్టిస్, సోషల్ జస్టిస్, జెండర్ జస్టిస్, యూత్ జస్టిస్, ఎకలాజికల్ జస్టిస్, పీస్ జస్టిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తాం' అని భట్టి తెలిపారు. తెలంగాణను ప్రపంచానికి ఓ రోల్ మోడల్‌గా చూపడానికే 'భారత్ సమిట్' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. 100 దేశాలకు పైబడిన ప్రభుత్వ ప్రతినిధులు, ఎంపీలు, జాతీయ పార్టీల నాయకులు, కార్పొరేట్ దిగ్గజాలు, వివిధ రంగాల నిపుణులు సుమారు 450 మంది సమావేశానికి హాజరవుతారని వివరించారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ప్రపంచ దేశాలకు చెందిన ప్రతినిధులను... వివిధ అంశాలపై రెండు రోజులపాటు చర్చించేందుకు ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, వనరులు, చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించేందుకు ప్రత్యేక స్లాట్ కేటాయించామని చెప్పారు.

కాళేశ్వరం కమిషన్ తుది దశ విచారణ ప్రారంభం

విశాలాంధ్ర- హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పరిధిలోని బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ కోసం ఏర్పాటైన కాళేశ్వరం కమిషన్... తుది దశ విచారణ మొదలుపెట్టింది. మే రెండో వారం వరకు విచారణ కొనసాగించనుంది. అనంతరం ప్రభుత్వానికి తుది నివేదిక ఇవ్వనుంది. ఇప్పటి వరకు 400 పేజీల రిపోర్ట్ సిద్ధం చేసిన కమిషన్.. దాదాపు 90 శాతం రిపోర్ట్ పూర్తి చేసింది. ఇంకా కమిషన్‌కు ఎన్‌డీఎస్‌ఏ ఫైనల్ రిపోర్ట్ అందకపోవడంతో ఆ నివేదిక కోసం ఎన్‌డీఎస్‌ఏకి కమిషన్ లేఖ రాసింది. ఫైనల్ రిపోర్ట్ కోసం ఎన్‌డీఎస్‌ఏ మరో మూడు వారాల సమయం కోరింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచారణ కీలక దశకు చేరుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో తీసుకున్న నిర్ణయాల్లో కీలకపాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి ప్రశ్నించాల్సి ఉంది. వారికి సమన్లు పంపి క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని కోరే అవకాశముంది. ఇప్పటికే వివిధ దఫాలుగా నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో బ్యారేజీల నిర్మాణంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజినీర్లు, ఇతర ఇంజినీర్లతోపాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ ప్రశ్నించి కీలక సాక్ష్యాధారాలు సేకరించింది. వీటిని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల ముందు ఉంచి ప్రశ్నించనున్నట్టు తెలిసింది.

పార్లమెంటరీ పంథాలో ఎగుడు దిగుళ్లు

కమ్యూనిస్టు పార్టీల మీద జనానికి ఉన్న ఆదరణ ఓట్ల రూపంలో వ్యక్తం కావడం క్రమంగా తగ్గుతూ వచ్చింది. 1998 ఎన్నికలలో కాంగ్రెస్ 25.82 శాతం ఓట్లు సంపాదించి 141 సీట్లు సాధించింది. బీజేపీ 25.59 శాతం సాధించి 182 స్థానాలలో గెలిచింది. సీపీఐ 1.75 శాతం ఓట్లతో 9 సీట్లు సంపాదించింది. లోక్‌సభలో సీపీఐ సీట్లు సంఖ్య స్థాయి నుంచి అంకెల స్థానానికి తగ్గిపోవడం ఇదే మొదలు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

భారత్‌తో వాణిజ్యం నిలిపివేత

విమానాలకు దారులు మూసివేత
పాక్ నిర్ణయం

ఇస్లామాబాద్: పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో పాక్‌కు వ్యతిరేకంగా భారత్ తీసుకున్న నిర్ణయాలపై పాక్ స్పందించింది. భారత్‌తోనూ అన్ని వాణిజ్య కార్యకలాపాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌కు చెందిన అన్ని విమానయాన సంస్థలకు చెందిన విమానాలకు పాక్ గగనతలాన్ని తక్షణం మూసివేస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు పాకిస్తాన్ ప్రధాన కార్యాలయం ప్రెస్‌నోట్ విడుదల చేసిందని జాతీయ మీడియా పేర్కొంది. ఇస్లామాబాద్‌లోని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నివాసంలో ఆ దేశ త్రివిధ దళాల అధిపతులు, ఇతర ప్రభుత్వ అధికారులతో నేషనల్ సెక్యూరిటీ కమిటీ(ఎన్ఎస్సీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. పాకిస్థాన్ గుండా లేదా ఇతర దేశాల నుంచి వెళ్లే వస్తువులతో సహా భారతదేశంతో అన్ని రకాల వాణిజ్యాన్ని నిలిపివేసింది. కాగా వాఘా బోర్డర్‌ను మూసివేస్తున్నట్లు పాక్ ప్రధాని కార్యాలయం ప్రకటించింది. ప్రాంతీయ భద్రతా, జాతీయ భద్రతా పర్యావరణం గురించి పేర్కొన్నది. 1972లో కుదిరిన సిమ్లా ఒప్పందాన్ని సస్పెండ్ చేస్తున్నట్లు పాకిస్థాన్ ప్రకటించింది. దీంతో వాఘా బోర్డర్‌ను మూసివేశారు. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలనే భారతదేశ నిర్ణయాన్ని సమావేశం తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపింది.

సింధూ జలాల్లో ప్రతి చుక్కా మాదే!

సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికే వరకు పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు భారత ప్రభుత్వం ప్రకటించిన సంగతి విదితమే. దీనిపై పాక్ స్పందించింది... భారత్ తీసుకున్న నిర్ణయం చట్టవిరుద్ధమని పాక్ మంత్రి అవాయిస్ లెఘారీ పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు మధ్యవర్తిగా ఉన్న ఈ ఒప్పందం నుంచి భారత్ ఏకపక్షంగా వైదొలిగే అవకాశం లేదని...ఈ చర్యతో నీటి యుద్ధానికి తెరలేస్తుందని తలిపారు. 'సింధూ జలాల్లో ప్రతి నీటి చుక్కా మాదే..! ఈ హక్కును మేం చట్టపరంగా, రాజకీయంగా, అంతర్జాతీయంగా పూర్తిశక్తితో కాపాడుకుంటాం"అని లెఘారీ ఓ పోస్ట్‌లో రాసుకొచ్చారు.

ఈ పరిణామాలపై చట్టపరంగా ముందుకెళ్లే అంశాలను పాక్ పరిశీలించినట్లు సమాచారం. అయితే ఏ దేశంతో కుదుర్చుకున్న ఒప్పందాన్నైనా రద్దుచేసుకునే హక్కు భారత్‌కు ఉంటుంది. అంతర్జాతీయ ఒప్పందాలకు సంబంధించిన వియన్నా ఒప్పందంపై భారత్ సంతకం చేయలేదు కాబట్టి పాక్ ఏ కోర్టుకు వెళ్లినా, అంతర్జాతీయ సంస్థకు వెళ్లినా వారు ఎటువంటి తీర్పు ఇచ్చినా భారత్‌కు వర్తించదు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి దృష్ట్యా దీని అమలును న్యూఢిల్లీ నిలిపివేసింది. ఇది పాక్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

క్షిపణి పరీక్షకు ఆదేశాలు...భారత్ అప్రమత్తం

పహల్గాం ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్ మరింత కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది.

తాజాగా క్షిపణి పరీక్షకు పాక్ ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏప్రిల్ 24-25 తేదీల్లో అనగా గురు, శుక్రవారాల్లో ఉపరితలం నుంచి ఉపరితలం వరకు కరాచీ తీరం వెంబడి క్షిపణి పరీక్ష నిర్వహించాలని నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో భారత్ దర్యాప్తు సంస్థలు అప్రమత్తం అయ్యాయి. ఈ పరిణామాలపై నిఘా పెట్టాయి. ఇక కేంద్ర హోంశాఖ కూడా అప్రమత్తం అయింది. ఉన్నతాధికారులతో హోంశాఖ చర్చలు జరుపుతోంది.

ఆగ్నేయాసియాపై ట్రంప్ భారీ సుంకాలు

వాషింగ్టన్: ఆగ్నేయాసియాపై ట్రంప్ సర్కారు కన్నెర్ర చేసింది. డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అమెరికాకు అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పుడు చైనా కంపెనీలు చాలా వరకు ఆగ్నేయాసియాకు తరలిపోయాయి. దీంతో ట్రంప్ ఇప్పుడు ప్రతీకార సుంకాల నెపంతో అక్కడి దేశాలపై విరుచుకుపడ్డారు. కంబోడియా, వియత్నాం, మలేసియా, థాయిలాండ్ నుంచి 'సోలార్' పరికరాల దిగుమతులపై సుంకాలను అమాంతం పెంచేశారు. అత్యధికంగా 3,521 శాతం సుంకాన్ని అమెరికా విధించింది. ఈ దేశాల్లోని సోలార్ తయారీదారులు చైనా సబ్సిడీలతో అక్రమ పద్ధతుల్లో లాభపడ్డారని, అమెరికా మార్కెట్‌ను చౌకబారు సరుకుతో నింపారని తమ దర్యాప్తులో తేలడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు ట్రంప్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే అంతర్జాతీయ సరఫరా గొలుసులు, విపణులపై విధించే 10 శాతం సుంకాలకు అదనంగా కొత్త టారిఫ్‌లు అమల్లోకి వచ్చాయి. దీంతో కంబోడియా నుంచి సోలార్ దిగుమతులపై అత్యధికంగా 3,521 శాతం సుంకాలు అమలు కాగా, వియత్నాంలోని కంపెనీలపై 395.9 శాతం, థాయిలాండ్‌పై 375.2 శాతం, మలేసియాపై 34.4 శాతం చొప్పున సుంకాలు అమల్లోకి వచ్చాయి. గతేడాది వియత్నాం, థాయిలాండ్, కంబోడియా, మలేసియా నుంచి 12.9 బిలియన్ డాలర్ల విలువ చేసే సౌర పరికరాలను అమెరికా దిగుమతి చేసుకుంది. ఈ కొత్త సుంకాలతో అమెరికా పునరుత్పాదక శక్తి విపణికి దేశీయ తయారీదారులు కైవసం చేసుకునే వీలు కలుగుతుందని పరిశీలకుల అంచనా.

మేలో స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ 39వ మహాసభలు

స్టాక్‌హోమ్: స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ (ఎస్‌కేపీ) 39వ మహాసభలు మే 30-31 తేదీల్లో స్టాక్‌హోమ్‌లో జరగనున్నాయి. ఈ మేరకు పార్టీ అంతర్జాతీయ విభాగం ప్రకటించింది. శాంతి, సోషలిజం కోసం పోరాటాల్లో మన పార్టీని బలోపేతం చేద్దాం అనే నినాదంతో మహాసభలు జరుగుతాయని అధికారిక ప్రకటన వెల్లడించింది. 38వ మహాసభలు జరిగిన నాలుగేళ్ల తర్వాత తాజా మహాసభ జరగనుంది. ప్రతి దేశంలలో కమ్యూనిస్టులు తమ సంస్థను బలోపేతం చేసుకోవాలని, పోరాటాలను ఉధృతం చేయాలని స్వీడెన్ కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. గత మహాసభల తర్వాత జరిగిన కార్యకలాపాలపై 39వ మహాసభలో నివేదిక ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటన తెలిపింది.

ఏయూలో నియంత పోకడ!

- ఇష్టారీతిన వీసీ... వివాదాస్పద నిర్ణయాలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: దేశంలోనే పేరెన్నికగన్న ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రతిష్ట మసకబారెలా వైస్ ఛాన్సలర్ తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. తాను ఐఐటీ నుంచి వచ్చిన మేథావినని వీసీ భావిస్తూ తమను చిన్నచూపు చూస్తున్నారని ఆచార్యులు ఆవేదన వ్యక్త పరుస్తున్నారు. బోధ నేతర సిబ్బంది విషయానికి వస్తే ... వారితో నాకు పనేంటి అనే రీతిలో ఉపకులపతి వ్యవహరిస్తున్నారని వారు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ఈ వివాదాల నడుమ ఆంధ్ర విశ్వవిద్యాలయ వందేళ్ల పండగ కళతప్పి వెలవెల బోతుంది. దీనికంతటికీ వైస్ ఛాన్సలర్ గా నియమితులైన ఆచార్య జి.పి.రాజశేఖర్ వ్యవహారశైలే ప్రధాన కారణమని వర్సిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్రంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల ఉపకులపతులు రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇతవ వర్సిటీలు ఎలా ఉన్నా ప్రతిష్టాత్మక వర్సిటీగా పేరుగాంచి, రాష్ట్రంలో అన్ని వర్సిటీలకు వీసీలను అందిస్తున్న

ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్ ఎవరు అనేది దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. అనేక రాజకీయ సమీకరణాలు, కూడికలు, తీసివేతలు చూసుకుని ఐఐటీ ఆచార్యులుగా పనిచేసిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ఆచార్య జి.పి. రాజశేఖర్ ను రాష్ట్ర ప్రభుత్వం ఏయూ వీసీగా నియమించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ఉన్న సీనియర్ ఆచార్యులను కాదని వర్సిటీ యేతర వ్యక్తిని ఏయూ వీసీగా నియమించడం పట్ల అనేక విమర్శలు వచ్చాయి. కానీ ఆయన ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందినవారు కావడంతో అంతా సర్దుకుని అతనికి అన్ని విధాలా సహకారం అందించాలనే నిర్ణయానికి కట్టుబడి బోధన, బోధ నేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు ... ఇలా అన్ని వర్గాలు ఆయనకు తమ వంతు సహకారం అందిస్తూ వచ్చారు. దీనికి ప్రధాన కారణం వర్సిటీ వందేళ్ల పండుగ అని చెప్పక తప్పదు. ఏయూ శతాబ్ధోత్సవ సంబరాన్ని అంగరంగ వైభవంగా జరిపేందుకు అంతా ఒకతాటి పైకి వచ్చారు. కానీ అనూహ్యంగా రథసారథిగా అంతా తానై నడిపించాల్సిన వీసీ రాజశేఖర్ ఆదిలోనే చేతులెత్తేశారని వర్సిటీ వర్గాలు తీవ్ర ఆవేదన వెలిబుచ్చాయి. తొలినుంచి నాకెందుకులే అనే రీతిన వ్యవహరిస్తూ శతాబ్ధోత్సవాల ఏర్పాట్ల విషయంలో ఎవరినీ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వీసీ తరువాత అకడమిక్ హెడ్ అయిన రెక్టార్ ను కానీ, వర్సిటీ పరిపాలన హెడ్ అయిన రిజిస్ట్రార్‌ను కానీ వీసీ పట్టించుకోకుండా వారితో ఏ విషయంలో కూడా సమాలోచనలు జరపకుండా వారిని చిన్నచూపు చూశారని సీనియర్ ఆచార్యులు మండిపడుతున్నారు. అక్కడితో ఆగకుండా తామందరం కలిసి వెళ్దాం అన్నా రెక్టార్, రిజిస్ట్రార్‌తో పాటు కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, ఆచార్యులు, తాత్కాలిక బోధన సిబ్బంది, బోధ నేతర సిబ్బంది ఇలా ఎవరికీ తనను కలిసే అవకాశం లేకుండా చేశారని వాపోతున్నారు. ఇదే విషయమై పెద్ద ఎత్తున విమర్శలు రావడం... ప్రభుత్వ పెద్దలకు, విద్యాశాఖ మంత్రి కి ఫిర్యాదులు వెళ్లడంతో వీసీ కొంత వెనక్కు తగ్గినట్టు తెలుస్తోంది. ప్రతిరోజు వర్సిటీ వర్గాలు తనతో భేటీ కావచ్చు అంటూ తాజాగా ఉత్తర్వులు జారీచేశారని వారు గుర్తు చేశారు. అక్కడితో ఆగకుండా విశాఖలోని ఒక ప్రముఖ ప్రైవేటు విశ్వవిద్యాలయానికి చెందిన వ్యక్తులను తరచూ కలుస్తూ ఏయూలోని విషయాలు చేరవేస్తున్నారని బోధనా సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఏయూ వందేళ్ల పండుగను అసలు పట్టించుకోకుండా వర్సిటీ ప్రతిష్టను మంటగలుపుతున్నారని ఆయా వర్గాలు మండిపడుతున్నాయి.వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగేలా ఉపకులపతి సహా ఎవరు వ్యవహరించినా ఊరుకునేది లేదని, ఈ విషయంలో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమని ఆయా వర్గాలు స్పష్టం చేశాయి. వర్సిటీ ప్రతిష్టను ఇనుమడింపజేసేలా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఏయూ వందేళ్ల పండుగ నిర్వహణ బాధ్యతను భుజాన వేసుకోవాలని, అలా కాని పక్షంలో... ఏయూ వందేళ్ల పండుగ ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని వర్సిటీ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై త్వరలో ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిని కూడా కలిసి ఈ పరిస్థితిని వివరించనున్నామని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.

బక్కచిక్కుతున్న చెరువులు!

- ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

విశాలాంధ్ర- లింగపాలెం: ఏలూరు జిల్లాలో మట్టి మాఫియా చెలరేగిపో తోంది. మెట్ట ప్రాంతాలలోని చెరువులను ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ మట్టిని అమ్మేసు కుంటున్నారు. పగలూ రాత్రి అన్న తేడా లేకుండా నిరంతరం చెరువుల్లో మట్టి తరలించుకుపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. రాజకీయ పలుకుబడి, ప్రభుత్వ పెద్దల అండ ఉన్న ఈ గ్యాంగ్... బరితెగించి చెరువు మట్టిని మింగేస్తున్నారు. మట్టి దందా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు ఎవరూ ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. మాఫియా ప్రలోభాలకు తలొగ్గి మట్టి అక్రమంగా తరలించుకుపోతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు బాహాటంగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఇష్టానుసారంగా చెరువులను తవ్వేయటంవల్ల రూపురేఖలు మారిపోతున్నాయని గ్రామస్థులు లబోదిబో మంటున్నారు. మెట్ట ప్రాంతంలో చెరువుల ఉన్నా... లేనట్లుగానే ఉంది. మట్టి అక్రమ తవ్వకాలవల్ల చెరువుల మనుగడ ప్రమాదంలో పడింది. చెరువుల స్వరూపమే మారిపోతుంది... కాపాడండి అంటూ ఫిర్యాదులు చేస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తవ్వకాలను నిలువరించేందుకు వెళ్లిన తమ సిబ్బందిపై మాఫియా ముఠా దౌర్జన్యాలకు పాల్పడటంతో చేసేదిలేక వెనుతిరిగి వస్తున్నామని ఇరిగేషన్ శాఖ అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో తాము ఏం చేయగలమంటూ తన నిస్సహాయతను వెలుబుచ్చారు. మట్టి తవ్వకాలను ఆపటానికి మీరెవరూ... ఆపితే మీ సంగతి చూస్తామంటూ మాఫియా బెదిరింపులకు దిగుతోందని, ఇటువంటి పరిస్థితుల్లో తాము ఏం చేయలేక పోతున్నామని కొందరు అధికారులు అంటున్నారు. ఇదిలా ఉంటే... అక్రమాలను అడ్డుకోవడంలో ఉన్నతాధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. మట్టిని తరలించుకుపోతున్న ట్రాక్టర్లు అతివేగంతో దూసుకుపోతుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏలూరు జిల్లాలో మెట్ట ప్రాంతం అధికంగా ఉంది. జిల్లాలో 650 చెరువులు ఉన్నాయి. దాదాపు 60 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇష్టానుసారంగా చెరువులను తవ్వేయటం వల్ల 30 శాతం మించి ఆయుకట్టుకు నీరు అందని పరిస్థితి నెలకొంది.

'కర్రెగుట్ట'లో భీకర ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సంఖ్యలో ఉన్నారనే సమాచారం రావడంతో కేంద్ర పారామిలటరీ బలగాల నేతృత్వంలో ఈ ఆపరేషన్ చేపట్టారు. కర్రెగుట్టలలో దాదాపు 1000 మంది మావోయిస్టులు దాగి ఉన్నట్లు తెలుస్తోంది. అగ్రనేత హిడ్మా నేతృత్వంలో వీరంతా అక్కడకు చేరినట్లు సమాచారం. వీరిలో కమాండర్ స్థాయి నేతలు, మావోయిస్టు అగ్ర నాయకులు ఉన్నట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందడంతో ఈ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. ఫలితంగా భీమవరంపాడు, పూజారీ కాంకేర్, పామేడు అటవీ ప్రాంతాల్లో కాల్పుల మోత మోగుతోంది.

అటు కూంబింగ్ నేపథ్యంలో కర్రెగుట్ట దండకారణ్యంలోని వివిధ గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. గాలింపు చర్యల్లో డీఆర్‌జీ బస్తర్ ఫైటర్ కోబ్రా, సీఆర్పీఎఫ్, ఎస్టీఎఫ్ సైనికులతో పాటు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర పోలీసులు పాల్గొన్నారు. మందుపాతరలు అమర్చామని, ప్రజలెవరూ అటవీ ప్రాంతంలోకి రావొద్దని ఇప్పటికే మావోయిస్టులు లేఖల ద్వారా హెచ్చరించారు. దీంతో గాలింపు అత్యంత అప్రమత్తంగా చేపట్టాయి భద్రతా బలగాలు. బుధవారం నాటికి 3 వేల మంది బలగాలతో కూంబింగ్ చేపట్టగా, గురువారం ఉదయం అదనంగా మరో 2 వేల మందిని రప్పించారు. ఫలితంగా సుమారు 5 వేల మంది భద్రతా సిబ్బంది కర్రెగుట్టల అటవీప్రాంతాన్ని చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. కానీ, భద్రతా బలగాల సంఖ్య 20వేల వరకు ఉంటుందని వివిధ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. బస్తర్, అబూజ్‌బడ్ దండకారణ్యంపై అగ్ర నేత హిడ్మాకు పూర్తి అవగాహన ఉంది. అతడిని లక్ష్యంగా చేసుకునే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు తెలుస్తోంది. హిడ్మాతో పాటు మావోయిస్టు బెటాలియన్ చీఫ్ దేవాను లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం.

14 మంది లొంగుబాటు

మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సమక్షంలో 14 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు కాగా 12మంది మిలీషియా సభ్యులు. వీరిలో 13 మంది చత్తీస్‌గఢ్, ఒకరు తెలంగాణకు చెందినవారు ఉన్నారు. లొంగిపోయిన వారికి రూ.25 వేల చొప్పున రివార్డు అందజేశారు. కాగా, కర్రెగుట్ట ఆపరేషన్‌లో తెలంగాణ పోలీసుల ప్రమేయం లేదని ఐజీ తెలిపారు.

స్మార్ట్ పాలన

(మొదటిపేజీ తరువాయి)

అనుసరిస్తున్నారని, పాలనలో తీరు మారాలన్నారు.

భూరికార్డుల డిజిటలైజేషన్ వేగవంతం

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల్లో అధికంగా 75 శాతం భూసంబంధితమైనవే ఉన్నాయని, ఈ సమస్య పరిష్కారానికి త్వరితగతిన భూ రికార్డుల డిజిటలైజేషన్ చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఒకప్పుడు ఇస్రో ఉపగ్రహ ప్రయోగాలను ఆశ్చర్యంగా చూశామని, ఇప్పుడు మన స్టార్టప్‌లు రూ.30 కోట్లతో ఉపగ్రహాలను తయారు చేస్తున్నాయని, దీంతో ప్రపంచం మనవైపు గర్వంగా చూస్తోందన్నారు. ఈ వర్క్‌షాప్ దేశానికి ఒక నమూనాగా నిలుస్తుందని, డిజిటల్, డైనమిక్, ప్రజల కోసం పని చేసే పాలనకు ఇది ఆరంభమని ముఖ్యమంత్రి అన్నారు.

రెండు రోజుల పాటు వర్క్‌షాప్

రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌లో గుడ్ గవర్నెన్స్ కోసం ఏఐ సహా నూతన టెక్నాలజీ వినియోగం, పౌర సేవల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. ఏఐ, ఎంఎల్, డీఎల్, చాట్ జీపీటీ, జెమిని, డేటా డ్రివెన్, ఎవిడెన్స్ బేస్డ్ గవర్నెన్స్, ఏఐ ప్లేబుక్, ఏఐ బేస్డ్ పైలెట్ ఐడియాస్ వంటి అంశాలపై ప్రత్యేక సెషన్స్ జరుగుతాయి. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పౌర సేవల్లో టెక్నాలజీ వాడకం, ప్రస్తుతం అనుసరిస్తున్న విధానాలు, వచ్చే ఫలితాలపై కేస్ స్టడీస్‌ను అధికారులు పరిశీలిస్తారు. ఏయే విభాగాల్లో ఎటువంటి సాంకేతికను వినియోగించవచ్చు, ప్రస్తుతం ఉన్న సమాచారం ఆధారంగా సేవల్ని ఎలా విస్తృత పరచవచ్చు అనే దానిపై ప్రజంటేషన్ ద్వారా నిపుణులు విశ్లేషిస్తారు. వ్యవసాయం, విద్య, వైద్య, పట్టణాభివృద్ధి సహా వివిధ రంగాల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని వివరిస్తారు. వర్క్‌షాప్‌లో మొదటిరోజు కార్యదర్శులు హాజరుకాగా, రెండోరోజు విభాగాధిపతులు పాల్గొంటారు. ఈ వర్క్‌షాప్‌కు సీఎస్, డీజీపీ, వివిధ శాఖల అధికారులు, కేంద్ర ఐటీ శాఖ మాజీ సెక్రటరీ చంద్రశేఖర్, వాద్వాని సెంటర్ ఫర్ గవర్నమెంట్ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సీఈవో ప్రకాష్ కుమార్, డబ్ల్యుజీడీటీ డీన్ కమల్ దాస్ హాజరయ్యారు.

నేడు దిల్లీకి చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరలా దిల్లీ వెళుతున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు భేటీ అవుతారు. మే 2వ తేదీన ఏపీలో ప్రధాని మోదీ పర్యటించనున్న సమయంలో చంద్రబాబు తన సతీమణి భువనేశ్వరితో కల్సి ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించనున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయనకు వివరించి... కేంద్ర సహాయం కోరనున్నారు. రేపు రాత్రికి దిల్లీలోనే సీఎం చంద్రబాబు బస చేస్తారు. శనివారం ఉదయం సీఎం దిల్లీ నుంచి బయలుదేరి నేరుగా విశాఖపట్నానికి వెళతారు. అక్కడనుంచి శ్రీకాకుళం జిల్లా పర్యటనకు వెళ్లనున్నారు.

పీపీపీ విధానంతోనే వేగంగా వృద్ధి

పీపీపీ విధానంలో రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులను పెద్దఎత్తున చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. గురువారం సచివాలయంలో పీపీపీ విధానాన్ని విస్తృతం చేసే అంశాన్ని అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలు సాధించాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు భారీగా రావాలన్నా పీపీపీ విధానమే ఉత్తమ మార్గమని చెప్పారు. గతంలో తన పాలనా కాలంలో సంస్కరణలు అమలు చేశామని, అందులో భాగంగా పీపీపీ విధానాన్ని వినియోగించి మంచి ఫలితాలు రాబట్టామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. జిల్లా ఒక యూనిట్‌గా జాతీయ రహదారులను అనుసంధానిస్తూ రహదారులు నిర్మాణం, పోర్టులు, వైద్యరంగం, పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పనలో పీపీపీ విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. రాష్ట్రంలో 1,422 కిలోమీటర్ల పొడవైన 20 రహదారులను పీపీపీ పద్ధతిలో చేపట్టేందుకు డీపీఆర్‌లు సిద్ధం. సాధ్యాసాధ్యాలను బట్టి దీనిని 8,893 కిలోమీటర్లకు పెంచే వీలుందన్నారు. ఖనిజ వనరులను ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.9 వేల కోట్లు ఆదాయం పొందే అవకాశం ఉందని, పరిశ్రమలకు అవసరమయ్యే మౌలిక వసతుల కల్పనకు ఏపీఐఐసీ మద్దతుతో రూ.5,000 కోట్ల రుణాల సేకరణ లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.

ఐఎన్ఎస్ సూరత్ ప్రయోగం సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

పన్నినట్లు నివేదికలు అందుతున్న నేపథ్యంలో తాజా ప్రయోగం పాకిస్థాన్‌కు హెచ్చరికగా భావిస్తున్నారు. అంతేకాకుండా పాకిసాంథన్ తన కరాచీ తీరప్రాంతం నుండి, దాని ప్రత్యేక ఆర్థిక మండలంలో ఉపరితలం నుండి ఉపరితలం వరకు క్షిపణి పరీక్ష నిర్వహించాలని ప్రణాళికలు వేస్తున్నట్లు నిఘా వర్గాల సమాచారం నేపథ్యంలో ఈ ప్రయోగం జరగడం విశేషం. పరీక్ష ప్రయోగం వీడియోను పంచుకుంటూ భారత నావికాదళం తాజా స్వదేశీ గైడెడ్ క్షిపణి విధ్వంసక నౌక ఐఎస్ఎస్ సూరత్ సముద్ర స్కిమ్మింగ్ లక్ష్యాన్ని విజయవంతంగా నిర్వహించిందని, ఇది మన రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో మరో మైలురాయిని సూచిస్తుందని పేర్కొంది.

హైదరాబాద్, తిరుమలలో హై అలర్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఘటనలకు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు. మరో వైపు, తిరుమలలో కూడా భద్రతను అధికారులు కట్టుదిట్టం చేశారు. సెక్యూరిటీని టీటీడీ కట్టుదిట్టం చేసింది. తిరుమల ఘాట్ రోడ్డులోని లింక్ రోడ్డు సమీపంలో వాహనాలను టీటీడీ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేస్తున్నారు. అనుమానం వచ్చిన వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. తిరుమలలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

సమీకరణ కాదంటే సేకరణే

(మొదటిపేజీ తరువాయి)

ఎయిర్‌పోర్టు ఉండగానే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు నాడు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించారని నారాయణ గుర్తు చేశారు. ఆ ఎయిర్‌పోర్టు లేకుంటే హైదరాబాద్‌లో 10 శాతం విమానాలు కూడా దిగేవి కాదన్నారు. 100 ఏళ్లను దృష్టిలో పెట్టుకొని అమరావతిని ఆయన నిర్మిస్తున్నారన్నారు. స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తేనే అభివృద్ధి జరుగుతుందని, ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఉంటేనే స్మార్ట్ ఇండస్ట్రీస్ వస్తాయని మంత్రి అన్నారు. దీనికి కనీసం ఐదు వేల ఎకరాల భూమి అవసరమన్నారు. భూ సమీకరణ ద్వారా 30 వేల ఎకరాలు సమీకరించాల్సి ఉన్నందున... ల్యాండ్ పూలింగ్‌కు ప్రజలు అంగీకరిస్తే ముందుకెళతాం... లేదంటే భూసేకరణపై ఆలోచిస్తామని నారాయణ చెప్పారు.

పెరిగిన భూముల విలువ నిలవాలన్నా, ఉన్న విలువ పెరగాలన్నా రాజధానిలో ఉపాధి సౌకర్యాలు ఉండాలి లేకపోతే విలువ పడిపోతుందన్నారు. అమరావతిలో ప్రధాని మోదీ పర్యటన కోసం 90 శాతం ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. అమరావతి పనులను మోదీ ప్రారంభిస్తారని, దాదాపు లక్ష కోట్ల పనులకు ఆయన శంకుస్థాపనలు చేస్తారని మంత్రి నారాయణ చెప్పారు. సభా వేదిక వద్దకు చేరుకునేందుకు ఎనిమిది రోడ్లు, 11 పార్కింగ్ ప్రాంతాల్ని గుర్తించినట్లు తెలిపారు. ఐదు లక్షల మంది సభను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నామని నారాయణ వెల్లడించారు.

ఏకచ్ఛత్రాధిపత్యమే మోదీ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

సిగ్గుండాలని విమర్శించారు. బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు జాతీయ జెండా మోసే నైతిక హక్కు లేదని రాజా అన్నారు.

పహల్గాం ఉగ్ర దాడిపై తగిన రీతిలో స్పందించడం అవసరమని కేంద్ర ప్రభుత్వానికి రాజా హితవు పలికారు. దీనిని రాజకీయం చేయరాదన్నారు. దేశాన్ని విభజించేందుకు, హిందూ-ముస్లిం పేరిట అల్లర్లు రెచ్చగొట్టేందుకు ఉగ్రదాడిని అస్త్రంగా మార్చుకోవద్దని తేల్చిచెప్పారు. సీమాంతర ఉగ్రవాదాన్ని అంతం చేయాలని ఉద్ఘాటించారు. దేశ ప్రజలు అప్రమత్తం కావాలన్నారు. సరిహద్దు ఆవలి ఉగ్రవాదంపై పోరాటానికి సంబంధించి స్పష్టమైన వైఖరితో సీపీఐ ఉందని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ పరిస్థితి దారుణంగా ఉందని, చాలాచోట్ల సైనిక ఘర్షణలు జరుగుతున్నాయని, గాజాలో పలస్తీనా ప్రజల మారణహోమం సాగుతోందని, వేలాదిమంది పిల్లలు, మహిళలు చనిపోతున్నారని, ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం సాగుతోందని, సైనిక తిరుగుబాట్లు/ఘర్షణలు తలెత్తితే పరిష్కరించడం కష్టమని రాజా ఆందోళన వ్యక్తంచేశారు.

జమ్మూకశ్మీర్ ప్రజలు, రాజకీయ పార్టీలు, భాగస్వాములతో చర్చలు జరపాలని, వారి విశ్వాసాన్ని పొందాలని మోదీ ప్రభుత్వానికి రాజా సూచించారు. మోదీ ప్రభుత్వానికి స్వతంత్ర విదేశాంగ విధానం లేకపోవడం వల్లే ఉగ్రదాడులు జరుగుతున్నాయన్నారు. అమెరికా సామ్రాజ్యవాద శక్తికి, డొనాల్డ్ ట్రంప్ ఒత్తిళ్లకు మోదీ ప్రభుత్వం తలొగ్గుతోందని విమర్శించారు. భారతదేశ స్వయంప్రతిపత్తి, స్వావలంబన, వైవిధ్యతను వేడుకగా చేసుకోవాలని సూచించారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఇందుకు భిన్నంగా భారత్ వైవిధ్యతను దెబ్బతీస్తూ...భిన్నత్వంలో ఏకత్వానికి భంగం కలిగిస్తున్నాయని రాజా విమర్శించారు. 1957లో మొదటిసారి ఒకే పార్టీ పాలనకు స్వస్తి పలికి... ప్రపంచంలోనే మొదటిసారి కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఎన్నుకొని కేరళ ప్రజలు చరిత్ర సృష్టించారని గుర్తుచేశారు. గవర్నర్ల వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలు హరించేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తోందని దుయ్యబట్టారు. 2026లో కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ తిరిగి అధికారంలోకి రావాలని కాంక్షించారు. ఇందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ధనబలంతో బీజేపీ రాష్ట్రాల్లో ప్రజా ప్రభుత్వాలను కూల్చేస్తోందని, ఎన్నికల బాండ్ల ద్వారా దేశాన్ని లూటీ చేసిందని, ధనిక పార్టీ కాగలిగిందని దుయ్యబట్టారు. ఎల్డీఎఫ్‌ను తిరిగి అధికారంలోకి తేవడం ద్వారా ధన రాజకీయాలు కేరళలో చెల్లవని బీజేపీ-ఆర్ఎస్ఎస్‌కు స్పష్టమైన సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సీపీఐ విధానాలు, ప్రచారాలు, ఉద్యమాలు, పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని దేశ ప్రజలను రాజా కోరారు. సీపీఐ ఘన చరిత్ర గురించి ప్రత్యేకించి చెప్పనక్కర్లేదని, 1925లో ఆవిర్భవించిన పార్టీ ఇప్పుడు శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటోందని అన్నారు. దేశం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, బీజేపీ, మోదీ సర్కారు విభజన-మతోన్మాద అజెండాతో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయన్నారు. బీజేపీని అధికారానికి దూరం చేస్తేనే దేశానికి విముక్తి లభించగలదని, ఇదే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, తమ పోరాటంలో కలిసి రావాలని పార్టీలకు, ప్రజలకు రాజా పిలుపునిచ్చారు.

రేవంత్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమ నినాదాలను నిజం చేయడమే కాదు, గ్రామస్వరాజ్యం కోసం జాతిపిత మహాత్మగాంధీ కన్నకలలను తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సాకారం చేశారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వెల్లడించారు. గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం జరుపుకుంటున్న వేళ, పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలన్న మహాత్మాగాంధీ ఆశయాలే స్ఫూర్తిగా బీఆర్ఎస్ పాలనలో ప్రాణంపోసిన 'పల్లెప్రగతి'ని గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిది అని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కేసీఆర్ సంకల్పంతో ప్రతి పల్లెసీమ ప్రగతిసీమగా మారిందని కొనియాడారు. కలుషిత నీటి కలకలం లేకుండా, సీజనల్ రోగాల చింతన లేకుండా సాగిన పంచాయతీల ప్రస్థానం గ్రామస్వరాజ్యంలో ఓ స్వర్ణయుగమని తెలిపారు. దేశంలో మూడు శాతం జనాభా ఉన్న తెలంగాణ, పల్లెప్రగతిలో 30 శాతం అవార్డులను గెలుచుకోవడం పల్లె ప్రగతిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి విజయమని అన్నారు. కాంగ్రెస్ పాలనలో గ్రామస్వరాజ్యం పూర్తిగా గాడితప్పిందని విమర్శించారు. ఏడాదిన్నర గడిచినా స్థానిక సంస్థలకు ఎన్నికలు లేవని చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులు లేవని అన్నారు. గ్రామాల్లో కనీస వసతులు లేవన్నారు. పల్లెప్రజలకు గుక్కెడు మంచినీళ్లకు దిక్కు లేదని చెప్పారు. చివరికి పంచాయతీ సిబ్బందికి వేతనాలు లేవు. ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు లేవు, మాజీ సర్పంచ్‌ల బిల్లులకే మోక్షం లేదని అన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామాలకు చిరునామాగా నిలిచిన తెలంగాణ పల్లెలు అధ్వాన పరిస్థితులకు అడ్రస్‌గా మారడం అత్యంత బాధాకరమని అన్నారు. రేవంత్ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసిన తీరును తెలంగాణ పల్లె ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి తీవ్ర అన్యాయం చేస్తున్న బీజేపీకి, పచ్చని పల్లెలను సంక్షోభంలోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీకి కర్రుగాల్చి వాతపెడతారని మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు.

మామిడి పండ్ల మార్కెట్‌ను ప్రారంభించిన కలెక్టర్

విశాలాంధ్ర - ఖమ్మం : రైతులు, వినియోగదారులు మామిడి పండ్ల మార్కెట్‌ను వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మం నగరం రోటరీ నగర్‌లో గల వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మామిడి పండ్ల మార్కెట్‌ను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం నగరం రోటరీ నగర్‌లోని వీధి వ్యాపారుల ప్రాంగణంలో 30 పైగా స్టాళ్లతో మామిడి పండ్ల మార్కెట్‌ను నూతనంగా ఏర్పాటు చేసుకున్నామని, మొదటి రోజున మూడు స్టాల్‌లలో రైతులు పండ్ల అమ్మకం చేపట్టారన్నారు. ఖమ్మం పరిసర మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మామిడి రైతులు ఇక్కడికి విచ్చేసి పండ్లు విక్రయిస్తారని కలెక్టర్ తెలిపారు. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడే విధంగా మార్కెట్ అందుబాటులోకి వచ్చిందని, దళారులు లేకపోవడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని, వినియోగదారులకు సహజ సిద్ధంగా పండించిన కార్బైడ్ రహిత మామిడి పండ్లు అందేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వి. మధుసూదన్, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎంఏ అలీమ్, స్థానిక కార్పొరేటర్ నీరజ, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్టీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఎస్టీ కులాల వర్గీకరణ వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలని, ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం ములుగు మండలంలోని రాయినిగూడెంలో తుడుం దెబ్బ ఆవిర్భావ వ్యవస్థాపక అధ్యక్షులు దబ్బగట్ల నర్సింగరావు స్వగ్రామంలో ముఖ్య కార్యకర్తల, వర్గీకరణ చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆదివాసి హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ హాజరై మాట్లాడుతూ ఆదివాసి తెగల్లో షెడ్యూల్ తెగల ఏబీసీడి వర్గీకరణ కోరుతూ 1996లో ఆదివాసి హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దబ్బకట్ల నరసింహారావు ఆశయ సాధనలో, షెడ్యూల్ తెగలల్లో ఏ బి సి డి వర్గీకరణ జరగాలని గత 29 సంవత్సరాల నుండి ఆదివాసి తుడుం దెబ్బ ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్టీ వర్గీకరణకు చేయాలని డిమాండ్చేశారు. అభివృద్ధికి ఎస్టీ వర్గీకరణ కమిషన్ నియమించాలని, ఈనెల 25న జెఏసీ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టామని, వేలాది మంది తరలి రావాలని అయన పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నేత దళిత రత్న నెమలి నర్సయ్య మాదిగ, తుడుం దెబ్బ ములుగు జిల్లా అధ్యక్షులు వట్టం జనార్దన్, నాయకపోడ్ దెబ్బ ఉత్తర తెలంగాణ జిల్లాల ఇంఛార్జ్ గాలి సమ్మయ్య, నాయకపోడ్, ఆదివాసి పోరాటాల సీనియర్ నాయకులు తవిటీ నారాయణ, మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకులు వావిలాల స్వామీమాదిగ, తుడుం దెబ్బ ములుగు జిల్లా కార్యదర్శి ఈగ జగ్గారావు, తుడుం దెబ్బ జిల్లా కమిటీ సీనియర్ నాయకులు వజ్జరాజు, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు కోట సంపత్, మహిళాలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి బిఆర్ఎస్ నేతలు

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గం లోని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడానికి క్యూ కడుతున్నారు. అందులో భాగంగా గురువారం గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు తొర్రూరు మండల అభివృద్ధి కమిటీ చైర్మెన్, నియోజకవర్గ స్థాయి నాయకుడు డా.పొనుగోటి సోమేశ్వర్ రావు ఆధ్వర్యంలో సుమారు 500 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టీపీసీసీ చీఫ్ బి. మహేష్ కుమార్ గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులలో తొర్రూరు మాజీ సర్పంచ్ రాజేష్ నాయక్, రాయపర్తి మాజీ ఎంపిపి కంజర్ల ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీలు సొమ్లు నాయక్, రాజేందర్, భోజ్యా, బానోత్ శ్రీను, జాతోత్ నరేష్, పద్మా యకేందర్, రవి నాయక్, కృష్ణ మూర్తి, నరసింహ నాయక్, మైనారిటీ నాయకులు ఎం.డి. అన్వర్, యూత్ నుంచి వీరమనేని రాజు, సురేష్ నాయక్, గుగులోతు అశోక్, నెహ్రూ నాయక్, మహిళా విభాగం నుంచి కేతావత్ అనుజా, దారవత్ అనిత, విమల వున్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు

విశాలాంధ్ర - ములుగుజిల్లా_బ్యూరో : నిబంధనలు పాటించని ప్రవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల్‌రావు హెచ్చరించారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రవేట్ హాస్పిటల్స్ యజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్ ప్రకారం, నియమ నిబంధనలు పాటించాలని, హాస్పటల్ యందు ధరల పట్టికలు, సేవలందించే డాక్టర్ల పేర్లను డిస్ప్లే చేయాలని, బయో- మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ సర్టిఫికెట్, ఫైర్ సర్టిఫికెట్ ఉండాలని, లేనియెడల, ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్- 2010 ప్రకారం హాస్పిటల్స్‌పై చర్య తీసుకోబడుతాయని, నిబంధనలు పాటించని ప్రవేట్ హాస్పిటల్‌కు 10.000 (పది వేల రూపాయలు)నుండి 5,00,000 (ఐదు లక్షల) వరకు జరిమానా విధించబడతాయని తెలిపారు. పి .సి. పి. యన్. డి.(పిసీ -పిఎన్డిటీ) ఆక్ట్ ప్రకారం లింగ నిర్ధారణ చేయకూడదని తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్స్ లింగ నిర్ధారణ చేసినట్లు నిర్ధారణ అయితే, వారిపై ఆక్ట్ ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ప్రతి నెల ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్‌లో చేసిన వైద్య సేవలను, హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో 5వ తారీకు లోపల నమోదు చేయాలని ఎస్.ఓ సరూప రాణి గారు ప్రైవేట్ హాస్పిటల్ యజమాన్యానికి హెచ్. ఎం.ఐ. ఎస్ పోర్టల్ గురించి ట్రైనింగ్ ఇచ్చినారు.

పీహెచ్‌సి సెంటర్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల పరిధిలోని చిల్లేపల్లి సబ్ సెంటర్‌ను గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్ర ధనుస్సు ఐ ఎం ఐ స్పెషల్ టీకాల కార్యక్రమంలో 0-5 సం.ల పిల్లలకు గతంలో టీకాలు వేయించుకొనివారికి మధ్యలో కొన్ని టీకాలు తీసుకోని ఆపిన వారికి, సంచార జాతుల వారికి, టీకాలు పూర్తిగా అందించాలని ఐ ఎం ఐ కార్యక్రమం ద్వారా వేస్తున్నారని తెలిపారు.0-5 సం. లలోపు పిల్లలు అందరు టీకాలు ఇప్పించి వ్యాధుల నుండి రక్షణ కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సి హెచ్ ఓ. సల్వది. శ్రీనివాస్, ఏ యన్ యం మమత ఆశా స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర రావు ఉన్నారు.

కొత్తగూడెంను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. ఐడిఓసి కార్యాలయంలో జిల్లా స్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాలు వినియోగం లేకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించకుండా ఉండేలా కళాశాల యజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలని కలెక్టర్ కోరారు. విద్యాసంస్థల్లో నిర్వహించే పేరెంట్స్ టీచర్ సమావేశాల్లో డ్రగ్స్, గంజాయి వినియోగం వల్లే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై వైద్య అధికారులతో అవగాహన కల్పించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టుల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో గంజాయితో పాటు గుడుంబా నివారణకు సైతం అవసరమైన చర్యలు కచ్చితంగా చేపట్టాలన్నారు. జిల్లాలో 50 శాతం పైగా అటవీ భూములు ఉన్నాయని, అడవిని నమ్ముకుని ఉన్న ఆదివాసిల అభివృద్ధి చెందేలా ఇప్ప, కరక్కాయ, వెలగా, ఉసిరి, చింత మొక్కలను విస్తృతంగా నాటేలా అవగాహన చేపట్టాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో యాంటీ నార్కోటిక్ బ్యూరో డిఎస్పి శరత్, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కరంచంద్, ఎక్సైజ్ సీఐ జానయ్య, డ్రగ్ ఇన్స్పెక్టర్ సంపత్, కొత్తగూడెం ఆర్ టి ఓ వెంకటరమణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వం

విశాలాంధ్ర- జిల్లా బ్యూరో మహబూబాబాద్: భారతరాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ భారత రాజ్యాంగ మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారధి పిలుపునిచ్చారు. గురువారం జిల్లాలోని కొరివి మండల కేంద్రంలోని నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం బి ప్రభేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా పాలన చేస్తున్న బిజెపి భారత రాజ్యాంగ వ్యవస్థలను చిన్నా భిన్నం చేస్తూ మత విద్వేషాలను రెచ్చగొడుతూ క్లారిటీ వర్గాలపై విచ్చలవిడిగా దాడులు చేస్తున్నారని ఆరోపణ చేశారు. రాజ్యాంగంలో కల్పించిన అవకాశాలను తుంగలో తొక్కి లౌకిక వ్యవస్థకు గొడ్డలిపెట్టుగా మారిన బిజెపి పాలనపై ప్రజాస్వామిక శక్తులు ఏకమై ప్రతిఘటించాలని కోరారు. మే నెలలో శాఖ మండలం మహాసభలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం ఆత్మ చైర్మన్‌గా నల్లు సుధాకర్ రెడ్డికి ఘన సన్మానం చేశారు.ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, మరిపెడ డివిజన్ ఆత్మ చైర్మన్‌గా నల్లు సుధాకర్ రెడ్డి ఎంపిక కావడం పట్ల పార్టీ జిల్లా కార్యదర్శి హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నెల్లూరు నాగేశ్వరరావు, కురవి, మరిపెడ, డోర్నకల్, దంతాలపల్లి మండల కార్యదర్శులు కరణం రాజన్న, మారగాని బాలకృష్ణ, తురక రమేష్, పోలెపాక వెంకన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, బుడమ వెంకన్న, దొంతు రామ్మూర్తి, తురక రమేష్, నర్సింగం గురవయ్య, బసవ కొమరయ్య, బొల్లం ఉప్పలయ్య కలగూర నాగరాజు, కన్న వెంకన్న, దూది కట్ల సారయ్య, బొల్లు వెంకన్న, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్లుగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, పిడి రాజకుమార్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ జే.శ్రీనివాస్ నెల రోజుల పాటు సెలవులో వెళ్లడంతో రెవెన్యూ అదనపు కలెక్టర్ పూర్తి అదనపు బాధ్యతలను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాధ్యతలను గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్‌కు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలను స్వీకరించారు. అలాగే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్ పూర్తి అదనపు బాధ్యతలను స్వీకరించారు.

మే డేన వాడవాడలా అరుణపుతాకం ఎగరవేయాలి

విశాలాంధ్ర - ఖమ్మం : 139వ మే డే సందర్భంగా ఖమ్మం జిల్లాలోని అన్ని కార్మిక వాడలలో ఎర్రజెండాలను ఎగరేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. ఖమ్మంలోని గిరి ప్రసాద్ భవన్‌లో ఏఐటియుసి ఖమ్మం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా కార్మిక పండుగగా మే డేని భావిస్తారని, దాదాపు 180 దేశాలు మేడే దినోత్సవాన్ని జరుపుకుంటాయని తెలియజేశారు. 1886 వ సంవత్సరంలో పని గంటల కొరకు చికాగోలో మొదలైన పోరాటంలో కార్మికుల రక్తం నుండి ఉద్భవించిందే ఎర్రజెండా అన్నారు. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఇతర కార్మిక సంఘాలు వారి వారి జండాలను సృష్టించుకున్నారని కేవలం ఎర్రజెండా మాత్రం కార్మికుల రక్తం నుంచి ఉద్భవించిందన్నారు. భారతదేశంలోకి మొదటిసారిగా ఏఐటీయూసీ ద్వారానే ఎర్రజెండా వచ్చిందన్నారు.భవన నిర్మాణ కార్మికుల మరణానికి 10 లక్షలు చెల్లించడం తోపాటు 55 సంవత్సరాలు దాటిన భవన నిర్మాణ కార్మికులకు రూ.5వేల పెన్షన్ చెల్లించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సిసిఎస్ డబ్బులను 1100 కోట్లను వెంటనే చెల్లించాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖమ్మం నగర కార్పొరేటర్ బి.జి. క్లెమెంట్, ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులు రావి శివరామకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ పాల్గొన్నారు.

సింగరేణి అధికారి అజయ్ కుమార్‌కు మాతృవియోగం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్: సింగరేణి కాలరీస్‌లో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ లైసన్ సెల్ ఇంచార్జి కార్పొరేట్ డి వై జియం కె. అజయ కుమార్‌కు మాతృ వియోగం జరిగింది. ఆయన మాతృ మూర్తి అయినా బాపట్ల జిల్లా చీరాల మండలం కు చెందిన కంద్రకొండ సరోజినీ బుధవారం మృతి చెందారు. ఈ విషయాన్నీ తెలుసుకున్న సింగరేణి ఎస్సి ఎస్టీ సెల్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఆంతోటి నాగేశ్వరరావు గురువారం చీరల వెళ్లి సరోజినీ పార్థివ దేహాని సందర్శించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయనతోపాటు నాయకులు బందెల విజేందర్, చేరిపల్లి నాగరాజు, ఫణింద్రర్, రమేష్‌లు పాల్గొన్నారు.

వాయిదా పడిన వక్ఫ్ జేసీసీ ర్యాలీ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25 శుక్ర వారం నిర్వహించాల నుకున్న ర్యాలీ వాయిదా వేశారు. గురువారం జెఏసి నాయకులు కొత్తగూడెం ఉర్దూఘర్ లొ అత్యవసర సమావేశం నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ మహమ్మద్ ఉమార్ యాజ్జని అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. చేపట్టాలను కున్న నిరసన ర్యాలీని ముస్లిం పర్సనల్ లో బోర్డు ఆదేశాల మేరకు కొన్ని రోజులు వాయిదా వేస్తున్నట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు. కాగా కాశ్మీర్లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడి అమానుష మైనదని ఖండించారు. ఈ నేపథ్యంలో ఈ నిరసన కార్యక్రమాలను మూడు రోజుల వరకు తాత్కాలికంగా విరమిస్తున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలొ జేఏసీ రాష్ట్ర మైనారిటీ నాయకులు డాక్టర్ నయీమ్ ఖురేషి, కో కన్వీనర్లు సయ్యద్ అన్వర్ అలీ, ఏడబ్ల్యూఎస్ అధ్యక్షులు అమీర్ ఖాద్రి, అబ్దుల్ రబ్, మహమ్మద్ అయుబ్, మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్, ఆబిద్ హుస్సేన్, జిల్లా మైనారిటీ ఉపాధ్యక్షులు కరీం పాషా, మహమ్మద్ జావేద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటలు స్నేహభావం, ఐక్యతను పెంచుతాయి

విశాలాంధ్ర - కొత్తగూడెం : ఆటలు ఆరోగ్యంతో పాటు అందరిలోనూ స్నేహ భావాన్ని, ఐక్యతను పెంపొందించి దురలవాట్లను దూరం చేస్తాయని టిపిసిసి సభ్యులు నాగా సీతారాములు అన్నారు. క్రీడలు మానసిక స్థైర్యం, ధైర్యం పెంపొందిస్తాయన్నారు. గురువారం పాల్వంచ మండలం దంతెలబోర ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల విజేతలు మొదటి బహుమతి ములకలపల్లి మండలం, 2వ బహుమతి బూర్గంపహాడ్ మండల జట్లకు ఆయన చేతులమీదుగా ప్రధానం చేశారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతు మద్యపానం, ధూమపానం, డ్రగ్స్ లాంటి ప్రమాదకరమైన వాటికి దూరంగా ఉండాలన్నారు. మంచి అలవాట్లతో దేశానికి వెన్నెముకగా యువత శక్తివంతంగా మారాలని కోరారు. మన ఊరు మన ఆట పేరిట ప్రీమియర్ లీగ్ పోటీలను నిర్వహిస్తున్న క్రీడా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు ఎండి కరీం పాషా, ఓబిసి కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు జయప్రకాష్, ఓబీసీ నాయకులు బొబ్బాల వెంకట్ యాదవ్, సోషల్ మీడియా ఇంచార్జి సాయిచంద్, సాయి ప్రకాష్ స్థానిక నాయకులు, పోటీల నిర్వాహకులు పాల్గొన్నారు.

అప్పుల, బాధతో రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - కారేపల్లి : పంటల కోసం పెట్టిన పెట్టుబడులు తీర్చే దారి లేక పోవటంతో చావే శరణ్యమని తలచిన రైతు పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కారేపల్లి మండల పరిధిలోని దుబ్బతండాలో చోటు చేసుకుంది. దుబ్బతండాకు చెందిన లావుడ్యా భద్రు (52) రెండు ఎకరాలలో మిర్చి, రెండు ఎకరాలలో పత్తి వేశాడు. చీడపీడలతో దిగుబడి బాగా తగ్గింది. పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక దిగులు పడిన భద్రు పెట్టుబడులు తీరేదెట్ల అని మదన పడేవాడు. గత మూడు సంవత్సరాల నుండి అప్పులు పెరుగుతూ వచ్చాయి ఈక్రమంలో కారేపల్లిలోని ఓ షాపులో గుమస్తాగా చేరాడు. అయినా పంటలకు పెట్టిన పెట్టుబడులు తీరే మార్గం కనిపించక పోవటంతో తీవ్రంగా మనోవేదన పడి చావే పరిష్కారంగా తలంచిన భద్రు తన మిర్చి తోట వద్దకు వెళ్లి గడ్డి మందును సేవించాడు. ఇంట్లో ఉన్న భార్యకు ఫోన్ చేసి తాను గడ్డి మందు తాగినానని, పిల్లలు జాగ్రత్త అని ఫోన్ పెట్టేశాడు. వెంటనే కుటుంబ సభ్యులు చేను వద్దకు వెళ్ళి భద్రును ఖమ్మం అసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం భద్రు మృతి చెందాడు. మృతునికి భార్య అచ్చమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ప్రశాంత్ పోలీసులకు పిర్యాదు చేయటంతో ఏఎస్సై నాగరాజకుమారి సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

సింగరేణి పరిరక్షణకు కార్మికవర్గం ఒక్కటవ్వాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రపంచ కార్మికుల పర్వదినం మేడే సాక్షిగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, కార్మికుల హక్కుల పరిరక్షణకోసం పోరాడతామని ప్రతిన బూనాల్సిన అవసరం ఏర్పడిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి వంగ వెంకట్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి వీరాస్వామి పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జరుగబోయే పోరాటాలకు కార్మికవర్గం సిద్ధంగా ఉండాలని కోరారు. 139వ మేడే సందర్భంగా యూనియన్ ప్రచురించిన డిమాండ్ల గోడ ప్రతిని గురువారం ఏఐటీయూసీ కార్యాలయం శేషగిరి భవంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన బొగ్గుగనుల ప్రారంభించాల్సిన అవసరం ఉందని, బొగ్గు వెలికితీత పనుల్లో ప్రేవేటి కార్మికులను నియమించే విధానాన్ని యూనియన్ వ్యతిరేకిస్తుందన్నారు. సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల సవరణ, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 40వేల కోట్లను తక్షణమే తిరిగి సంస్థకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో మేడేను జరపాలని, బొగ్గుగనుల, ఉపరితల విభాగాల్లో మేడే జెండాలను ఆవిష్కరించాలను కోరారు. సమావేశంలో నాయకులు ఎస్వి రమణమూర్తి, మల్లయ్య, రాజేశ్వరరావు, మాచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెహల్గామ్ ఉగ్రదాడి అమానవీయం...

సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : జమ్మూ-కాశ్మీర్ పెహల్గామ్ యాత్రికులపై ఉగ్రవాదులు జరిగిన పాశవిక, పైశాచిక దాడి, మారణహోమం అమానవీయమని, ఈ దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ కందిస్తుందని ఆ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా అన్నారు. పట్టణ పరిధిలోని రామవరం ఆటో అడ్డాలో జరిగిన కార్మికుల సమావేశం సందర్భంగా ఉగ్రదాడిలో మృతి చెందినవారికి నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాబీర్ పాషా మాట్లాడుతూ ఉగ్రవాదులు దేశపౌరులపై కాల్పులు జరిపి హత్య చేయడం అనాగరిక చర్య అన్నారు. ఈ దాడిని యావత్ భారత పౌరసమాజం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ఉగ్రవాదులు కేవలం హిందువులని లక్ష్యంగా చేసుకొని కాల్చి చంపడం దేశంలో మతసామరస్యాన్ని దెబ్బతీసేందుకే అన్నది స్పష్టమవుతోందన్నారు. హిందూ, ముస్లింల మధ్య చిచ్చు రేపి దేశ సమైక్యతను దెబ్బతీసేందుకు పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు ఇలాంటి దుచర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కొద్ది రోజులక్రితం పాక్ ఆర్మిచిఎఫ్ అదేవిధంగా ఉగ్ర లష్కరే తోయిబా చీఫ్ కమాండర్ పరోక్షంగా హెచ్చరించినా కేంద్రం ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం వల్ల ఉగ్రదాడి జరిగిందని ఆరోపించారు. జరిగిన ఉగ్రదాడి ఇంటిలిజెన్స్ వైఫల్యమా, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యమా కేంద్రమే తేల్చుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లు, మేడే ఉత్సవాలపై చర్చించారు. సమావేశంలో ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు కంచర్ల జమలయ్య, మద్రి కృష్ణ, జలీల్, శ్రీనివాస్, హబీబి, రాఫ్ఫి, ఆనందరావు, జంజర్ల శివ, బాషా, నాగుల్ మీరా, గుబ్బల శ్రీను, యూసుఫ్, జానీ, రవీందర్, సలీం, జిలాని, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కాశ్మీర్ మారణకాండను ఖండిస్తున్నాం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఉగ్రవాదం ఏ దేశానికైనా అత్యంత ప్రమాదకరమని ఉగ్ర మూకలకు ఏ మతంతో సంబంధం ఉండదని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు స్పష్టం చేశారు. జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ లొ పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిలో మృతి చెందిన సంఘటన దేశం మొత్తాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. గురువారం స్థానిక ఉర్దూగర్ లొ ముస్లిం నేతలు మృతులకు శాంతి చేకూరాలని కొన్ని నిమిషాలు మౌనం పాటించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశ ఐక్యత, శాంతి పరిరక్షణ ముఖ్యమని ఉగ్ర మూకలను కేంద్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని దేశంలో ఉగ్రవాదాన్ని అణిచివేయాలని కోరారు. ఈ నెల 25 న శుక్రవారం జిల్లాలోని అన్ని మసీదులలో మృతుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు జరపాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. నాయకులు డాక్టర్ నయీమ్ ఖురేషి, అబ్దుల్ రబ్, ఏ డబ్ల్యు ఎస్ అధ్యక్షులు అమీర్ ఖాద్రి, ఆబిద్ హుస్సేన్, షరీఫ్ భాయ్, సయ్యద్ అన్వర్ అలీ, బాబు జానీ ఖాన్, రామవరం మస్జిద్ అధ్యక్షులు, అంకుష్, ఉస్మాన్, షమీయుద్దీన్, ఎండి జమాల్, ఖాజా ఉస్మాన్, హమీద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పని ప్రదేశంలో నీడనివ్వని అధికారులు

విశాలాంధ్ర - గార్ల : మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీలలో మండు వేసవిలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న పని ప్రదేశాల్లో సదుపాయాలు లేక కూలీలు విలవిలాడుతున్నారు. చట్ట ప్రకారం గ్రామీణ కూలీలకు ఉపాధి పనులు కల్పించడమే కాదు, వేసవిలో పని ప్రదేశాల్లో మజ్జిగ ప్యాకెట్లు, ప్రతి ఉపాధి కార్మికుడికి ప్రతిరోజు తాగునీటి సదుపాయం, లేదా అలవెన్స్ అందజేయాల్సి వుంది. ఎండ వేడిమికి తట్టుకునేందుకు షెడ్లు, ప్రమాదాలు జరిగితే మెడికల్ కిట్లు, చిన్నపిల్లల కోసం ఆయాల ఏర్పాటు, కూలీలకు పనిముట్ల కోసం వారానికి రూ.9 రూపాయలు చొప్పున అలవెన్స్ అందజేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇవేమి ఇవ్వకుండా మొండిగా వ్యవహరిస్తుందని ఉపాధి కూలీలు ఆరోపిస్తున్నారు. అసౌకర్యాల నడుమ ఎంతో ఇబ్బంది పడుకుంటూ మండు వేసవిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కనీసం రోజువారి కూలి రూ. 200 దాటకపోవడం బాధాకరమని కూలీలు అంటున్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఫిబ్రవరి నుండి జూన్ వరకు 20 శాతం నుండి 30 శాతం వరకు అదనంగా వేసవి అలవెన్స్ అందజేయాలని వారు కోరుతున్నారు.

ప్రకృతి ఆరోగ్య కో ఆర్డినేటర్ సుగుణారావు దంపతులకు సన్మానం

విశాలాంధ్ర - ఇల్లందు : కొత్తగూడెం ప్రకృతి ఆరోగ్య ఆశ్రమం కోఆర్డినేటర్, నాచురోపతి ప్రాక్టీషనర్ సుగుణ రావు శోభారాణి దంపతులకు అతిథులు అతిథులు ఘనంగా సన్మానించారు. ఇల్లందులో బుధవారం జరిగిన ప్రకృతి ఆరోగ్య మహాసభలలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయన ఆల్టర్నేటివ్ తెరపిస్టుగా, ప్రకృతి వైద్యం, ఆక్యుపంచర్ సైన్స్, ఆక్యుప్రెషర్ థెరపీ, ఖైరో ప్రాక్టీస్ (మర్మకళ) ఆయుర్వేదం మొదలైన వైద్య విధానాల ద్వారా అనేక జబ్బులను తగ్గిస్తుండటమే కాకుండా, వైద్య విధానాలను సాధారణ ప్రజల వరకు చేరవేస్తున్నాడటంతో వారిని సన్మానించారు. సన్మానించిన వారిలో ప్రముఖ ప్రకృతి కవి డాక్టర్ జయరాజు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, డి.ఎస్.పి చంద్రభాను, మాజీ మున్సిపల్ చైర్మన్ డివి, నవభూమి బ్యూరో చీఫ్ తుమ్మలపల్లి ప్రసాద్, స్థానిక వైద్యులు రవికుమార్, ప్రముఖ ఆక్యుపంచర్ వైద్యులు అనిల్ కుమార్, అనువంశిక వైద్యులు డాక్టర్ లక్ష్మణ స్వామి, సభ నిర్వాహకులు లింగాల వెంకన్న, బొమ్మెర ముత్యం తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సుగుణారావు మాట్లాడుతూ సన్మానించిన ఇల్లందు సిద్ధార్థ ఆరోగ్య కేంద్రం వారికి, అతిథులకు కృతజ్ఞతలు తెలియజేశారు. దీంతో ఆల్టర్నేటివ్ థెరపీస్ వ్యాప్తిలో తమపై మరింత బాధ్యత పెరిగింది అన్నారు.

పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : పహెల్గామ్, అనంతనాగ్‌లో 27 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్ ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవడమే మృతులకు నిజమైన నివాళులని బిజెపి నగర కార్యవర్గ సభ్యులు డా.రాజ్‌కుమార్ అన్నారు. పాకిస్తాన్ పెంచిపోసిస్తున్న అన్ని ఉగ్రవాద సంస్థలు పాకిస్తాన్ ఆర్మీపై సైనిక చర్యలు తీసుకోవాలని భారత ప్రధాని మోడీని కోరారు. ఉగ్రవాదానికి మతం ఉండదని, చిలుక పలుకులు పలికే కుహనా రాజకీయ నాయకులు, సూడో సెక్యులర్లు అర్బన్ నక్సెల్స్ ఎక్కడ పండుకున్నారని ఎద్దేవా చేశారు.

సంపాదకీయం

కావాల్సింది సమగ్ర ప్రణాళిక, దృక్పథం

మంగళవారం మధ్యాహ్నం జమ్మూ-కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన కిరాతకమైన దాడి దేశమంతటినీ కలచి వేసింది. సాధారణంగా ఇలాంటి సందర్భాలను ప్రస్తావించవలసి వచ్చినప్పుడు కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా అంటాం. కానీ బీజేపీ నాయకులు కార్గిల్ నుంచి కన్యాకుమారి దాకా అంటున్నారు. ఇందులో మర్మమేమిటో గ్రహించడం కష్టం కాదు. తీవ్రవాదుల ఆగడం తెలిసిన వెంటనే విదేశీ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి మోదీ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను సంఘటన జరిగిన స్థలానికి వెళ్లమని పురమాయించారు. తాను సైతం విదేశీ పర్యటన మధ్యలోనే ఆపేసి తిరిగి వచ్చారు. సంతోషం. వచ్చిన వెంటనే ఉన్నతాధికారులతో భద్రతా సమావేశం నిర్వహించారు. మంచిదే. కానీ ఒక్క రోజు మాత్రమే దిల్లీలో ఉండి ఓ ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనడానికి బీహార్‌లోని మధుబని వెళ్లిపోయారు. పహల్గాం హత్యాకాండకు కారకులైన వారి మీద చర్య తీసుకోవడానికి సకల ఏర్పాట్లు చక చకా చేసే ఉంటారు. మన భూభాగంలోకి చొచ్చుకొచ్చి అక్కడ శాశ్వత నిర్మాణాలు, రోడ్లు నిర్మిస్తున్నా మోదీ "కన్నెర" చేయలేక పోయారు. కానీ మధుబనిలో పాకిస్థాన్ మీద ఒంటి కాలు మీద లేచారు. పాకిస్థాన్‌ను సర్వనాశనం చేస్తానంటున్నారు. దాని అర్థం ఏమిటో తెలియదు. తగిన గుణపాఠం చెప్తాం, ముష్కరులను వేటాడుతాం, నిర్మూలిస్తాం, వారికి మద్దతిచ్చే వారిని తుదముట్టిస్తాం లాంటి మాటలు రాజకీయ నాయకుల నుంచి తరచుగా వినిపిస్తాయి. మోదీ సరిగా ఇదే భాష మాట్లాడారు. ఇలాంటి ప్రగల్భాలు పలికిన వారు మోదీకన్నా ముందూ ఉన్నారు. ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటామని అందుకోసం పాకిస్థాన్‌లోకి దూసుకెళ్తాం అని ప్రధానిగా ఉన్నప్పుడు పీవీ నరసింహారావు కూడా హుంకరించారు. జరిగింది మాత్రం పూజ్యం. ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుని తీరతామని మోదీతోపాటు అనేక మంది బీజేపీ నాయకులు తీవ్ర హెచ్చరికలే చేశారు. ఆ లక్ష్యం సాధ్యాసాధ్యాల గురించి మాత్రం మాట్లాడరు. ఇలాంటి బీరాలు పలకడాన్ని పాకిస్థాన్ తాటాకు చప్పుళ్లలాగే పరిగణిస్తుంది. మంగళవారం నాటి దాడిలో పాకిస్థాన్ పాత్ర ఏ మేరకు ఉందో కేంద్ర ప్రభుత్వ నాయకులు ఎవరూ వివరించలేదు. ఈ వాదనకు తగిన ఆధారాలు సేకరించిన దాఖలాలూ లేవు. పహల్గాంలో దాడిని దేశదేశాల నాయకులు ఖండించారు. అది సహజమే. 26 మంది మృతుల్లో 25 మంది పర్యాటకులు, ఒక్కరు మాత్రమే కశ్మీరీ. అందువల్ల ఎక్కువ సానుభూతి వ్యక్తం కావడం సహజం. మృతుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల వారు ఉన్నారు. కశ్మీర్ ప్రధానంగా పర్యాటకం మీదే ఆధారపడి ఉంటుంది. అందుకే పర్యాటక స్థలం అయిన పహల్గాంలో దాడి చేశారు. మతం పేరు అడిగి కాల్చేశారు, కులం పేరు అడిగి కాదు అని బీజేపీ నేతలు అంటున్నారు. ఈ మాట చెప్పడంలో ఓ మతలబు ఉంది. కాల్పులు జరిపింది ముస్లింలని, మృతుల్లో ఎక్కువ మంది హిందువులని చెప్పడం బీజేపీ నేతల అసలు ఉద్దేశం. అంటే అక్కడా ముస్లింల మీద విద్వేషమే బీజేపీ లక్ష్యం. అయితే దౌత్యపరంగా పాకిస్థాన్ ప్రభుత్వం మీద తీసుకోవలసిన చర్యలను మాత్రం బీజేపీ తీసుకుంటోంది. అలాగే సింధు నది జలాల మీద కుదిరిన ఒప్పందం అమలును నిలిపివేస్తామనీ అంటోంది. అటారీ దగ్గర చెక్ పోస్ట్ కూడా మూసేశారు. సార్క్ దేశాల వీసా మినహాయింపు ప్రకారం పాకిస్థాన్ పౌరులను మన దేశంలో పర్యటించడానికి కూడా అనుమతించం అని ప్రభుత్వం అంటోంది. పాకిస్థానీ హై కమిషన్‌లో రక్షణ సలహాదార్లను కూడా వెళ్లిపొమ్మని ఆదేశించారు. హైకమిషన్‌లో ఇప్పటిదాకా 55 మంది ఉంటే ఇప్పుడు ఆ సంఖ్యను మే ఒకటి నుంచి 30కు తగ్గించాలని నిర్ణయించారు.

పహల్గాం సంఘటన జరిగిన తరవాత కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉన్నతాధికారులతో సమీక్షలు జరుపుతూనే ఉన్నారు. తీవ్రవాదాన్ని ఏ మాత్రం సహించకూడదన్నది భారత ప్రభుత్వ విధానం అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టకపోవడమే కాదు, వారికి మద్దతు ఇచ్చిన వారిని కూడా విడిచిపెట్టేది లేదని రాజ్‌నాథ్ సింగ్ అంటున్నారు. తీవ్రవాదులకు మద్దతుఇచ్చిన వారు అంటే ఆయన ఉద్దేశం పాకిస్థానే అయి ఉంటుంది. పాకిస్థాన్ మీద విమర్శలు చేయడం సరే. వదిలిపెట్టం అనడంలో ఆంతర్యం ఏమిటో! దాడి చేస్తారా? ఆ దాడి లక్ష్యం ఏ మేరకు ఉంటుంది. "ఇంట్లోకి చొరబడి కొడ్తాం" అని మోదీ ఇదివరకు అనేక సార్లు అన్నారు. ఇదివరకు బాలాకోట్ సంఘటన జరిగిన తరవాత పాకిస్థాన్‌లోని ఓ కిలో మీటర్ దూరం వెళ్లి తడాఖా చూపించామన్నారు. అందులో ఎంత మంది పాకిస్థానీయులు మరణించారో లెక్క చెప్పలేక పోయారు. 50 నుంచి 70 మందిదాకా తీవ్రవాదులో, పాకిస్థానీయులో మరణించి ఉంటారని ప్రభుత్వ అంచనా. ఆ దాడివల్ల అప్పుడు పాకిస్థాన్ బెదిరిపోయి సొమ్మసిల్లి పోయిన దాఖలాలేమీ లేవు. ఒక దేశం మీద చర్య తీసుకోవడం అనేక రకాలుగా ఉంటుంది. అనేక స్థాయిల్లో ఉంటుంది. ఇవేవీ కుదరకపోతే యుద్ధానికి దిగే సందర్భాలూ ఉంటాయి. కానీ అది అంత సులభం కాదు. అంతర్జాతీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పాకిస్థాన్‌తో మనం చేసిన ఏ యుద్ధంలోనూ పాకిస్థాన్ విజయం సాధించలేదు. అసాధ్యం కూడా. ఆ కారణంగానే భారత్‌పై వెయ్యి గాయాలు చేయాలని పాక్ పరోక్ష యుద్ధానికి దిగుతూ ఉంటుంది. అందులో భాగమే తీవ్రవాదులకు శిక్షణ ఇచ్చి వారిని మన మీదకు ఉసిగొల్పుతూ ఉంటుంది. దౌత్యపరంగా కూడా తీవ్ర ఒత్తిడి తెచ్చినా పాకిస్థాన్ తన మునుపటి గుణాన్ని మానుకోలేదు. కశ్మీర్‌లో తీవ్రవాదం ముగియాలంటే ఏ ఒక్క మార్గమో తగిన ఫలితం ఇవ్వదు. మొట్ట మొదట మన సరిహద్దులు భద్రంగా ఉండేట్టు చూసుకోవాలి. మన గూఢచార శాఖ అప్రమత్తంగా ఉండాలి. 370వ అధికరణమే తీవ్రవాదానికి ప్రధాన కారణం అన్న ఊకదంపుడు ఉపన్యాసాలు ఆ అధికరణాన్ని రద్దు చేయక ముందు వినసొంపుగా ఉంటే ఉండొచ్చు. ఆ అధికరణం రద్దయి ఆరేళ్లు కావొస్తోంది. ఆ తరవాత కూడా తీవ్రవాద కార్యకలాపాలు ఆగిపోయిన సందర్భమే లేదు. 370వ అధికరణం రద్దు చేసినప్పుడు రాజకీయ నాయకులందరినీ నిర్బంధంలో ఉంచడంవల్ల జనాగ్రహం అంత గట్టిగా వినిపించి ఉండకపోవచ్చు. కానీ జనం మనసులు కుతకుత ఉడుకుతున్నాయన్న దాఖలాలు నిరంతరం కనిపిస్తూనే ఉన్నాయి. అంతర్జాతీయ సమాజంలో పాకిస్థాన్‌ను ఏకాకిని చేస్తామన్న మాట ఇప్పటికీ అమలులోకి రాలేదు. తీవ్రవాదాన్ని అణచివేసే విషయంలో మోదీ ప్రభుత్వానికి బేషరతుగా మద్దతిస్తామని ప్రతిపక్షాలన్నీ చెప్పాయి. బేషరతుగా ఆ మద్దతు స్వీకరించడానికి బీజేపీ సిద్ధపడాలి. దౌత్య మార్గాలన్నింటినీ వినియోగించుకోవాలి. తీవ్రవాదుల వెనక ఉన్న పాకిస్థాన్ మీద చర్య తీసుకున్నంత మాత్రాన సరిపోదు. పాకిస్థాన్ వెనక ఉన్న దేశాల నడవడిక విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

కొండమీద దేముడు



రా బావ ఏంటి ఈ రోజు కోపంగా పళ్లు బిగించి మరీ వస్తున్నావు. ఏముంటుంది ప్రతిరోజు దినపత్రిక చదివిన తరువాత మనసున్న ప్రతి వాడికి కోపం రావడమో, దుఃఖం రావడమో తప్పదు గదా. అదిసరే ఈ రోజు కోపానికి కారణం ఏం చదివావు అసలేం జరిగింది. నీకేమయ్యా నిదానంగా తాపీగా ఏం జరిగిందంటావు. నాకే గనుక ఒక నెల ముఖ్యమంత్రి పదవి అప్పచెప్తే ఇటువంటి సనాతన వాదుల్ని, మూఢ నమ్మకాలు వ్యాప్తి చేసేవారిని మొత్తం కట్టగట్టి జైల్లో పెడతాను. లేకపోతే హిట్లరు లాగ కాల్చివేస్తా. నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేసినట్లు ఓట్ల కోసం ప్రజల్ని మూఢ నమ్మకాల్లో ముంచెత్తే వారిని పిట్టల్లాగ కాల్చివేస్తా. అబ్బో చాలా కోపంగా ఉన్నావు. కొంచెం కూల్ గావయ్యా. ఇప్పుడు విను రాజకీయ నాయకులు ఓట్ల కోసం ప్రజల్ని మూఢ నమ్మకాలలో ముంచెత్తే మాట నిజమే. ఈ రోజు ఏం చదివావు. నిదానంగా అడుగుతావేంటి బావ. శ్రీకాకుళం జిల్లాలో కొండ మీద దేముడు వెలిశాడని గుడికట్టి ప్రతి సంవత్సర ఉత్సవం పేరిట కొండెక్కలేక జారిపడి కొంతమంది చనిపోతుంటే ప్రభుత్వం మెట్ల దారి ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదా. నిజమే మరణాలకు దారితీసే ప్రతి సమస్యపై ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది. ఎక్కువమంది చేరే ప్రతిచోట రక్షణ చర్యలు తీసుకోవలసిన అవసరం ప్రభుత్వానికుంది. అటువంటి దారుణ సంఘటనలు బాధ కల్గించే విషయమే.

అసలు నాకు తెలియక అడుగుతాను. దేశ అధ్యక్షుడు, ప్రధాని దగ్గర నుంచి శాసనసభ్యుల వరకు దైవ దర్శనం చేసుకుంటుంటే సామాన్య ప్రజలు వెళ్లకుండా ఉంటారా. ప్రతి అణువణువునా దేముడుండాడని గొప్ప గొప్ప ఆస్తిక ప్రచారం చేసే పీఠాధిపతులు చెబుతుంటే ఇంట్లో పూజలతో సరి పెట్టుకోకుండా కొండల మీద గుట్టల మీద గుళ్లు కట్టి అమాయకుల్ని చంపడం దేనికో. నిజమే మనసు ప్రశాంతత కోసం గతంలో నదుల పక్కనో, పర్వతాలపైనో గుళ్లు కడితే ప్రస్తుతం ప్రతి రోడ్డు పైన గుడి కట్టడం ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించడం ఎక్కువైంది. చివరకు సినిమా స్టార్లు ఇంటిలోనే గుడి కట్టడం కూడా చూస్తున్నాం. అది సరే ఇంట్లో గుడిలోని ఫొటోలో లేని దేముడు గుడిలో ఉంటాడా. ఇది చివరకు వ్యాపారంగా మారింది. పత్రికల వాళ్లను ప్రలోభ పెట్టి ఒకరాయి చూపించి దేముడు వెలిశాడని రాయించి ప్రచారం చేయించి జన ప్రవాహం పెరిగిన తరువాత లక్షల్లో సంపాదించడం మొదలైన కొన్నాళ్లకు తప్పనిసరై దేవాదాయ శాఖకు అప్పగించడం ఇదంతా వ్యాపారంగా మారింది. గుడి కట్టి సంపాదన మొదలైన తరువాత స్థానిక ప్రజా నాయకుడికి వాటా ఇవ్వడం ఇదంతా బయటపడిన తరువాత పత్రికలలో వచ్చిన తరువాత తీరుబడిగా దేవాదాయ శాఖ అధికారులు వచ్చి దాన్ని స్వాధీనం చేసుకోవడం ఇదంతా ఒక ప్రహసనంలాగా జరిగిపోతోంది. నిజమే అంతెందుకు ప్రతి సంవత్సరం కేదారనాథ్, బదరీనాథ్ యాత్రకు వెళ్లి ఎంతో మంది కొట్టుకుపోయి చనిపోతున్నారు. అప్పటికీ అక్కడి అధికారులు కొంతకాలం ఆపివేస్తారు. అక్కడ నడవలేక డోలీలలో వెళతారు. మోసేవారు అడిగినంత ఇవ్వాలి. గతంలో కాశీకి వెళ్లిన వాడు కాటికి వెళ్లినట్లే అనేవారు. అడవి మార్గాన నెలల తరబడి నడిచి వెళ్లి దారిలో చాలామంది మృత్యువాత పడేవారు. తిరిగి వచ్చిన వారు పునర్జన్మగా భావించి బంధువులకు విందు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడు బదరీనాథ్ యాత్ర ఆ కోవలోకి చేరింది. ప్రస్తుతం తిరుపతికి వెళ్లని వాడుండడేమో అదే విధంగా తాకిడి చూస్తున్నాం. నిజమే బావ మనిషిని నిర్లక్ష్యం చేసి దేవుని చుట్టూ తిరుగుతున్నారు. అందుకే వరహాలరావు అంటాడు తాను మనిషిని ప్రేమిస్తా గాని మనిషి చెక్కిన రాతిబొమ్మను కాదని. నీవు చదివావో లేదో ఒక శిల్పి నెలల తరబడి చెక్కిన విగ్రహాన్ని చూసిన స్వార్థపరులు దాన్ని తీసికెళ్లి గుడికట్టి సంపాదించాలని దొంగిలిస్తుంటే ఆ విగ్రహాన్ని తీసుకువెళ్లే బండికి అడ్డంపడి స్వామి స్వామి అంటూ అరుస్తుంటే బండి చక్రాల కింద పడి రెండు కాళ్లు పోయినా ఆ స్వార్థపరులు పట్టించుకోలేదని హృదయం ద్రవించేలా మోదుకూరి జాన్సన్ ఒక నాటకం రాశాడు.

ఇంతకూ దేముడు మనిషిని పుట్టించాడా లేక మనిషే దేమున్ని తయారు చేశాడా అనేది నాకు పెద్ద సందేహం. ఇందులో సందేహించేదేముంది. ఏ విగ్రహం చెక్కినా ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించి గుడి కట్టినా అన్నీ మనిషే. ఇందులో భిన్న వాక్కుకు చోటే లేదు. అది సరే ఒక విశ్వ బ్రాహ్మణుడు ఎంతో కష్టపడి ఒక దేవతా విగ్రహం తయారుచేసి ఆ ఊరు పెత్తందార్లు దాన్ని ప్రతిష్ఠించి గుడి కట్టారట. ఆ తరువాత ఆ ఊరి ప్రజలంతా వెళ్లి పూజలు చేస్తుంటే సదరు విశ్వ బ్రాహ్మణుడు పూజలు చేయలేదు సరికదా ఆ దేవతకు నమస్కారం కూడ చేయకపోవడం గమనించి గ్రామస్థులు ఆయన్ని అడగ్గా నేను చేసిన రాతిబొమ్మకు నేను నమస్కరించడమేమిటన్నాడట. దాంతో ఆగ్రహించిన పెత్తందార్లు సదరు శిల్పిని గ్రామ బహిష్కరణ చేశారట. అదిసరే బావ మనిషి చేసిన బొమ్మకున్న విలువ మనిషికి లేకుండా పోయింది. గుడి నిర్మాణానికి అయితే చందాలిస్తారుగాని ఆకలితో అలమటించే వాడికి గుప్పెడన్నం పెట్టరు. పేదవాని పిల్లల చదువుకు రూపాయి కూడా ఇవ్వరు. కేవలం వంగి నమస్కారం చేసి గుడిలో భజనలు చేసినంత మాత్రాన దేముడు కరుణిస్తాడా! అసలు కన్పించని దేముడు కరుణించడు. కనిపించే కరుణామయుడే కరుణిస్తాడు. మనిషి చేసిన బొమ్మకు మనిషే దాసోహం అనడం మంచిది కాదు. ప్రతి మనిషి సాటి మనిషిని ప్రేమించి ఆదుకోవడమే మనిషి లక్షణంగా మారాలి.

మోదీ పాలనలో తగ్గుతున్న ప్రభుత్వ బడులు

మోదుమూడి మురళీకృష్ణ

కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దేశంలో విద్య ప్రైవేటీకరణను ముమ్మరంగా ప్రోత్సహిస్తోంది. 2014-15, 2023-2024 విద్యా సంవత్సరాల మధ్య దేశంలో ప్రైవేట్ విద్యాసంస్థలు 14.9 శాతం పెరిగాయని తాజా గణాంకాలు వెల్లడించాయి. దశాబ్ద కాలంలో దేశంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 8 శాతం తగ్గిపోయిందని, వాటిలో ఎక్కువ శాతం బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఉన్నాయని ఆ గణాంకాలు చెబుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు విపరీతంగా వసూలు చేస్తున్నారు. గడిచిన మూడేళ్లలోనే ఈ పాఠశాలల్లో ఫీజులు 50 నుంచి 80 శాతం వరకు పెరగడంతో పేద, మధ్యతరగతికి చెందిన విద్యార్థులు ఫీజులు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రైవేట్ పాఠశాలలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవడం, ఫీజులు విపరీతంగా పెరగడంతో పేద, మధ్యతరగతి వారికి విద్య అందని ద్రాక్షగా మిగిలిపోతోంది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య తగ్గడం, ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు కొరవడడం వెరసి ప్రభుత్వ విద్యావ్యవస్థ దిగజారిపోవడానికి దారితీస్తోంది. ప్రైవేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఏర్పాటు, అభివృద్ధి చెందడానికి ఈ పరిస్థితులు నిస్సందేహంగా దోహదపడుతున్నాయి. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఆర్థికంగా బాగా ఉన్న విద్యార్థులకు లేదా కనీసం కొంత కష్టమైనప్పటికీ ఖర్చును భరించగలిగే విద్యార్థులకు మాత్రమే ఈ ప్రైవేట్ పాఠశాలలు ఉపయోగపడుతున్నాయి. ఇది ఈ దేశంలోని పిల్లల సార్వత్రిక, సమాన విద్య హక్కును ఉల్లంఘిస్తున్నది. అంతేకాకుండా అసమాన విద్యా స్థాయిని సృష్టిస్తోంది, సాపేక్షంగా పేద కుటుంబాల పిల్లలకు చాలా ప్రతికూలంగా ఉంటోంది. ఈ విధమైన భయం, ప్రైవేట్ పాఠశాలల పట్ల అటువంటి వారికి ఆకర్షణను పెంచుతోంది.

ఇటీవల ముగిసిన పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి ఫిబ్రవరిలో లోక్‌సభలో ఒక ప్రకటన చేస్తూ 2014-15, 2023-24 మధ్య ప్రభుత్వ పాఠశాలల సంఖ్య దేశంలో 8 శాతం తగ్గిందని, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 14.9 శాతం పెరిగిందని చెప్పారు. సంఖ్యాపరంగా చూస్తే ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 89,441 తగ్గగా, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 42,944 పెరిగింది. దేశంలో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు 10,17,660 ఉండగా, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 3,31,108. లోక్‌సభకు ఇచ్చిన సమాచారం ప్రకారం బీజేపీ పాలిత రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలలను భారీ సంఖ్యలో మూసివేస్తున్నారు. కాషాయపార్టీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్‌లో 29,410 ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తుండగా, ఉత్తరప్రదేశ్‌లో 25,126 ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారు. గత దశాబ్ద కాలంలో ఉత్తరప్రదేశ్‌లో 19,305 ప్రైవేట్ పాఠశాలలు పుట్టుకొచ్చాయి,

ఇది దేశంలోని మొత్తం ప్రైవేట్ పాఠశాలల పెరుగుదలలో 44.9 శాతం. మధ్యప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో 24.1 శాతం క్షీణత

> తల్లిదండ్రులు లేదా సంరక్షకులు ఆర్థికంగా బాగా ఉన్న విద్యార్థులకు లేదా కనీసం కొంత కష్టమైనప్పటికీ ఖర్చును భరించగలిగే విద్యార్థులకు మాత్రమే ఈ ప్రైవేట్ పాఠశాలలు ఉపయోగపడుతున్నాయి. ఇది ఈ దేశంలోని పిల్లల సార్వత్రిక, సమాన విద్య హక్కును ఉల్లంఘిస్తున్నది. అంతేకాకుండా అసమాన విద్యా స్థాయిని సృష్టిస్తోంది, సాపేక్షంగా పేద కుటుంబాల పిల్లలకు చాలా ప్రతికూలంగా ఉంటోంది.

నమోదవగా, జమ్మూ కాశ్మీర్‌లో 21.4 శాతం, ఒడిశాలో 17.1 శాతం, అరుణాచల్ ప్రదేశ్‌లో 16.4 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 15.5 శాతం, జార్ఖండ్‌లో 13.4 శాతం, నాగాలాండ్‌లో 14.4 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 12.7 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 12.7.9 శాతం ప్రభుత్వ పాఠశాలలు కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన ఈ పదేళ్ల కాలంలో మూతపడ్డాయి.

ఇక ప్రైవేట్ పాఠశాలల విషయానికి వస్తే మొత్తం 10 రాష్ట్రాలలో సగటు పెరుగుదల 14.9 శాతం కంటే ఎక్కువగానే ఉన్నది. ఎన్డీయే అధికారంలో ఉన్న బీహార్‌లో ప్రైవేట్ పాఠశాలలు అత్యధికంగా 179.14 శాతం పెరిగాయి. ఒడిశాలో 80.36 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 24.96 శాతం ప్రైవేట్ పాఠశాలలు పెరిగాయి. అయితే, ఇందుకు భిన్నంగా మూడు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య తగ్గింది. మేఘాలయలో 5.36 శాతం, మొన్నటి వరకు అమ్ ఆద్మీపార్టీ (ఆప్) అధికారంలో ఉన్న దేశ రాజధాని దిల్లీలో 2.88 శాతం, హిమాచల్ ప్రదేశ్‌లో 0.27 శాతం ప్రైవేట్ పాఠశాలలు తగ్గడం చెప్పుకోతగ్గ పరిణామం. ఈ రాష్ట్రాల్లో ప్రభుత్వ పాఠశాల విద్య గొప్ప విజయాలు సాధించిందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రభుత్వ పాఠశాల విద్య ముఖ్యంగా నాణ్యమైన విద్య విషయంలో వెనుకబడి ఉన్నాయి. ప్రత్యేకించి గత దశాబ్దంలో ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ పాఠశాలలు దేశవ్యాప్తంగా ఎంత ప్రాధాన్యతను పొందుతున్నాయో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో ఫీజులు గుంజటానికి ఇది దోహదపడుతోంది.

ఒకవైపు కుటుంబాల నిజాదాయం పడిపోతుండడం, మరోవైపు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు విపరీతంగా పెంచిన నేపథ్యంలో ఈ ఏడాది పరిస్థితి తల్లిదండ్రులకు అత్యంత ఇబ్బందికరంగా మారింది. దేశంలో గత మూడేళ్లలో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు 50నుంచి 80 శాతం వరకు పెరిగాయని లోకల్ సర్కిల్ ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది.దేశ వ్యాప్తంగా 309 జిల్లాల్లో ఈ సర్వే జరిగింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల ఫీజుల దోపిడీకి పాలకులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని 93 శాతం మంది తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఈ కాలంలో ట్యూషన్ ఫీజు 80 శాతానికి మించిపోయిందని తల్లడిల్లుతున్నారు.

తమిళనాడు, మహారాష్ట్ర మినహా దేశంలోని ఏ రాష్ట్రం కూడా ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అడ్డుకోలేకపోతున్నాయి. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమౌతున్న నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాల ఫీజు దోపిడీపై ఇప్పుడిప్పుడే ఆందోళనలు ప్రారంభమవుతున్నాయి. దేశ రాజధాని దిల్లీలో ఫీజుల పెంపునకు నిరసన రాజకీయ రంగు పులుముకుంది. అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ అధికారంలో ఉన్న కాలంలో ప్రైవేట్ పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను మెరుగుపరిచినందున ఆప్ ప్రశంసలు పొందింది.

పర్యవసానంగా దిల్లీలో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు విచ్చలవిడిగా పెంచుతున్న రుగ్మత దేశవ్యాప్తంగా ఉంది. కనుక, నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రం రాష్ట్రాలతో కలిసి సమస్యను సమర్థమంతంగా ఎదుర్కోవాలి. తగిన విధానం, స్పందన, చట్టాల ద్వారా సమస్యను పరిష్కరించాలి. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత అనుసరిస్తున్న విద్యా విధానం ప్రభుత్వ పాఠశాల విద్యకు హానికరంగా, ప్రైవేట్ పాఠశాలలకు లేదా విద్యను ప్రైవేటీకరించడానికి అనుకూలంగా ఉంది. ఈ విధానం మార్చుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పార్లమెంటరీ పంథాలో ఎగుడు దిగుళ్లు

ఆర్వీ రామారావ్

కమ్యూనిస్టు పార్టీల మీద జనానికి ఉన్న ఆదరణ ఓట్ల రూపంలో వ్యక్తం కావడం క్రమంగా తగ్గుతూ వచ్చింది. 1998 ఎన్నికలలో కాంగ్రెస్ 25.82 శాతం ఓట్లు సంపాదించి 141 సీట్లు సాధించింది. బీజేపీ 25.59 శాతం సాధించి 182 స్థానాలలో గెలిచింది. సీపీఐ 1.75 శాతం ఓట్లతో 9 సీట్లు సంపాదించింది. లోక్‌సభలో సీపీఐ సీట్లు సంఖ్య స్థాయి నుంచి అంకెల స్థానానికి తగ్గిపోవడం ఇదే మొదలు. 1998 ఎన్నికలలో సీపీఐఎం 5.16 శాతం ఓట్లతో 32 స్థానాలు సంపాదించింది.

కేంద్రంలో అస్థిరతవల్ల మళ్లీ 1999లోనే ఎన్నికలు నిర్వహించవలసి వచ్చింది. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ 28.30 శాతం ఓట్లు 114 సీట్లు సంపాదించింది. సీపీఐకి 1.48 శాతం ఓట్లు నాలుగు సీట్లు దక్కాయి. సీపీఐఎం 5.40 ఓట్లు 33 సీట్లు సంపాదించింది. 2004 ఎన్నికలు కాంగ్రెస్ కు 26.6 శాతం ఓట్లు, 145 సీట్లు సంపాదించి పెట్టాయి. బీజేపీకి 22.16 శాతం ఓట్లు, 138 సీట్లు దక్కాయి. బీజేపీ ఓటమిని అంగీకరించడంవల్ల బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ కాంగ్రెస్ నాయకత్వంలో యునైటెడ్ ప్రొగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ఏర్పాటు చేశాయి. దీనితో స్వాతంత్ర్యం తరవాత మధ్యలో అయిదేళ్లు తప్ప 1996 దాకా నిరాఘాటంగా అధికారం చెలాయించిన కాంగ్రెస్ 1996 తరవాత కుదేలై పోయింది. 2004 ఎన్నికలతోనే మళ్లీ కేంద్రంలో అధికారంలోకి రాగలిగింది.

సీపీఐకి ఈ ఎన్నికలలో 1.41 శాతం ఓట్లు 10 సీట్లు దక్కాయి. కానీ ఓట్ల శాతం 1.48 శాతం నుంచి 1.41 శాతానికి తగ్గింది. సీపీఐ ఎం 5.66 శాతం ఓట్లు 43 సీట్లు సంపాదించింది. యూపీఏ అధికారంలో ఉన్న సమయంలో వామపక్షాలు నిర్ణయాత్మక పాత్ర పోషించాయి.

2009 ఎన్నికలలో కాంగ్రెస్‌కు 28.55 శాతం ఓట్లు 206 సీట్లు దక్కాయి. సీపీఐకి 1.43 శాతం ఓట్లు, నాలుగు సీట్లు దక్కాయి. సీపీఐఎం ఓట్ల శాతం 3.27 శాతానికి తగ్గింది. మొదటిసారి సీపీఐఎం సంఖ్య స్థానం నుంచి అంకె స్థానానికి తగ్గిపోయింది. సీపీఐఎం 9 సీట్లు సంపాదించింది.

2014 ఎన్నికలలో కాంగ్రెస్ 19.31 శాతం ఓట్లు సాధించినా దక్కింది కేవలం 44 సీట్లే. కాంగ్రెస్‌కు అన్ని తక్కువ సీట్లు రావడం అదే మొదటిసారి. సీపీఐ ఓట్ల శాతం 0.78 శాతానికి తగ్గడంవల్ల ఒక్క సీటు మాత్రమే సాధించగలిగింది. సీపీఎం కూడా రెండు సీట్లకు పరిమితం అయింది. వామపక్షాల బలం లోకసభలో ఇంతగా నీరసించి పోవడం అంతకు మునుపు ఎన్నడూ లేదు. ఈ ఎన్నికలలో బీజేపీ 282సీట్లు సంపాదించి అధికారం చేపట్టింది. 2019 ఎన్నికలలో మోదీ నాయకత్వంలో బీజేపీ మరింత బలపడి 303 సీట్లు సాధించింది. నిజానికి ఆ ఎన్నికలలో బీజేపీ గెలుపు అనుమానాస్పదం అనుకున్నారు. కాంగ్రెస్ 2014లో కన్నా ఎనిమిది సీట్లు ఎక్కువగా అంటే 52 స్థానాలు సాధించింది. సీపీఐకి 2 సీట్లు దక్కాయి.

2024 సార్వత్రిక ఎన్నికలలో మోదీ నాయకత్వంలోని బీజేపీకి అధికారం దక్కినా మెజారిటీకి కావలసిన 273 స్థానాలు దక్కలేదు. కేవలం 240 స్థానాలతో సంతృప్తి పడవలసి వచ్చింది. కాంగ్రెస్ స్థానాలు 2019లో ఉన్న 52 నుంచి 99 కి పెరిగాయి. సీపీఐ 0.51 శాతం ఓట్లతో రెండు చోట్ల గెలిచింది. సీపీఐఎం 1.85 శాతం ఓట్లతో 4 స్థానాలు సంపాదించింది. 1996 నుంచి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వామపక్షాల పరిస్థితి బలహీనం కావడం గమనించవచ్చు. అంతకన్నా గ్రహించవలసిన అంశం ఏమిటంటే ఈ పార్టీలకు సీట్లు తగ్గడంతో పాటు ఓట్ల శాతం వడివడిగా తగ్గుతున్నట్టు స్పష్టం అవుతోంది.

పార్లమెంటరీ రాజకీయాలలో వామపక్షాల బలం తగ్గడానికి ప్రధాన కారణం ఏమిటి అని ఆలోచించవలసిన తరుణం ఇది. పార్లమెంటులో సీట్లు వామపక్షాల బలాబలాలకు కొలమానం కాదు. కానీ పార్లమెంటులో సీట్లనుబట్టి కమ్యూనిస్టు పార్టీల ప్రభావాన్ని అంచనా వేసే స్థితిలో ఉన్నాం. అవి ఉద్యమ పార్టీలు అని గుర్తుంచుకోవాలి. పార్లమెంటరీ రాజకీయాలలో వామపక్షాలు అనేక ఎగుడుదిగుళ్లు చవి చూడవలసి వస్తోందన్నది మాత్రం వాస్తవం.

గోద్రా కేసు...

6,7 తేదీల్లో సుప్రీం తుది విచారణ

న్యూఢిల్లీ: గుజరాత్ అల్లర్లలో భాగంగా గోద్రాలో రైలు పెట్టిన ఘటనకు సంబంధించి తుది విచారణను మే 6, 7 తేదీల్లో చేపట్టనున్నట్లు సుప్రీం కోర్టు గురువారం వెల్లడించింది. ఆ రెండు రోజులు వేరే ఏ కేసును స్వీకరించబోమని, పూర్తిగా గోద్రా వ్యవహారానికి సంబంధించిన ఫిర్యాదులను విచారిస్తామని జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాజేశ్ బిందాల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. ఈ విచారణకు రెండు వారాలు పట్టవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మే 3లోగా కౌంటర్ దాఖలు చేయాలని నేరస్తుల తరపు న్యాయవాదులకు సూచించింది. నేరస్తులపై ఆరోపణలను 'హెడ్డింగ్ వైస్'గా సమర్పించాలని సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డేను ఆదేశించింది. కింది కోర్టుల పరిశీలనకు వచ్చిన అంశాలతో పాటు వాదనల వివరాలు, రికార్డులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించింది. మే 6, 7 తేదీల్లో పూర్తిస్థాయి విచారణ జరుపుతామని జస్టిస్ మహేశ్వరి వెల్లడించారు. ఇందుకోసం అవసరమైతే భారత ప్రధాన న్యాయమూర్తి అనుమతి తీసుకోవాలని రిజిస్ట్రీకి సూచించారు. 2002, ఫిబ్రవరి 27న గుజరాత్ అల్లర్లలో భాగంగా గోద్రాలో శబర్మతి ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్-6 కోచ్‌కు నిప్పు పెట్టిన ఘటనలో 59 మంది ప్రాణాలు కోల్పోయారు. దీంతో గుజరాత్ హైకోర్టు 2017 అక్టోబరులో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో అనేక ఫిర్యాదులు దాఖలయ్యాయి. మొత్తం 11 మంది దోషులకు మరణశిక్ష విధించాలని గుజరాత్ ప్రభుత్వం 2023 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ 11 మందికి కింది కోర్టు మరణశిక్ష విధించిందని, మరో 20 మందికి యావజ్జీవ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు సర్వోన్నత న్యాయస్థానం ఎదుట వాదనలప్పుడు వివరించింది.

మూడు చోట్ల... 10 నిమిషాల కాల్పులు...

న్యూఢిల్లీ: పహల్గామ్‌లోని బైసరన్ లోయలో సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు కేవలం 10 నిమిషాల వ్యవధిలో 26 మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొని పారిపోయారు. అత్యంత సమీపంలోకి వచ్చేవరకు కూడా వారిని ఉగ్రవాదులుగా గుర్తించలేదు. బైసరన్‌కు ఆనుకొని ఉన్న పైన్ అడవుల్లో దాదాపు ఐదుగురు ఉగ్రవాదులు సువిశాల లోయ ప్రాంతంలోకి వచ్చారు. పర్యాటకులు అత్యధికంగా ఉన్న మూడు ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొన్నారు. సరిగ్గా 1.50 సమయంలో తొలిసారి కాల్పుల మోత వినిపించింది. పర్యాటకులను గుర్తింపు కార్డులు అడిగి మరీ ఉగ్రవాదులు కాల్చిచంపారు. చాలామంది పర్యాటకుల తలపైనే గురిపెట్టి కాల్చారు. ఆ తర్వాత తాము వచ్చిన దిశగానే పారిపోయారు. దాడి ముగిసిన అర్ధగంట తర్వాత 2.30కు పోలీసులకు సమాచారం చేరింది. గాయపడిన వారిలో కొందరు కన్నుమూశారు. 25 మంది పర్యాటకులతో పాటు ఒక గుర్రపు స్వారీ ఆపరేటర్ చనిపోయిన వారిలో ఉన్నారు. ఈ దాడిని తీవ్రంగా పరిగణించిన భారత్ ప్రతీకార చర్యలకు దిగింది. పాక్‌తో సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. ఈమేరకు కేబినెట్ కమిటీ నిర్ణయాలు తీసుకొంది. అటారీ చెక్‌పోస్టును మూసివేసింది. సార్క్ వీసా పొడిగింపు స్కీమ్ కింద పాక్ జాతీయులు దేశంలోకి రావడానికి వీల్లేదని తేల్చిచెప్పింది.

పాక్ హైకమిషన్ వద్ద భారీ నిరసన

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిపై దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ వెలుపల భారీగా జనం గుమిగూడి నిరసన తెలిపారు. భారత్‌లో ఉగ్ర దాడులకు పాల్పడుతున్న ఆ దేశంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. నిరసన నేపథ్యంలో పాకిస్థాన్ హైకమిషన్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. జాతీయ జెండాలను చేతపట్టి నిరసన చేస్తున్న జనాన్ని శాంతింపజేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్య సంబంధాలు మరింతగా దెబ్బతిన్నాయి. పాకిస్థాన్ ప్రభుత్వ అధికారిక ఎక్స్ ఖాతా వినియోగాన్ని భారత్ నిలిపివేసింది. దశాబ్దాల నాటి సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. పాకిస్థాన్ దౌత్య సిబ్బందిని బహిష్కరించింది. భారత్, పాకిస్థాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుంచి 30కు తగ్గించింది. మరోవైపు ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్ నుంచి రక్షణ, నౌకాదళం, వైమానిక సలహాదారులందరినీ భారత్ బహిష్కరించింది. వారంలోగా దేశం విడిచి వెళ్లాలని వారికి సూచించింది. అలాగే ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ నుంచి సైనిక సలహాదారులను ఉపసంహరించింది. ఇరు దేశాల రాయబార కార్యాలయాల్లో సేవా సలహాదారులకు కేటాయించిన ఐదుగురు సహాయక సిబ్బందిని కూడా భారత్ రీకాల్ చేసింది.

'సింధూ' సంధి రద్దుతో పాక్‌కు దెబ్బ

- వ్యవసాయాధారిత ఆదాయానికి గండి
- ఆహార భద్రతకు ముప్పు-విద్యుత్ ఉత్పత్తికి విఘాతం
- తాగు-సాగునీటి ఎద్దడితో కరువు అవకాశం

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు సింధూ నది జీవనాడి. అక్కడి 80 శాతం పంటలకు నీరందిస్తుంది. 16 లక్షల హెక్టార్లలో సాకుకు ఉపయోగపడుతుంది. తద్వారా పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారింది. జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడి జరగడంతో పాకిస్థాన్‌తో 1960లో చేసుకున్న సింధూ జల సంధిని భారత్ రద్దు చేసింది. ఈ చర్య పాక్ వ్యవసాయాధారిత ఆదాయానికి దెబ్బ అని... కీలక పంటల సాగు వేళలో ఇలాంటి పరిణామం నష్టదాయకంగా పరిణమిస్తుందని నిపుణులు హెచ్చరించారు. దీని ప్రభావం దీర్ఘకాలం ఉండవచ్చన్నారు. సింధూ జల సంధి రద్దు క్రమంలో పాక్‌లో వ్యవసాయ ఉత్పత్తులు కుప్పకూలి... ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. పట్టణాలు, నగరాల్లో సరిపడా నీరు దొరక్క ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటారు. ఆయా జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయి పరిశ్రమలకు, గృహాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. సింధూ జలాల ప్రవాహం తగ్గితే నీటిపారుదల నిర్వహణ అధ్వాన్నస్థితికి చేరిన పాక్‌లో భూగర్భజలాలు అడుగంటిపోతాయి. గ్రామాల్లో రుణ ఎగవేతలు, నిరుద్యోగం, వలసలు పెరుగుతాయి. నీటి ఎద్దడితో కరువు తాండవిస్తుంది.

సింధూ, దాని ఉపనదుల జలాలు పంచుకోవడంపై భారత్-పాక్ మధ్య సింధూ జల సంధిపై 1960 సెప్టెంబరులో భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయ్యూబ్ ఖాన్ సంతకాలు చేశారు. దీంతో సింధు ఉప నదుల్లో రావి, బియాస్, సట్లెజ్‌పై భారత్‌కు హక్కులు లభించాయి. తద్వారా 41 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని భారత్ వినియోగించుకోవచ్చు. మరోవైపు సింధుతో పాటు దాని ఉప నదులైన ఝీలం, చీనాబ్‌పై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. ఈ ఒప్పందం మేరకు భారత్ వాటా జలాలను సేద్యానికే కాకుండా విద్యుత్ ఉత్పత్తి, రవాణా, చేపల వేటకు ఉపయోగించుకోవచ్చు. ఈ జలాలకు సంబంధించి శాశ్వత సింధు కమిషన్ కూడా ఏర్పాటైంది. రెండు దేశాల కమిషనర్లు ఏటా ఈ ఒప్పందం అమలును సమీక్షిస్తారు. ఇప్పుడు ఈ జల సంధిని భారత్ రద్దు చేసుకోవడంపై న్యాపరంగా ఉన్న అవరోధాలను నిపుణులు ప్రస్తావించారు. భారత్ ఎగువన ఉండటంతో దానికి ప్రయోజనం ఉంటుందని, పాకిస్థాన్ ఆర్థికంగా కుదేలవుతుందన్నారు. పాక్‌లో దాదాపు 23.7 కోట్ల మంది ఈ నదిపై ఆధారపడుతున్నారు. కరాచీ, లాహోర్, ముల్తాన్ వంటి నగరాల నీటి అవసరాలను సింధూ తీరుస్తోంది. తర్బెలా, మాంగ్లా జల విద్యుత్ కేంద్రాలకు ఈ నది జలాలే ఆధారం. ఝీలం నదిపై నిర్మించిన మంగ్ల డ్యామ్ నుంచి ఏటా 8 శాతం విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, సింధూ నదిపై నిర్మించిన తర్బెల డ్యామ్ నుంచి 16 శాతం విద్యుత్తు తయారవుతుంది. పాకిస్థాన్ జీడీపీలో 25 శాతాన్ని అందిస్తున్న వ్యవసాయ ఉత్పత్తులు గోధుమ, వరి, చెరకు, పత్తి వంటి పంటలు ఈ నదిపైనే ఆధారపడి ఉన్నాయి. పాకిస్థాన్ ఇప్పటికే ఆర్థిక మందగమనం ఉంది. పాకిస్థాన్ జీడీపీలో సేద్యానికి 22.7శాతం వాటా ఉంది. 37.4 శాతం మంది పౌరులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కాబట్టి తాజా పరిస్థితుల్లో దేశ ఆర్థిక పరిస్థితి మరింతగా క్షీణిస్తుందని 2022-23 ఆర్థిక సర్వే గణాంకాలు చెబుతున్నాయి. అయితే సింధూ జలాల నిల్వ, మళ్లింపునకు సరైన వసతులు లేవు. దీంతో నీటి ప్రవాహాన్ని ఆపడం భారత్‌కు సాధ్యం కాదు. తక్షణమే 5-10శాతం జల ప్రవాహాన్ని మాత్రం తగ్గించవచ్చని నిపుణులు తెలిపారు. సింధూ, ఝీలం, చీనాబ్ నదుల ప్రవాహానికి ఆటంకం కలిగించే నిర్మాణాలు ఇప్పటి వరకు లేవు. జల సంధి కారణంగానే అలాంటి నిర్మాణాలు జరగలేదు. ఇప్పుడు ఆ సంధిని రద్దు చేయడంతో భారత్ స్వేచ్ఛగా నిర్మాణాలు చేపట్టగలదు. భారీ ఆనకట్టలు నిర్మించుకోగలదు. అదే జరిగితే పాక్ గొంతు ఎండిపోవడం ఖాయమని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఆనకట్టలు, నదులు, ప్రజలకు సంబంధించి దక్షిణాసియా నెట్వర్క్ (ఎస్ఏఎన్‌డీఆర్‌పీ)కు చెందిన హిమాంషు థాకర్ స్పందిస్తూ 'ఏకపక్షంగా రద్దు చేసేలా ఈ ఒప్పందంలో ఎలాంటి వెలుసుబాటు లేదు. భారత్‌కు తూర్పున ప్రవహించే నదులకు సంబంధించి కేటాయించిన జల వాటాలో చాలా వరకు భారత్ వినియోగించుకుంటోంది. ఇప్పుడు పశ్చిమ నదులు సింధూ, ఝీలం, చీనబ్ జలాలు సమస్యగా మారాయి. ఈ నదీ ప్రవాహాన్ని ఆపే మార్గాలు లేవు. చీనబ్ బేసిన్‌లో చాలా ప్రాజెక్టులు ఐదు నుంచి ఏడేళ్లలో పూర్తి అవుతాయి. అప్పటి వరకు పాకిస్థాన్‌లోకి నదీ జలాలు ప్రవహిస్తాయి. ప్రాజెక్టులు పూర్తి అయితే నదీ జలాల ప్రవాహాన్ని నియంత్రించే అవకాశం భారత్‌కు ఉంటుది' అని అన్నారు. 'జల సంధి రద్దును ప్రకటించి, నదీ ప్రవాహాన్ని ఆపేందుకు యత్నిస్తే... అది అమల్లోకి రావాలంటే పదేళ్లు పడుతుంది.

అలా నీళ్లు ఆపేస్తే అది యుద్ధానికి దారితీస్తుంది' అని మంథన్ అధ్యాయన్ కేంద్ర వ్యవస్థాపకుడు, పర్యావరణ కార్యకర్త శ్రీపత్ ధర్మాధికారి హెచ్చరించారు.

పరిమితికి మించి ఉంటున్న విదేశీయులపై నిఘా

కర్నాటక పోలీసులకు సీఎం సిద్దరాయమ్మ ఆదేశం

చమరాజనగర: అనుమతించిన కాలానికి మించి రాష్ట్రంలో ఉంటున్న విదేశీయుల విషయంలో అప్రమత్తం కావాలని కర్నాటక పోలీసులకు సీఎం సిద్దరామయ్య సూచించారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి నేపథ్యంలో ఆయన ఈ మేరకు సూచనలు చేశారు. సిద్దరామయ్య గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పరిమితికి మించి ఉంటున్న విదేశీయులపై నిఘా పెట్టాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులకు సూచించాను' అని చెప్పారు. జమ్మూకశ్మీర్, పహల్గాం ఘటనను తీవ్రంగా ఖండించారు. అది అమానవీయ చర్య అని సీఎం అభివర్ణించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. కులం, మతంతో సంబంధం లేకుండా ఉగ్రవాదులను తుది ముట్టించాలని నొక్కిచెప్పారు. ఉగ్రవాదంపై పోరుకు తమ పార్టీ, ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన అనుమతులు లభించిన వెంటనే కావేరి నదిపై మేకథాతు ప్రాజెక్టు అమలు చేసేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఒక ప్రశ్నకు సీఎం సమాధానం ఇచ్చారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పటికీ ఈ వ్యవహారంలో ఇంత వరకు ఎలాంటి పురోగతి లేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తరచూ నిధుల్లో రాష్ట్ర వాటాను విడుదల చేయదని, కేటాయింపులు పెంచదని ఆయనన్నారు. ఎగువ భద్ర ప్రాజెక్టుకు 2023-24లో రూ.5,300 కోట్లు ప్రకటించారు కానీ రూపాయి విడుదల చేయలేదని సీఎం అన్నారు. బసవరాజ్ బొమ్మై ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు... బడ్జెట్ ప్రసంగంలో ఈ మేరకు ఆర్థిక మంత్రి సీతారామన్ ప్రకటించారని గుర్తుచేశారు. ఇదంతా రాజకీయ కక్షసాధింపులో భాగమా అని ఒక విలేకరి అడిగితే... 'నాకు అలానే తోస్తోంది' అని సిద్దరామయ్య బదులిచ్చారు.

'అభిర్ గులాల్' విడుదల నిలిపివేత

న్యూఢిల్లీ: పాకిస్థాన్ నటుడు ఫవాద్ ఖాన్ నటించిన 'అభిర్ గులాల్' చిత్రం విడుదల నిలిచిపోయింది. మే 9న విడుదల కావాల్సి ఈ చిత్రాన్ని నిలిపివేసినట్లు ప్రభుత్వ వర్గాలు గురువారం వెల్లడించాయి. జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. అభిర్ గులాల్ చిత్రంలో ఫవాద్ ఖాన్ సరసన వాణీ కపూర్ నటించారు. ఆర్తీ ఎస్ బాగ్దీ దర్శకత్వం వహించారు. ఉగ్రదాడిలో 26 మంది చనిపోవడానికి నిరసనగా ఈ చిత్రాన్ని నిషేధించాలన్న డిమాండ్ వచ్చింది. పాకిస్థానీ నటులపై నిషేధాన్ని ఫెడరేషన్ ఆఫ్ వెస్టరన్ ఇండియా సినీ ఎంప్లాయీస్ (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) పునరుద్ఘాటించింది. పాకిస్థాన్ నటులు, గాయకులు, టెక్నీషియన్లకు భారత సినీ పరిశ్రమలో స్థానం లేదని పేర్కొంది. ఫవాద్ ఖాన్ చివరగా 2016లో విడుదలైన 'అయ్ దిల్ హై ముష్కిల్' చిత్రంలో కనిపించారు. పుల్వామా ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్ కళాకారులను భారత్ నిషేధించింది. ఇదిలావుంటే, అభిర్ గులాల్ చిత్రాన్ని విడుదల కానివ్వమని రాజ్ ఠాక్రే 'మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్) కూడా ఇటీవల ప్రకటించింది.

ఉగ్రవాదులను మట్టిలో కలిపే సమయం ఆసన్నం

ప్రధాని మోదీ హెచ్చరిక



పాట్నా: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి పాల్పడ్డ ముష్కరులకు ఊహించని రీతిలో శిక్షిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. గురువారం బీహార్ మధుబనిలో పంచాయతీరాజ్ దినోత్సవంలో పాల్గొన్న మోదీ మాట్లాడుతూ... పహల్గాం ఉగ్రదాడిపై తొలిసారి మాట్లాడారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలిస్తామని, వారిని మట్టిలో కలిపే సమయం ఆసన్నమైందన్నారు. ఇది పర్యాటకులపై జరిగిన దాడి కాదని, భారత్ ఆత్మపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ప్రతి ఉగ్రవాదిని గుర్తించి, వెంటాడి భారత్ హతమారుస్తుందని స్పష్టం చేశారు. ఉగ్రదాడికి పాల్పడిన వారు, వారికి తోడ్పాటు నందించిన వారు భారీ మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు. కష్ట సమయంలో బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా ఉందని మోదీ తెలిపారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని చెప్పారు. ఉగ్రదాడి కారణంగా ఓ తల్లి కుమారుడిని కోల్పోయిందని, ఓ సోదరికి జీవిత భాగస్వామి దూరమయ్యాడని అన్నారు. కార్గిల్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి ఒక్కరిలోనూ బాధ, ఆగ్రహం ఉన్నాయని చెప్పారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రతి ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. విపత్కర పరిస్థితిని ఎదుర్కొనేందుకు దేశం మొత్తం దృఢ సంకల్పంతో ఉందని చెప్పారు. ఉగ్రమూకల వెన్నెముకను 140 కోట్ల మంది విరిచేస్తారని మోదీ హెచ్చరించారు. అదే సమయంలో భారత్‌కు అండగా నిలిచిన దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. మానవత్వాన్ని విశ్వసించే ప్రతి ఒక్కరూ తమకు అండగా నిలిచారని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదంతో భారత ఐక్యతను దెబ్బకొట్టలేరని మోదీ స్పష్టం చేశారు. తొలుత తన ప్రసంగం ఆరంభంలో పహల్గాం మృతులకు ప్రధాని నివాళులర్పించారు. మోదీతో పాటు సభలోని వారంతా ఒక నిమిషం పాటు మౌనం పాటించి అంజలి ఘటించారు.

పాక్‌పై ఆంక్షల అస్త్రం

'ఎక్స్' నిలిపివేత...వాఘా సరిహద్దు మూసివేత

న్యూఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ ఆంక్షల అస్త్రం ప్రయోగించింది. ఇప్పటికే ఢిల్లీలోని పాక్ దౌత్యవేత్తకు సమన్లు జారీ చేసిన భారత్... మరికొన్ని చర్యలకు ఉపక్రమించింది. పహల్గాం దాడి నేపథ్యంలో బుధవారం రాత్రి ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమైంది. ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. పాక్‌తో ఉన్న భారత సరిహద్దులన్నింటినీ మూసివేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా గురువారం అట్టారీ-వాఘా సరిహద్దును కేంద్రం మూసివేసింది. అలాగే, భారత్‌లో పాకిస్థాన్ 'ఎక్స్' అధికారిక అకౌంట్‌ను నిలిపివేసింది. పాకిస్థాన్ ఖాతాను భారత్‌లో నిలిపివేయాలని 'ఎక్స్'ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ కోరగా... ఈ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న 'ఎక్స్' పాక్ అధికారిక ఖాతాను భారత్‌లో నిలిపివేసింది. దీంతో అందులోని కంటెంట్‌ను భారత యూజర్లు చూడలేరు. ఇదిలా ఉండగా, ఉగ్రవాదాన్ని వీడే వరకూ పాకిస్థాన్ పట్ల కఠినంగా వ్యవహరించాలని సీసీఎస్ మీటింగ్ లో కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాకిస్థాన్‌కు సంబంధించిన దౌత్య సంబంధాలపై భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. బుధవారం అర్ధరాత్రే ఢిల్లీలోని పాకిస్థాన్ ప్రధాన దౌత్యవేత్తకు కేంద్రం సమన్లు జారీ చేసింది.

సీసీఎస్ తీసుకున్న నిర్ణయాలు

- సీమాంతర ఉగ్రవాదానికి ముగింపు పలికే వరకు పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందం నిలిపివేత.
- భారత్, పాకిస్థాన్‌లలోని ఇరుదేశాల హైకమిషన్ కార్యాలయాల్లో సిబ్బంది సంఖ్య 55 నుంచి 30కి తగ్గింపు.
- సార్క్ వీసా మినహాయింపు పథకం ద్వారా మన దేశంలో పర్యటిస్తున్న పాక్ జాతీయులకు అనుమతుల రద్దు.
- వచ్చే నెల 1వ తేదీలోగా దేశం వదిలి వెళ్లిపోవాలని ఆదేశం.
- పాకిస్థాన్ సరిహద్దు వెంట అప్రమత్తంగా ఉండాలని భారత సైన్యానికి సూచన.
- భారత్‌లోని పాకిస్థాన్ దౌత్య కార్యాలయాల్లో పనిచేస్తోన్న ఆ దేశ సైనిక సిబ్బంది, అధికారులను అవాంఛిత వ్యక్తులుగా ప్రకటిస్తూ నిర్ణయం. దేశం వీడి వెళ్లేందుకు వారం రోజుల గడువు విధింపు.

నా బాబుకు దిక్కెవరు?

బిటైన్ అధికారి భార్య సోహిని కన్నీరు

కోల్‌కతా: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటన దేశంలో తీవ్ర విషాదం నింపింది. మతోన్మాదంతో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధం అనేక కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. సంతోషంతో కశ్మీర్ వెళ్లిన తమ వారు విగతజీవులుగా తిరిగి రావడాన్ని చూసి కుటుంబ సభ్యులు, ఆప్తులు కంటతడి పెడుతున్న దృశ్యాలు అందరి హృదయాలను కలచివేస్తున్నాయి. ఉగ్రదాడిలో మృతిచెందిన వారి భౌతికకాయాలను సొంత గ్రామాలకు తరలించడంతో స్థానిక ప్రముఖులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి మృతులకు నివాళులర్పించారు. పశ్చిమ బెంగాల్‌లోని పలు చోట్ల బాధిత కుటుంబాల ఆవేదన అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఉగ్రదాడిలో తన భర్త బిటైన్ అధికారి (40) మరణంతో తన ప్రపంచం కూలిపోయిందని, తన మూడేళ్ల కుమారుడిని చూసుకొనేదెవరంటూ ఆయన భార్య సోహిని కన్నీరు పెట్టుకున్నారు. ఆమెను పశ్చిమ బెంగాల్ బీజేపీ నేతలు సువేందు అధికారి, అగ్నిమిత్ర పాల్ పరామర్శించి ఓదార్చారు. కశ్మీర్‌లో ఉగ్రదాడి సమయంలో తమకు ఎదురైన భయానక అనుభవాన్ని ఆమె సువేందుకు వివరించారు. ఉగ్రవాదులు కొన్ని మత సంబంధిత పదాలు చెప్పాలని తన భర్తను కోరగా... అవి తనకు తెలియదని చెప్పడంతో కాల్చేశారని కన్నీరుమున్నీరుగా విలపించారు. తన మూడేళ్ల కొడుకు తండ్రి కోసం కలవరిస్తున్నాడన్నారు.

చిరునవ్వుతో కశ్మీర్ వెళ్లాడు: ఓ తండ్రి ఆవేదన

చిరునవ్వులు చిందిస్తూ కశ్మీర్ పర్యటనకు బయల్దేరిన తన కుమారుడు విగతజీవిగా తిరిగి రావడం చూసి ఓ తండ్రి తట్టుకోలేకపోయారు. 'నాకు ఎవరితో మాట్లాడాలని లేదు. దయచేసి నన్ను ఒంటరిగా వదిలేయండి' అంటూ కొడుకు భౌతికకాయాన్ని చూసి బోరున విలపించారు. హైదరాబాద్‌లోని ఇంటెలిజెన్స్‌బ్యూరోలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మనీశ్ రంజన్ ఉగ్రదాడిలో మరణించిన విషయం తెలిసిందే. దీంతో అతడి భౌతికకాయాన్ని పశ్చిమబెంగాల్‌లోని పురులియా జిల్లా ఝల్దాకు తరలించారు. 'రంజన్ చిరునవ్వుతో వెళ్లాడు. ఫోన్, వాట్సప్‌లో రెగ్యులర్‌గా మాట్లాడేవాడు. మా ఆరోగ్యం గురించి వాకబు చేసేవాడు. ఈ దురదృష్టకర ఘటన జరిగిన రోజూ మాకు కాల్ చేశాడు' అని తండ్రి గుర్తు చేసుకున్నారు. మరోవైపు, కశ్మీర్ పర్యటన నుంచి వచ్చాక తన తల్లిదండ్రులతో వైష్ణోదేవి ఆలయానికి వెళ్లాలని మనీశ్ రంజన్ పథకం సిద్ధం చేసినట్లు అతడి స్నేహితుడు సంజీవ్ కుమార్ గుప్తా వెల్లడించారు. రంజన్ భౌతికకాయాన్ని తీసుకెళ్లేందుకు రాంచీ విమానాశ్రయానికి వచ్చిన సందర్భంగా అతడు మీడియాతో మాట్లాడాడు. ఎంతో ప్రతిభగల విద్యార్థిగా ఉండేవాడని, ఇటీవల అతడి తండ్రి స్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పదవీ విరమణ చేశారని తెలిపారు. ఇంత దారుణ ఘటన జరుగుతుందని తాము ఊహించలేదని రంజన్ మరో స్నేహితుడు ఆదిత్య శర్మ అన్నారు.

ఉగ్రదాడిలో మృతులకు నివాళిగా ఝల్దా పట్టణంలో దుకాణాలు మూసివేశారు. బీజేపీ జార్ఖండ్ రాష్ట్ర అధ్యక్షుడు బాబులాల్ మరాండీ... రంజన్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకుల్ని చంపిన తీరు క్షమించరానిదన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. కేంద్రమంత్రి సుకాంత మజుందార్ ఝల్దాలో రంజన్ చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన తల్లిదండ్రుల్ని ఓదార్చారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారిపై వారికి అర్థమయ్యే భాషలోనే సమాధానం చెబుతామన్నారు.

కశ్మీరీయులకు భద్రత కల్పించండి

అమిత్‌షాకు ముఫ్తీ విజ్ఞప్తి

శ్రీనగర్: పహల్గాం ఉగ్రదాడి అనంతరం మితవాద శక్తుల బెదిరింపుల నేపథ్యంలో దేశవ్యాప్తంగా కశ్మీరీయులకు భద్రత కల్పించాలని పీడీపీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ గురువారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కోరారు. పహల్గాం ఉగ్రవాద దాడి మృతులకు సంతాపం తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు సంఘీభావం ప్రకటించేందుకు అమిత్‌షాతో మాట్లాడినట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. 'ఈ దుఃఖ సమయంలో మేము దేశం వెంట ఉన్నాం. వివిధ రాష్ట్రాల్లోని కశ్మీరీ విద్యార్థులు, వ్యాపారులను కొన్నిశక్తులు బహిరంగంగా బెదిరిస్తున్నందున వారి భద్రతకు హామీ ఇవ్వాల్సిందిగా హోంమంత్రిని అభ్యర్థించాను. అటువంటి సంఘటనలు ఎక్కడ జరిగినా వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని వారికి భద్రత, రక్షణ కల్పించాలని కోరాను' అని ముఫ్తీ తెలిపారు. పీపుల్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు సజ్జద్ లోనె కూడా కశ్మీరీ విద్యార్థుల భద్రతకు హామీ ఇవ్వాల్సిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా కశ్మీరీ విద్యార్థులను వేధించడం, దాడులు చేయడం, బెదిరించడం, వారి నివాస స్థలాలను ఖాళీ చేయమని కోరడం వంటి అనేక ఘటనలు జరిగాయి. కశ్మీరీ విద్యార్థుల భద్రతను నిర్ధారించాలని కేంద్రాన్ని అభ్యర్థిస్తున్నట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. డెహ్రాడూన్‌లో పనిచేస్తున్న, చదువుతున్న కశ్మీరీ ముస్లింలను ఒక రోజులోగా అక్కడి నుండి వెళ్లిపోవాలని, లేకుంటే తీవ్ర చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హిందూ రక్షా దళ్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే.

పాక్ జాతీయులకు వీసాలు బంద్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం పాక్ జాతీయులకు వీసా సేవలు పూర్తిగా నిలిపివేసింది. వైద్యపరమైన వాటితో సహా ఆ దేశ ప్రజలకు ఇచ్చిన అన్ని వీసాలను రద్దు చేసింది. ఈ మేరకు మన విదేశాంగ శాఖ కీలక ఆదేశాలు జారీచేసింది. "పాక్ జాతీయులకు భారత్ జారీ చేసిన అన్ని చెల్లుబాటు అయ్యే వీసాలు 2025 ఏప్రిల్ 27 నుంచి రద్దుకానున్నాయి. ఆ దేశీయులకు జారీ చేసిన అన్ని మెడికల్ వీసాలు ఏప్రిల్ 29 వరకు మాత్రమే చెల్లుబాటు అవుతాయి. ఈ గడువు ముగిసేలోగా వారంతా భారత్‌ను వీడివెళ్లిపోవాలి. ఈ దేశ పౌరులు పాక్‌లో పర్యటించవద్దని సూచిస్తున్నాం" అని విదేశాంగ శాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది.

భారత్‌ను వీడుతున్నారు...

ఇక ఇప్పటికే పాక్ జాతీయులు అమృతసర్‌లోని అటారీ- వాఘా రోడ్డు మార్గం ద్వారా భారత్‌ను వీడుతున్నారు. దీనిలో భాగంగా పలు పాకిస్థానీ కుటుంబాలు ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ వద్దకు చేరుకున్నాయి. "ఢిల్లీలో ఉన్న మా బంధువులను కలిసేందుకు ఏప్రిల్ 15న మేం భారత్ వచ్చాం. మా వీసా గడువు 45 రోజులు ఉంది" అని ఓ పాక్ కుటుంబం వెల్లడించింది.

విశాలాంధ్ర హైదరాబాద్

భూభారతిలో సమస్యలపై రైతులు అప్పీల్ చేసుకోవచ్చు

కలెక్టర్ గౌతం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : భూభారతిలో సమస్యలపై అప్పీల్ చేసుకునే హక్కు ప్రతి ఒక్క రైతుకు ఉందని, అదేవిధంగా ప్రతి సమస్యను పరిష్కరించే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో కల్పించిందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. గురువారం కీసర మండలంలోని చీర్యాల గ్రామంలో గల జయ మోహన్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ రైతుల సమస్యలకు పరిష్కారం తెలుపుతూ త్వరలోనే ప్రతి గ్రామంలో తహసీల్దారు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ సదస్సులో మీ వ్యక్తిగత భూసమస్యలకు సంబంధించిన అప్లికేషన్లు ఇస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. పాసు బుక్కులు రాని వారికి కొత్త పాసు పుస్తకాలు ఇవ్వడం, అలాగే పాసుబుక్కులలో తప్పులను సవరించడం ఈ భూభారతి చట్టం ద్వారా చేయవచ్చని తప్పని సరిగా రైతుల సమస్యలు తీరుస్తామని కలెక్టరు అన్నారు. రైతులు కోరుకుంటే లైసెన్స్ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి భౌతిక సరిహద్దుతో చేయించిన ల్యాండ్ మ్యాపులను ప్రభుత్వ సర్వేయర్లు మళ్లీ వాలిడేట్ చేసిన తరువాతే మీకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో ల్యాండ్ మ్యాపులు వస్తాయని, దీని వల్ల ఎవరికి నష్టం జరగదని ఇంకా పకడ్బందీగా మీ భూసరిహద్దులు ఉంటాయని, అది కూడా రైతు ఒప్పుకుంటేనే భూ సర్వే చేస్తామని కలెక్టరు తెలిపారు. ధరణి వల్ల పిఓబి సమస్యలు చాలా ఉన్నాయని, భూభారతి చట్టంలో పిఓబి రద్దుచేసే అధికారం కల్పించడం జరిగిందన్నారు. ఈ భూభారతి చట్టంలో ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న ఆ సంవత్సరంలో జరిగిన మార్పులు, చేర్పులను ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసి ప్రతి గ్రామ పంచాయతీ నోటీసు బోర్డులలో ప్రదర్శిస్తారని అందువల్ల మీకందరికి మీమీ భూముల రికార్డుల వివరాలు తప్పక తెలుస్తాయని కలెక్టరు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని, ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థను అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ భారతి 2025 చట్టంలో 23 సెక్షన్లు మరియు 18 నిబంధనలున్నాయని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ రైతులకు న్యాయబద్ధమైన మార్గం కల్పిస్తోందని తెలిపారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డులతో వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, భవిష్యత్తులో పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టరు తెలిపారు. ఈ సదస్సులో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, జిల్లా అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు, జిల్లా గ్రంథాలయ సంస్థ కమిటి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కీసర తహసీల్దారు అశోక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణ పర్యాటకుల కోసం హెల్ప్ లైన్

స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు: మంత్రి జూపల్లి కృష్ణారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారిని సురక్షితంగా స్వస్థలాలకు రప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పర్యాటకులకు తగిన సహాయం అందిస్తామని అన్నారు. ఈ ఘటనపై తెలంగాణ పర్యాటక శాఖ అధికారులు ఢిల్లీలోని తెలంగాణ భవన్ అధికారులతో పాటు కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని చెప్పారు. ఇటీవల జమ్ము, కాశ్మీర్‌లో ప్రయాణించిన పర్యాటకుల వివరాలు వెంటనే అందించాలని తెలంగాణలోని అన్ని టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్లను మంత్రి కోరారు. పర్యాటకుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు, అవసరమైన సమయంలో ప్రభుత్వ సహాయాన్ని అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామని, కాశ్మీర్‌లో చిక్కుకున్న తెలంగాణ పర్యాటకుల సహాయం కోసం నిరంతరం ఫోన్ ద్వారా సేవలు అందించేందుకు ఈ హెల్ప్‌లైన్ నెంబర్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. పర్యాటకుల బంధువులు లేదా స్నేహితులు కూడా తమ సమాచారం అందించేందుకు, లేదా సహాయం కోసం కింది నంబర్లకు కాల్ చేయాలని కోరారు. హెల్ప్‌లైన్ నంబర్లు : 9440816071, 9010659333, 040 23450368.

రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్దేశిత సమయానికి ప్రజలకు అందుబాటులో ఉంచాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్‌లో 42 లక్షల రూపాయలతో వేస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, మల్లికార్జున నగర్ కాలనీ ప్రతినిధులు వెంకటయ్య, అచ్యుతారావు, గోపాల్ రెడ్డి సత్యనారాయణ, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం గుర్తింపుకై సమావేశం

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : రాజీవ్ యువ వికాసం పథకం అమలు గురించి వివరించడానికి, ఈ పథకం కోసం జిల్లాలోని అర్హత కలిగిన లబ్ధిదారుల గుర్తింపు కోసం గురువారం సమావేశం జరిగింది. మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రాధిక గుప్తా అధ్యక్షతన సమావేశం జరిగింది. జిల్లా అధికారులు డిఆర్‌డిఓ, డిఆర్‌డిఎ, ఎం.సాంబశివరావు, బాబు మోసెస్, ఎస్సి కార్పొరేషన్ ఈడీ, బిసి సంక్షేమ అధికారిణి ఝాన్సీ రాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, గిరిజన సంక్షేమ శాఖ డిటిడిఓ వినోద్ కుమార్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డిఎం) సీ.శివ ప్రసాద్, జిల్లాలోని అన్ని బ్యాంకర్ కంట్రోలర్లు పాల్గొన్నారు. ఎడిసి రాధిక గుప్తా అన్ని జిల్లా అధికారి సభ్యులు ఎల్‌డిఎంతో పాటు మన జిల్లాలోని అన్ని బ్యాంకర్లను మంజూరు, గ్రౌండింగ్, స్థిరత్వాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

బీసీసీఐ అండర్-19కు హైదరాబాద్ సిటీ గర్ల్స్

కె.నిధి | సి.పి.పార్వతి | పి.వి.హన్సిక | సంధ్య

జాస్మిన్ | కావ్యశ్రీ | ఈ.సృజన

విశాలాంధ్ర - హైదరాబాద్ : బీసీసీఐ నిర్వహించనున్న క్రికెట్ అండర్ 19 ఎలైట్ శిబిరాలకు హైదరాబాద్ నగరానికి చెందిన ఆరుగురు అమ్మాయిలు స్థానం దక్కించుకున్నారు. ఒకే సారి సిటీకి చెందిన ఆరుగురు అమ్మాయిలు జాతీయ స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపిక కావటం ఇదే మొదటి సారి. హైదరాబాద్ నగరం గర్వించదగిన విషయం. ఎంపికైన వారిలో కే.నిధి, సంధ్య గోరా, కావ్యశ్రీ, జాస్మిన్ గిల్, పీవీ హంసకి, సీపీ పార్వతి, ఈ.శృజన అనే సిటీ క్రికెట్ ప్లేయర్లు త్వరలోనే జట్టు-ఏగా రాంచీలో జరగనున్న శిబిరంలో శిక్షణకు నిధి, సంధ్య, కావ్యశ్రీలు, కాగా, టీమ్-డీలో డెహ్రాడూన్‌లో నిర్వహించే శిక్షణకు హంసిక, పార్వతి, సృజన, టీమ్-బీలో భాగంగా అహ్మదాబాద్‌లో నిర్వహించే శిక్షణ శిబిరానికి జాస్మిన్ గిల్ హైదరాబాద్ నుంచి బీసీసీఐ అండర్-19 క్రికెట్ శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. ఆయా వేదికల్లో శుక్రవారం ఏప్రిల్ 25 నుంచి మే 21 వరకు శిక్షణ శిబిరాల్లో పాల్గొనున్నారు. శిక్షణ ముగిసిన తర్వాత ఈ యువ క్రీడాకారిణులు జాతీయ స్థాయి వేదికలపై తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు.

ఈనెల 27న ఉచిత కంటి పరీక్ష శిబిరం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఉచిత వైద్య కంటి పరీక్షా శిబిరం ఈనెల 27న ఆదివారం నేరేడ్‌మెట్‌లోని మహబోధి ఫంక్షన్ హాల్లో జంకేర్ ఫాలోమి, ముత్యాలరావు కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ, లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. వీటిలో బిపి, షుగర్ పరీక్ష, ఈసీజీ, కంటి పరీక్ష, తంతార పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు. ఈ క్యాంపు కో-ఆర్డినేటర్స్‌గా శ్రీదేవి 75690 65705, పద్మజ 62810 73112, జయశ్రీ 93910 39730, జ్యోతి 93811 01367 పూర్తి వివరాలకు 98494 65081, 95158 06413 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

కబ్జాలకు ఊతం ఇస్తున్న కలెక్టర్ : ఎమ్మెల్యే మర్రి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి: ప్రభుత్వ స్థలాలకు కలెక్టర్ ఊతం ఇస్తున్నారని మల్కాజిగిరి శాసన సభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. తనకు క్యాంపు కార్యాలయం, అందరు శాసన సభ్యులకు పర్సనల్ అసిస్టెంట్‌ను ఇచ్చినట్లు తనకు ఇవ్వాలని రెండవ రోజు చెట్టు క్రింద కూర్చుని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణాలో 119 నియోజకవర్గాల్లో క్యాంపు కార్యాలయాల కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇక్కడ ఎందుకు పూర్తి కాలేదో తనకు తెలియదని ఆయన తెలిపారు. దీనిపై కలెక్టర్‌ను అడగ్గా ఆయన తనకు సంబంధం లేదని, డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్‌లను అడగమని చెపితే తాను డిప్యూటీ కమిషనర్, జోనల్ కమిషనర్ కాళ్ళు మొక్కుతానని చెప్పినా వారు సైతం పట్టించుకునే పరిస్థితిలో లేరని ఆయన తెలిపారు. సర్వే నెంబర్ 582, 583లో 37 ఎకరాల యుఎల్‌సి స్థలం ఉందని, డబుల్ బేంచ్ తీర్పు వచ్చాక నాలుగు నెలల్లో కోర్టు తెలిపి, ప్రభుత్వాని ఇవ్వమని ఆదేశించినా, అది చేయడం లేదని ఆయన కబ్జాలకు ఎదేచ్ఛగా చేయని స్తున్నారని ఆయన ఆరోపించారు. అల్వాల్‌లోనే సర్వే నెంబర్ 481, 435 భూదాన్ భూమి ఉందని దానిలో ప్రైవేటు బస్సులు నిలుపుతూ, ఇసుక వేస్తూ కిరాయిలు కూడ వసూలు చేసుకుంటు న్నారని ఆయన తెలిపారు. ఈ స్థలాన్ని క్రికెట్ గ్రౌండ్‌కు గానీ ఇతర అవసరాలకు కేటాయించమంటే కలెక్టర్ స్పందించరని, ఒక కార్యాలయం గురించి అడిగినా ఆయన పట్టించుకోరని, సమాచార హక్కు చట్టం క్రింద సమాచారాన్ని తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయన తెలిపారు. చెట్టు క్రింద కూడ సౌకర్యావంతంగానే ఉందని, పదవీ కాలం అయిపోయేంత వరకు ఇక్కడి నుండి తాను ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వెనక్కు పోనని ఆయన తెలిపారు. మల్కాజిగిరిలో నిర్మాణంలో ఉన్న క్యాంపు కార్యాలయం గురించి ప్రస్తావిస్తే ప్రభుత్వ అధికారులు తెలిపాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసి వెంకన్న, రాముయాదవ్, మురిగేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేల కోట్ల ఆదాయాన్ని సాధించిన డీఎస్ గ్రూప్

విశాలాంధ్ర - హైదరాబాద్ : డీఎస్ గ్రూప్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.10,000 కోట్ల ఆదాయం అనే మైలురాయిని సాధించడం ద్వారా సంచలనం సృష్టించింది. తద్వారా భారతదేశంలోని టాప్ 15 ఎఫ్ ఎం సిజి కంపెనీల జాబితాలోకి చేరుకుంది. ఈ సందర్భంగా గ్రూప్ వైస్ చైర్మన్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ రూ.10,000 కోట్ల ఆదాయ మైలురాయిని అధిగమించడం కేవలం ఆర్థిక విజయం మాత్రమే కాదన్నారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న కథలో గణనీయమైన సహకారిగా మా సమగ్ర పాత్రను ఇది సూచిస్తుందని పేర్కొన్నారు. మా వైవిధ్యమైన పోర్ట్‌ఫోలియో, నాణ్యత మరియు ఆవిష్కరణలపై అంకితభావంతో కూడిన దృష్టి ఇందుకు ప్రధాన కారణంగా చెప్పారు. అంతేకాకుండా దేశంలోని ఎఫ్ ఎంసిజి విభాగంలో అతిపెద్ద పంపిణీ నెట్‌వర్క్‌లలో ఒకటి ద్వారా ఎఫ్ ఎంసీజీ రంగం విస్తరణకు డీఎస్ గ్రూప్ కీలక పాత్ర పోషించిందని వివరించారు. గత మూడు సంవత్సరాలుగా ఆహారం పానీయాల విభాగం వేగవంతమైన వృద్ధిని సాధించిందన్నారు. ఈ మైలురాయి భారతీయ వినియోగదారులు మాపై ఉంచిన నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు. వారి అభివృద్ధి చెందుతున్న అవసరాలు నిరంతరం మమ్మల్ని చురుగ్గా ఉండేందుకు ప్రేరేపిస్తుందన్నారు. మా శతాబ్ది సంవత్సరం నాటికి రూ.20,000 కోట్ల మైలురాయిని సాధించాలని మేము కోరుకుంటున్నామన్నారు.

ఏపీ సీఎం చంద్రబాబుకు కేటీఆర్ వల

విశాలాంధ్ర- హైదరాబాద్ : ఏపీ సీఎం చంద్రబాబుకి మాజీమంత్రి కేటీఆర్ వల వేస్తున్నారని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. ఎన్డీఏ కూటమికి దగ్గరయ్యేందుకు కేటీఆర్ ప్రయత్నాలు మొదలు పెట్టారని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేటీఆర్ చంద్రబాబు గురించి పాజిటివ్‌గా మాట్లాడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గురువారం గాంధీభవన్‌లో అద్దంకి దయాకర్ మీడియాతో మాట్లాడారు. కనీసం కేసీఆర్ కుటుంబం నుంచి కాకుండా వేరే వెలమనైనా బీఆర్ఎస్ అధ్యక్షుడిని చేయగలరా అని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేటీఆర్‌కి దమ్ముంటే పార్టీ అధ్యక్ష పదవి తీసుకొని బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తేవాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సవాల్ విసిరారు.

అధ్యక్ష పదవి చేపట్టిన రెండు సంవత్సరాలకే కాంగ్రెస్ పార్టీని రేవంత్‌రెడ్డి అధికారంలోకి తెచ్చారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరని ప్రశ్నల వర్షం కురిపించారు. కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంటో, నాన్ వర్కింగ్ ప్రెసిడెంటో ఆయనకే తెలియాలని ఎద్దేవా చేశారు. 25 సంవత్సరాలు బీఆర్ఎస్ పార్టీకా.. టీఆర్ఎస్ పార్టీకా అని నిలదీశారు. తెలంగాణలో టీఆర్ఎస్ పార్టీ లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టి రెండేళ్లు అయిందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చెప్పారు. జనతా గ్యారేజ్ సినిమాలో ఓనర్ కొడుకు విలన్ అయ్యారని.. బీఆర్ఎస్ పార్టీ జనతా గ్యారేజ్ అయితే పార్టీ ఓనర్ కొడుకు కేటీఆర్ విలనా అని సెటైర్లు గుప్పించారు. కమలం పువ్వు కాడికి గులాబీ పువ్వును అంటగడుతున్నారని విమర్శించారు.

చంద్రబాబు తాము వేర్వేరు కాదని కేటీఆర్ ఇప్పుడు ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. చంద్రబాబుకి తమకు సారూప్యత ఉందని కేటీఆర్ చెప్పడం లేదా అని నిలదీశారు. హెచ్‌సీయూ భూముల విషయంలో బీఆర్ఎస్ హ్యాండిల్స్ నుంచి ఫొటోలు ఎందుకు డిలీట్ చేస్తున్నారో చెప్పాలని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ప్రశ్నల వర్షం కురిపించారు.

శ్రీవారి చలివేంద్రం ప్రారంభోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి బాపూనగర్ ఎన్.ఎన్.రెడ్డి టెక్స్టైల్స్ మెయిన్స్ బోటిక్ వారి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం శ్రీవారి చలివేంద్రం కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ చలివేంద్ర ప్రారంభోత్సవంలో బీసీ ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, ఎన్ ఎన్ రెడ్డి టెక్స్టైల్స్ ప్రోపరేటర్ కుశల్ సింహారెడ్డి, వారి స్టాంప్ మౌలానా, నర్సింగ్‌రావు, నేతాజీ నగర్ కాలనీవాసులు కె నరసింహ యాదవ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాయన్న ముదిరాజ్, సూర్య చంద్ర రెడ్డి, ఎక్సైడ్ బ్యాటరీ సర్వర్, కపిల్ చిట్ఫండ్ గ్రూప్ ఆఫ్ మేనేజర్స్ యాదవ్ రెడ్డి, మొర్రి సత్తయ్య, అశోక్, రమేష్, దేవేందర్, కృష్ణ, ఓంకార్, రాఘవేందర్, రాజ్ కుమార్, కిషన్, కార్యక్రమంలో పాల్గొన్నారు. బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రాణకోటికి నీరే ఆధారం నీరు లేనిదే జీవం లేదు. మంటల మండుతున్న ఎండల్లో బాటసారులకు తాగునీరు అందిస్తున్నటువంటి కుశలసింహారెడ్డికి అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ దాన గుణం కలిగి ఉండాలి అని అన్నారు. ప్రతి యేటా ఈ కార్యక్రమం నిర్వహిస్తూ ఎంతో మంది దాహార్తిని తీరుస్తూ వారి నుంచి ఆశీస్సులు అందుకుంటూ ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహించాలని మీకు ఈ అద్భుత కార్యక్రమాన్ని నిర్వర్తిస్తున్నందుకుగాను ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. సకల కోటి జీవులకు ఆహారం వేరు కావచ్చు కానీ దాహానికి మాత్రం నీరు కావాలి. అట్టి నీరును వృధా చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనదని అన్నారు.

వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, పేదల ప్రభుత్వమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గు మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ రైతుకు క్వింటాలుకు 2,320 రూపాయలతో గిట్టుబాటు ధరతో పాటు, ప్రభుత్వం అదనంగా 500 రూపాయలు బోనస్‌ను ఇస్తుందన్నారు. రైతు కష్టానికి ప్రభుత్వం ప్రతిఫలం అందజేస్తున్నదని, రైతులు బయట మార్కెట్లో దళారులను నమ్మి మోసపోవద్దని, వరిని బయట మార్కెట్లో అమ్ముకోవద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సకాలంలో డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని పేదల కోసం రేషన్ షాపుల్లో సన్నబియ్యంగా అందజేస్తున్న గొప్ప ఆలోచన రేవంత్ రెడ్డిది అన్నారు. అనంతరం కొందుర్గులో నూతనంగా నిర్మించబోయే మార్కెట్ స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కొందుర్గ్ మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ రెడ్డి, మార్కెట్ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, కొందుర్గ్ ప్రాథమిక సహకార సంఘము ఛైర్మన్ దామోదర్ రెడ్డి, రామయ్య గౌడ్, పురుషోత్తం రెడ్డి, ఇబ్రహీం, రాజు, యాదయ్య, చంద్ర శేఖర్, మహబూబ్, ఆంజనేయులు, మల్లేశ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీగా ప్రజలు తరలిరావాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీది చేతగాని ప్రభుత్వమని తేటతెల్లమైందని, 16 నెలల పాలనలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల కోసం కనీసం 16 పనులు చేయలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. పార్టీ నాయకులతో కలిసి ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ప్రాంగణంలో ఏర్పాట్లను ఎమ్మెల్సీ కవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... తెలంగాణ బాగుండాలని బీఆర్ఎస్ నాయకులు అనుకుంటారని, కానీ ఓట్లు బాగా రావాలని కోరునేది కాంగ్రెస్, బీజేపీ నాయకులు అని తెలిపారు. ఆ రెండు పార్టీలు ప్రజల మధ్య చీలిక తీసుకొచ్చి ఓట్లు పొందే ప్రయత్నం చేస్తాయనీ విమర్శించారు. రజతోత్సవం ఎందుకు చేసుకుంటున్నారని కొంత మంది వెకిలి మాటలు మాట్లాడుతున్నారనీ తప్పు పట్టారు. "దేశానికే సేవలు అందించడానికి బీఆర్ఎస్ పార్టీగా రూపాంతరం చెందాము. పరిణితి చెందడం ప్రకృతి ధర్మం. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీగా మారిందంటే అది ప్రజల కోరుకున్న రెవల్యూషన్ కాంగ్రెస్ నాయకులు అవాకులు చెవాకులు, పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే చూస్తూ ఊరుబోము. కాంగ్రెస్ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలిలి అని హెచ్చరించారు. ఓర్వలేని కాంగ్రెస్ నేతలు మాట్లాడే మాటలను ప్రజలు క్షమించబోరని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల విజయాన్ని ప్రపంచానికి చాటడానికే బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాటు చేసుకున్నామని చెప్పారు. తెలంగాణ అస్తిత్వం కోసం 2001లో కేసీఆర్ పిడికిలి బిగించి ఉద్యమాన్ని మొదలుపెట్టారని, ఉద్యమం మొదలుపెట్టినప్పుడు ఉత్పన్నమైన అన్ని అనుమానాలను కేసీఆర్ పటాపంచలు చేశారని తెలిపారు. ఒక రక్తం చుక్కు కూడా చిందించకుండా రాష్ట్రం సాధించిన ధీరుడు కేసీఆర్ అని కొనియాడారు ఎన్ని అవాంతరాలు ఎదురైనా గుండె ధైర్యంతో బీఆర్ఎస్ పార్టీని, తెలంగాణను కాపాడుతూ వచ్చారని, తెలంగాణ ఉట్టిగనే రాలేదు... కేసీఆర్ మేధస్సును కరిగిస్తే వచ్చిందని స్పష్టం చేశారు. రాజకీయ కుట్రలను చేధించి తెలంగాణ వాదాన్ని ప్రజల్లో నిలబెట్టారని పేర్కొన్నారు. కుంభమేళ తరహాలో జరగబోయే ఈ రజతోత్సవ సభకు అన్ని వర్గాల ప్రజలు భారీ ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ నవయువకుల కోసం రజతోత్సవ సభ జరుగుతుందని, సభకు యువత పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రామంతాపూర్‌లో కాంగ్రెస్ కాగడాల ప్రదర్శన

పహల్గాం దాడి మృతులకు నివాళి

విశాలాంధ్ర - కాప్రా : కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులపై ఉగ్రదాడిని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఉగ్ర మూఖల దాడిలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉగ్రదాడిని ఖండిస్తూ మృతులకు నివాళిగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రామంతాపూర్ భారీ ఎత్తున కాగడాల ప్రదర్శన చేపట్టారు. ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్ లోయలో ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్యగా ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉగ్ర మూఖలు చేసిన చీకటి దాడిలో అమాయకులు మృతి చెందారన్నారు. మృతుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. దొంగ దెబ్బ తీసిన ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోఫిక్, ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్, రామంతాపూర్ డివిజన్ అధ్యక్షులు రఫిక్, సుర్వి మురళి గౌడ్, వాళ్ళపు శ్రీకాంత్ యాదవ్, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు విజయ్, జలీల్ పాష, గరిక సుధాకర్, పేట మురళి ముదిరాజ్, ఉపేందర్ రెడ్డి, సందీప్, నామ్ రాజీ రెడ్డి, సతీష్ గౌడ్, ముత్యాల బాబు, ముత్యాల జంగయ్య, అజ్మత్ పాషా, సతీష్ గౌడ్, బుక్కా సురేష్, భాస్కర గంగా పుత్ర, అశోక్, సందీప్, భాస్కర్, షాగా శ్రీధర్, సచిన్, కాషమల్ల శంకర్, శోభ, అంబిక, గాయత్రి, చింటు, నాగమల్లయ, కే స్వామి, జీస్వామి, షకీల్, అలీమ్, లూకాస్, సత్తిరెడ్డి, అరుణ్ సాయి, ఎస్ జంగయ్య, సత్తాన్న, సలీం పాల్గొన్నారు.

నూతన పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కొండాపూర్ డివిజన్ పరిధిలోని గచ్చిబౌలిలో ప్రభుత్వ ప్రైమరీ, హై స్కూల్ ఆవరణలో సీయస్ఆర్ నిధులు ద్వారా, 2 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో నూతన పాఠశాల భవన నిర్మాణం కొరకు ఈ రోజు జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ స్థానిక నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ హమీద్ పటేల్, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు ఎర్రగుంఢ్ల శ్రీనివాస్ యాదవ్, నీరుడి గణేష్ ముదిరాజ్, శ్రీనివాస్ చౌదరి, మంగళరాపు తిరుపతి పటేల్, నరసింహ సాగర్, బసవరాజు, లక్ష్మి బాయి, బుడుగు తిరుపతి రెడ్డి, తిరుపతి యాదవ్, స్వామి సాగర్, వెంకటి, షణ్ముఖ్, అధికారులు, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లెడ్ అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల టెండర్లలో అవకతవకలు..

విశాలాంధ్ర-బషీర్ బాగ్: హైదరాబాదులోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ పరిధిలో లెడ్ అడ్వర్టైజ్మెంట్ బోర్డుల ఏర్పాటు కొరకు పిలిచిన టెండర్లలో అవకతవకలు జరిగాయని సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు ఆరోపించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ కె.వి. గౌడ్, పార్టీ అధికార ప్రతినిధి కొండల గౌడ్, ఉపాధ్యక్షులు చెన్న శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శి బాలస్వామి, మహిళా విభాగం అధ్యక్షురాలు గౌలికార్ సోనీ, న్యాయ విభాగం ఇంచార్జ్ హరి కోయిల్ కార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు చామకూర రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి 100 కోట్లు నష్టం వచ్చే విధంగా ప్రైవేట్ సంస్థకు లాభం కల్పించేలా నోటిఫైడ్ ఏరియా కమిటీ అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. అనేక ఆరోపణలు, కోర్టు వివాదాల్లో ఉన్న నవనిర్మాణ్ అసోసియేట్స్ సంస్థకు తక్కువ ధరకు టెండర్ అలాట్ చేశారని అన్నారు. టెండర్ ప్రక్రియలో జతపరచిన డాక్యుమెంట్లలో అనేక అంశాలపై నవనిర్మాణ అసోసియేట్స్ సంస్థ తప్పుదారి పట్టించే డాక్యుమెంట్లు సబ్మిట్ చేశారని విమర్శించారు. 10,12 కోట్లు రూపాయలు చెల్లిస్తామన్న సంస్థలను కాదని 63 లక్షలు 56 లక్షలు కోట్ చేసిన సంస్థలను అర్హత గల సంస్థలుగా ప్రకటించారని ఆరోపించారు. తక్షణమే లెడ్ అడ్వర్టైజింగ్ ప్రదర్శన నిలిపివేసి టెండర్ అలాట్మెంట్‌పై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

మున్సిపల్ అధికారుల పేరిట వసూళ్లకు పాల్పడుతున్న ముగ్గురు అరెస్టు...

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గురువారం ఉదయం ఓ ఫర్నిచర్ షోరూం వద్దకు వెళ్ళి తాము జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం నుండి వచ్చామని పరిచయం చేసుకున్నారు. అనంతరం మీ ట్రేడ్ లైసెన్స్, షోరూం పర్మిషన్ చూపించాలని అదే విధంగా షోరుం ముందు ఏర్పాటు చేసిన సైన్ బోర్డు అనుమతి కావాలని దబాయించారు. లేదంటే జరిమానా కట్టాలని హడావుడి చేయాడంతో అనుమానం వచ్చిన షోరూం నిర్వహకులు స్థానిక కార్పొరేషన్ డివిజన్ అధికారికి విషయం చెప్పగా అతను వచ్చి వీళ్ళకు మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధం లేదని చెప్పగా వెంటనే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు వీళ్ళు గతంలోనూ ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు తెలిపారు.

పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : పచ్చదనం పరిశుభ్రత పర్యావరణ రక్షణలో ప్రతి పౌరుడు క్రియాశీలక భాగస్వామ్యం పొందాలని పద్మశ్రీ 'వనజీవి దరిపెల్లి రామయ్య ఆశించిన పర్యావరణ రక్షణకు కృషి చేస్తే పచ్చదనమే మనల్ని కాపాడుతుందనే నేషనల్ ప్రెసిడెంట్ అఖిల భారత బిఎస్ఎన్ఎల్ ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి కొల్లూరి అనిల్ కుమార్ అన్నారు. వనజీవి కుమ్మరి జాతి రత్నం పద్మశ్రీ వనజీవి రామయ్య దశదినకర్మ సందర్భంగా రామయ్య ఆశయమైన వృక్షో రక్షితిః రక్షితః అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని గురువారం తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ కుమ్మర సంఘం విభాగం అధ్యక్షులు కాకుళారం కృష్ణ నిర్వహణలో లక్ష్మి నగర్ అత్తాపూర్ జిహెచ్ఎంసి పార్క్ ఆవరణలో మొక్కలను నాటడం జరిగింది. అత్తాపూర్ యోగ సెంటర్ గురువు బి సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ మొక్కల్ని కాపాడండి అవి మనల్ని బతికిస్తాయన్న రామయ్య వాక్యాన్ని స్ఫూర్తిగా తీసుకొని చెట్ల పెంపకంలో పౌర సమాజం భాగస్వాములు కావాలన్నారు. యోగా సెంటర్ 'ఏ బి 'సి' లాఫింగ్ క్లబ్‌కో కన్వీనర్ మహేందర్ మాట్లాడుతూ వర్షాలు కురవాలంటే పవనాలు రావాలంటే చెట్లే శరణ్యం అన్నారు. తెలంగాణ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు నేదునూరి కనకయ్య మాట్లాడుతూ రామయ్య జీవితాంతం పర్యావరణ రక్షణలో సమరం సాగించాడని యువత వారి ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళి అన్నారు. రాష్ట్ర వినియోదారుల కౌన్సిల్ ఉపాధ్యక్షులు అత్తపూర్ యోగా సెంటర్ మహిళా విభాగం కన్వీనర్ ఎం ప్రభాకర్ గాయత్రి సుధాకర్ మాట్లాడుతూ తరుగుతున్న అడవులు పర్యావరణ పరంగా వస్తున్న విపత్తులను ఎదుర్కోవాలి అంటే ప్రకృతి పర్యావరణ రక్షణలో సమాజం సంపూర్ణ భాగస్వాములు కావాలి అన్నారు.

యుపిఎస్సిలో ప్రతిభ కనబర్చిన అర్చితను సన్మానించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణానికి చెందిన హర్షిత అనే యువతీ యుపిఎస్సి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 739 ర్యాంకు సాధించడం జరిగింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అర్చిత స్వగృహానికి చేరుకొని అర్చిత ను సన్మానించారు. దేశంలోనే ఉన్నతమైన పరీక్షలో అత్యున్నత ప్రతిభను కనబరిచిన అర్చితకు శు భాకాంక్షలు తెలిపారు. యువత ప్రతి ఒక్కరూ అర్చిత ను ఆదర్శంగా తీసుకొని కన్న తల్లిదండ్రులకు పుట్టిన వారికి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణలో భాగంగా గేట్‌ను ప్రారంభించిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్ కాలనీలో గల కుమ్మరి కుంట చెరువు సుందరికరణలో భాగంగా ప్రశాంత్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్‌ను ముఖ్య అతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత్ హిల్స్ కాలనీ వాసుల కృషి అభినందనీయం అని, కాలనీ వాసులు సమిష్టి కృషితో చెరువును పరిశుభ్రంగా ఉంచుకోవడం, గేట్‌ను ఏర్పాటు చేసుకోవడం గొప్ప విషయం అని, చెరువులో చెత్త చెదరాం వేయకుండా చుట్టూ ఫెన్సింగ్ వేయడం జరిగినది అని తెలియచేసారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 64 చెరువు లను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, చెరువుల సుందరికరణతో స్వచ్ఛమైన వర్షపు జల సిరులను ఒడిసి పడదామని, చెరువుల జలకళతో గ్రామీణ వాతావరణం నెలకొల్పడమే నా ధ్యేయంగా పనిచేస్తానని, చెరువులను కాపాడితే అవి మనల్ని కాపాడుతాయి, జీవ వైవిధ్యం పెరుగుతుంది, పక్షులు వలసలు మొదలు అవుతాయి అని, చెరువుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, చెరువులను దత్తత తీసుకొని అభివృద్ధి చేసే వారు కనబడే దేవుళ్ళతో సమానమని తెలియచేశారు. కుమ్మరి చెరువు దశ దిశ మారుస్తామని, అదేవిధంగా చెరువు సుందరికరణలో భాగంగా చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్దరణ, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగునీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం, పునరుద్దరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం, చెరువు అలుగు నిర్మాణం, చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నాం అని, చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు. అదేవిధంగా ప్రణాళికతో పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జగదీష్, శేఖర్ రెడ్డి, ప్రభాకర్, రాజు, పద్మ, అమర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ప్రిజర్వేషన్ కోసం అల్లోగ్రాఫ్ట్ టెండన్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆధునిక ఆర్థోపెడిక్ చికిత్సలో అపూర్వమైన ముందడుగుగా, అపోలో జూబ్లీహిల్స్‌లో తెలంగాణలోనే తొలి అల్లోగ్రాఫ్ట్ టెండన్ (ఆకిలీస్ టెండన్) ఆధారిత లోయర్ ట్రాపీజియస్ ట్రాన్స్ఫర్ విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ షోల్డర్ సర్జన్ డా. ప్రశాంత్ మేశ్రం ఈ సంక్లిష్ట శస్త్రచికిత్సను నిర్వహించారు. ఇటువంటి చికిత్స అపోలో గ్రూప్ ఆసుపత్రుల్లో తొలిసారిగా జాయింట్ ప్రిజర్వేషన్ కోసం అల్లోగ్రాఫ్ట్ టెండన్ను ఉపయోగించి చేయడం విశేషం. వివరాల్లోకి వెళితే 55 ఏళ్ల శక్తివంతమైన వ్యక్తి ఈ శస్త్రచికిత్సకు అర్హులయ్యారు. అతి సంక్లిష్టమైన ఈ ఆర్థోస్కోపిక్-అసిస్టెడ్ లోయర్ ట్రాపీజియస్ ట్రాన్స్ఫర్ శస్త్రచికిత్సలో ఆకిలీస్ టెండన్ అల్లోగ్రాఫ్ను నిష్ణాతంగా ఉపయోగించారు. బైసెప్స్ టెండన్ రీ-రూటింగ్, సబ్స్కాపులారిస్ టెండన్ మరమ్మతులతో కూడిన ఈ చికిత్స ద్వారా భుజం ఫంక్షన్ను పునరుద్ధరించి, ఆర్థరైటిస్ను నివారించే ప్రయత్నం జరిగింది. ఆపరేషన్ తర్వాత చేసిన స్కాన్లో శోల్డర్ జాయింట్లో మారిన హెడ్ పొజిషన్ తిరిగి సరిచేయబడినట్లు వెల్లడైంది. ఈ శస్త్రచికిత్స విజయవంతం కావడంలో అనస్తీషియా నిపుణులు, సర్జికల్ సాంకేతిక నిపుణులు, నర్సులు, ఓపరేటింగ్ రూమ్ సిబ్బంది కీలక పాత్ర పోషించారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : గురువారం నాడు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పహల్గమ్ ఘటనలో మరణించిన వారికి నివాళు లు అర్పిస్తూ, వారి మరణానికి కారణమయిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని, ఉగ్రవా దుల దిష్టిబొమ్మని హిమాయత్ నగర్ వై జంక్షన్ వద్ద దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిని ఖండించారు. ఈ ఘటన అత్యంత విషాదకరమనీ, ఉగ్రవాదాన్ని అంతం చేయాలంటే, ఉగ్ర మూకలను కఠినంగా శిక్షించాలన్నారు. దేశ సమగ్రతను సమైక్యతను పరిరక్షించడానికి కేంద్ర ప్రభుత్వం కాశ్మీర్ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఉగ్ర మూకాలు కాశ్మీర్ ప్రాంతంలో ఎక్కడ దాగి ఉన్న వెంటాడి శిక్షించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ఉగ్రవాదులకు, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌కు గట్టి బుద్ధి చెప్పాలని వారన్నారు. కేంద్ర ప్రభుత్వం, జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం సమన్వయంతో ఉగ్రవాదులను ఏరివేత చేపట్టాలని, భవిష్యత్తులో దేశంలో ఎక్కడ ఉగ్ర దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు దేశ యువత నడుము బిగించాలన్నారు. మరణించిన కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామిడి వంశీవర్ధన్ రెడ్డి, ఎండి అన్వర్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్, రాష్ట్ర నాయకులు అరుణ్, హరీష్, జ్ఞానేశ్వర్, అశ్విన్, వెంకటేష్, ఉదయ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

విశాలాంధ్ర - అమనగల్లు : స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతగా నిర్వహించడంలో స్థానిక సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రామ సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్యానికి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక పెద్ద అడుగని, ఇది స్థానిక సమూహాలు, తమ సంఘాల గురించి నిర్ణయాలు తీసుకోవడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రజాస్వామ్యాన్ని మరింత చురుగ్గా చేస్తుంది పేర్కొన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించుకోవడానికి గ్రామసభలు వేదికలని అన్నారు. 72వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పొందుపరిచిన హక్కులు స్థానిక సంస్థలకు కల్పించాలని కోరారు. ప్రత్యేక పాలనలో గ్రామాలలో సమస్యలను పరిష్కరిస్తున్న అమనగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి లాలయ్య, కార్యదర్శి అల్లాజి, ఎన్ఐఆర్‌డీపీఆర్ ప్రతినిధి నిధిసింగ్‌లను జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు భిక్షపతి, దోనాదుల మహేష్, మాజీ కో ఆప్షన్ సభ్యులు వెంకటయ్య గౌడ్ నాయకులు ఛందోజి, రమేష్, రవి, శ్రీశైలం ఆశా వర్కర్లు, అంగన్వాడీలు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ జాతిపిత కాదు : పిడమర్తి రవి

విశాలాంధ్ర- బషీర్ బాగ్: బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ జాతిపిత కాదని ఆయన జ్యూస్ పితా అని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం దొంగ ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ కోరుకున్న ప్రజలందరినీ మోసం చేసి దీక్ష విరమింప చేసి జూసు తాగి దొంగ దీక్ష చేసిన కేసీఆర్ జాతిపిత కాదు అని జ్యూస్ పితా అని అన్నారు. ఆనాడు ఉద్యమ సమయంలో కెసిఆర్ నేను నా భార్య తప్ప నాకు ఎవరూ లేరు నా కొడుకు కూతురు విదేశాల్లో ఉన్నారనీ తెలిపారన్నారు. ఈ తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారుల కోసమే అని చెప్పి ఎంతోమంది ఉద్యమకారులను మోసం చేశారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు ఇన్నయ్య, ఆలే నరేందర్, ప్రొఫెసర్ జయశంకర్, జిట్టా బాలకృష్ణారెడ్డి, కేకే మహేందర్ రెడ్డి, విజయశాంతి, ఈటెల రాజేందర్, ఇలా అనేకమంది ఉద్యమకారులను మోసం చేసిన కల్వకుంట్ల కుటుంబం ఉద్యమకారుల పార్టీ అని అనడానికి అర్హత లేదని అన్నారు. టిఆర్ఎస్ పార్టీలో వలస వచ్చిన కార్పోరేట్ శక్తులు తప్ప తెలంగాణ ఉద్యమకారులు ఎవరూ లేరని ఉద్యమ స్ఫూర్తితో నిర్మాణమైన పార్టీ అని చెప్పుకోవడానికి కేసీఆర్ కుటుంబానికి సిగ్గు లేదని అన్నారు. కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఆయన పాత్ర శూన్యమని ఆయన విదేశాల్లో ఉన్నారని కేవలం రాష్ట్రం వచ్చే ముందు వచ్చి తెలంగాణ ఉద్యమకారుల వలె కలరింగ్ ఇచ్చుకుంటున్నారని అన్నారు. కల్వకుంట్ల కవిత బంతిపూలతో ఉద్యమం చేస్తే తెలంగాణ రాష్ట్రం రాలేదని తెలంగాణ రాష్ట్రం తెచ్చింది సబ్బండ వర్గాలు మాత్రమేనని అందులో కలవకుండా కుటుంబం పాత్ర ఏమీ లేదని కెసిఆర్ సైతం తను నిర్మించుకున్న ఫామ్ హౌస్‌లో పడుకొని ఉద్యమకారులను ఫామ్ హౌస్ కు రప్పించుకొని కూసోని గుర్రాళ్ళు అల్లిచింద్రు అని అన్నారు. టిఆర్ఎస్ పార్టీలో కేసీఆర్ బానిసలే ఉన్నారని కేసిఆర్‌కు మందు పోసే వల్లే కేసీఆర్ మనోని స్కూలుకు పంపేతుళ్ళు కేసిఆర్ చెప్పులు పాలిష్ చేసేటోళ్లు కేసిఆర్ గేటు కాడ కాపలా కాసేతుల్లో మాత్రమే ఆ పార్టీలో ఉన్నారని వాళ్లకే ఎమ్మెల్యే ఎంపీ టికెట్స్ కేసిఆర్ ఇస్తాడని తెలంగాణ ఉద్యమకారులు ఎవరు ఆ పార్టీలో లేరని కేవలం డబ్బు సంపాదించాలని అత్యాశపరులు మాత్రమే ఆ పార్టీలో ఉన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఎవరు వజ్రోత్సవ సభకు వెళ్లొద్దని అన్నారు. భారతదేశంలో సిద్ధాంతం లేని ఏకైక ప్రాంతీయ పార్టీ టిఆర్ఎస్ పార్టీ మాత్రమేనని అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా డాక్టర్ బొమ్మెర స్టాలిన్ నియమించారు. అనంతరం స్టాలిన్ మాట్లాడుతూ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250

నాచారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కాప్రా : తెలంగాణ రాష్ట్రంలో ఉప్పల్ నియోజకవర్గంని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నాచారం డివిజన్ పరిధిలోని 70 లక్షలు వ్యయంతో అభివృద్ధి పనులను డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్‌తో కలిసి నాచారం ఓల్డ్ విలేజ్‌లో 50 లక్షల రూపాయలతో మిగిలిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు, రవీంద్ర నగర్ సాయిబాబా గుడి కమాన్ నుండి ఎల్ఐసి వారి బిల్డింగ్ వరకు 20 లక్షలతో కొత్త సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగాతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-దుండిగల్: అనారోగ్యం బారిన పడిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు అన్నారు. గురువారం నియోజకవర్గం పరిధి చింతల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన దాదాపు 60 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన 21.41 లక్షల రూపాయల విలువగల చెక్కులను కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ప్రజా ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకురాలు లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు సీఎం సహాయనిధి ఒక వరమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధిని వినియోగించు కోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు గౌరిష్, జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, రఫీ, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు ఎత్తరి మారయ్య, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజ్, గుమ్మడి మధుసూదన్ రాజు, గుబ్బల లక్ష్మీనారాయణ, అడ్వకేట్ కమలాకర్, సిద్దిక్, కుంట సిద్దిరాములు, నదీం రాయ్, తెలంగాణ సాయి, ఖాన్, నవాబ్ భాయ్, కూన వెంకటేష్ గౌడ్, సుధాకర్ గౌడ్, యేసు, ఇస్మాయిల్, చెట్ల వెంకటేష్, బస్వరాజ్, సదానంద్ చారి, మధు, నార్లకంటి బాలయ్య, ఆంజనేయులు, వెంకటేష్, ప్రసాద్, రంజాన్, మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : బి.సి రిజర్వేషన్ 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలి లేకపోతే యుద్ధమే జరుగుతుందనీ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుపుతామని ప్రకటించారని, బీసీ రిజర్వేషన్లు విషయాన్ని ప్రస్తావించలేదన్నారు. వాస్తవంగా దాదాపు 12 నెలల క్రితం జరగవలసిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్ గురించి వాయిదా మీద వాయిదా పడుతూ జాప్యం జరుగుతుందన్నారు. ఒక వేళ ప్రభుత్వం రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్ళితే రాష్ట్రంలో యుద్ధమే జరుగుతుందన్నారు. పెంచవల్సిన భాధ్యత ప్రభుత్వంపై ఉందని, పెంచకపోతే రాష్ట్రంలో 1000 మందితో ఆమరణ నిరాహార దీక్షా జరుపుతామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేశారని, ఇది ఇంతవరకు ప్రభుత్వ జిఓ జారీ కాలేదన్నారు. అసెంబ్లీ చట్టం చేసిన తర్వాత కేంద్రానికి పంపుతామని ప్రకటనలు వెలువడ్డాయి కానీ ఇంతవరకు దాని ఆతీ-గతి లేదన్నారు. వాస్తవంగా రాజ్యాంగ ప్రకారం స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని, స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. 73-74వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-డి-6 ప్రకారం స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు పంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధమైన అధికారం ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు జి.అంజి, మణికంఠ, రాజు నేత, నరసింహ గౌడ్, రవికుమార్, ఎస్.లక్ష్మీనారాయణ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య



విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: అక్రమ సంబంధానికి అడ్డుగా వస్తున్నాడని భర్తను భార్య హత్య చేసింది. అక్రమ సంబంధం నేపథ్యంలో కేసు నమోదు చేసుకున్న పోలీసులు శంషాబాద్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్, షాద్ నగర్ ఏసిపి రంగస్వామి ఆధ్వర్యంలో పట్టణ సీఐ విజయ్ కుమార్, ఎస్సైలు సుశీల, దేవరాజ్, హెడ్ కానిస్టేబుల్ విజయభాస్కర్, సిబ్బంది నరేందర్, సువర్ణ, కరుణాకర్, రాజేష్‌ల బృందం ఈ కేసులో విచారణ మొదలుపెట్టినట్లు ఏసిపి రంగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలానికి చెందిన ఎరుకలి యాదయ్య మౌనిక అనే దంపతులు కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. యాదయ్య తరచూ మద్యం సేవించి ఇంట్లో గొడవలకు దిగుతుండటంతో, గ్రామ సమీపంలో ఉండే ఒక పత్తి మిల్లులో పనిచేసే మౌనిక అదే మిల్లులో మెస్ కోసం కూరగాయలు సప్లై చేసే అశోక్ అనే వ్యక్తితో అక్రమ సంబంధాన్ని ఏర్పరచుకుంది. ఈ క్రమంలో తమ అక్రమ సంబంధం బయట పడవచ్చు అని భయంతో భర్తను హతమార్చాలని ప్రణాళిక రచించారు. ఫిబ్రవరి 18వ తేదీన తమ బంధువుల ఇంట్లో దావత్ ఉందంటూ తీసుకెళ్లి కొత్తూరు మండలం గూడూరు గ్రామ సమీపంలోని గుట్టల వద్దకు వెళ్లిన తర్వాత ముగ్గురు కలిసి మద్యం సేవించారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న యాదయ్యను అశోక్, మౌనిక గొంతు కోసి చంపేశారు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించి అటు నుండి వెళ్లిపోయారు. భర్త అశోక్ జాడ తెలియడం లేదంటూ తానే స్వయంగా పోలీసులకు చేసింది. పలు విధాలుగా దర్యాప్తు చేసిన పోలీసులు మౌనిక, అశోక్ నిందితులని తేలడంతో అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో చకాచక్యంగా పనిచేసిన సీఐ విజయకుమార్, ఎస్సై సుశీల, దేవరాజ్, హెడ్ కానిస్టేబుల్ విజయభాస్కర్, పోలీస్ సిబ్బంది లకు తగిన రివార్డులను ఇప్పించేందుకు పై అధికారులకు నివేదిక పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి భద్రతా వైఫల్యమే

- లోతైన పరిశీలన అవసరం
- బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం
- అమర్‌నాథ్ యాత్రను తేలిగ్గా తీసుకోవద్దు
- రాజకీయాలకు సమయం కాదని బీజేపీకి హెచ్చరిక
- సీడబ్ల్యూసీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల మారణకాండను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపింది. గురువారం న్యూఢిల్లీ అక్బర్ రోడ్డులోని ఏఐసీసీ కార్యాలయంలో సీడబ్ల్యూసీ సభ్యులు సమావేశమై... ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ దుఃఖ సమయంలో పూర్తిగా వారికి మద్దతుగా నిలబడతామని సీడబ్ల్యూసీ ప్రకటించింది. ఈ దాడి పాకిస్థాన్ మద్దతుతో సుదీర్ఘంగా పన్నిన కుట్రగా సీడబ్ల్యూసీ పేర్కొంది. ఇది భారత ప్రజాస్వామ్య విలువలపై నేరుగా దాడి అని అభిప్రాయపడింది. అయితే కేంద్రపాలిత ప్రాంతాల్ని కేంద్ర హోం శాఖ పర్యవేక్షిస్తోందని... అలాంటి చోట ఈ దాడి జరగడం పట్ల సీడబ్ల్యూసీ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఈ అంశంపై లోతైన పరిశీలన జరగాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. ఇది కేంద్ర వైఫల్యమని స్పష్టం చేసింది. ఈ ఉగ్రదాడిలో పర్యాటకులను కాపాడే ప్రయత్నంలో భాగంగా ప్రాణత్యాగం చేసిన స్థానికుడి పోరాటాన్ని గుర్తు చేసుకొంది. ప్రధాని అధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. మరికొద్ది రోజుల్లో అమరనాథ్ యత్ర ప్రారంభం కానుందని గుర్తు చేసింది. ఈ యాత్రకు భద్రత దృష్ట్యా అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రాన్ని సూచించింది. అందుకు సంబంధించిన భద్రత ఏర్పాట్లు పారదర్శకంగా.. సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. పర్యాటకంపై ఆధారపడి జీవించే స్థానిక ప్రజల జీవనోపాధిని పరిరక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషాదకర ఘటనను బీజేపీ రాజకీయ లబ్ధికి ఉపయోగించుకుంటోందంటూ సీడబ్ల్యూసీ కీలక ఆరోపణ చేసింది. దేశాన్ని ఏకతాటిపై నడపాల్సిన ఈ సమయంలో విభేదాలు రేకెత్తించే విధంగా రెచ్చగొట్టడం తగదని బీజేపీ నేతలకు సిడబ్ల్యూసీ సభ్యులు హితవు పలికారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ సీడబ్ల్యూసీ తీర్మానం ఆమోదించింది. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, ఎంపీలు పాల్గొన్నారు. ఈ మేరకు సీడబ్ల్యూసీ వివరాలను ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వివరించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 25న దేశవ్యాప్తంగా కొవ్వత్తులతో ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. 'కాంగ్రెస్ డిమాండ్‌ను అంగీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ అంశం తీవ్రత దృష్ట్యా దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా హాజరు కావాలని ఆశిస్తున్నాం. ఇది నేరుగా మన ఐక్యత, భద్రతపై దాడిగా భావించాలి. ఈ క్రమంలోనే దాడిపై అన్ని కోణాలపైనా సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించాం' అని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా పేర్కొన్నారు.

జూన్ 1న కానిస్టేబుల్ మెయిన్స్ రాత పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కానిస్టేబుల్ అభ్యర్థులకు ఏపీ పోలీస్ నియామక మండలి(ఎస్ఎల్‌పీఆర్‌బీ ఏపీ) శుభవార్త చెప్పింది. జూన్ ఒకటిన మెయిన్స్ రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. దేహదారుఢ్య పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 38,910 మంది రాత పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపింది. వీరందరికి కాకినాడ, విశాఖ, గుంటూరు, తిరుపతి, కర్నూలు జిల్లా కేంద్రాల్లో పరీక్ష ఉంటుందని పేర్కొంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు పరీక్ష నిర్వహిస్తారు. పోలీస్ కానిస్టేబుల్ (సివిల్-మెన్, ఉమెన్) పోలీస్ కానిస్టేబుల్ (ఏపీఎస్‌పీ-మెన్) పోస్టుల భర్తీకిగాను గత ప్రభుత్వ హయాంలో 28 నవంబరు, 2022న నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రిలిమినరీ పరీక్షను జనవరి 22, 2023న నిర్వహించారు. మొత్తం 4,59,182 మంది హాజరు కాగా, 95,208 మంది అర్హత సాధించారు. వారికి 30వ తేదీ డిసెంబరు 2024 నుంచి జిల్లా కేంద్రాల్లో దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించగా...మెయిన్ రాత పరీక్షకు 38,910 మంది అర్హత సాధించారు.

సీపీఐ సీనియర్ నేత వెంపటి సూర్యనారాయణ కన్నుమూత

నారాయణ సంతాపం

విశాలాంధ్ర - కొత్తగూడెం: సీపీఐ సీనియర్ నాయకుడు, పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యవర్గసభ్యుడు వెంపటి సూర్యనారాయణ (85) పాల్వంచలోని ఆయన కుమార్తె నివాసంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. వెంపటి భౌతికకాయాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి పూర్ణచందర్ రావు, పట్టణ సహాయ కార్యదర్శి ఉప్పుశెట్టి రాహుల్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఎర్ర జెండాకప్పి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. సాబీర్ మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అనేక భూపోరాటాలు, ప్రజా పోరాటాలకు సూర్యనారాయణ నాయకత్వం హించారని గుర్తుచేశారు. వివిధ మండలాలకు ఇంచార్జిగా వ్యహరించి పార్టీ విస్తరణకు కృషి చేశారని తెలిపారు. కాగా, సూర్యనారాయణ మృతికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. వెంపటి... జీవితాంతం కమ్యూనిస్ట్ ఉద్యమానికి అంకితమై పనిచేశారని కొనియాడారు. నిబద్ధత కలిగిన నాయకుడన్నారు. తనను ఆదరాభిమానించే వెంపటి మరణం బాధాకరమన్నారు.

డీఎస్సీ కోచింగ్ ఉచితం: మంత్రి సవిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీసీ స్టడీ సర్కిల్ ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులందరికీ ఆన్‌లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ అందివ్వనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఇందుకోసం శ్యామ్ ఇన్ స్టిట్యూట్ ఆచార్య యాప్ రూపొందించామని, ఈ యాప్ ద్వారా 24 గంటలపాటు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆన్ లైన్ ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను మంత్రి సవిత ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ... ఎన్నికల ముందు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నెరవేర్చుతూ, 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహణ దస్త్రంపై మొదట సంతకం చేశారన్నారు. డీఎస్సీ ద్వారా అత్యధిక ఉపాధ్యాయ పోస్టులు బీసీ అభ్యర్థులే సాధించాలన్నది లక్ష్యంతో బీసీ సంక్షేమ శాఖ ద్వారా ఉచిత కోచింగ్ సెంటర్లు ప్రారంభించామని వివరించారు. 26జిల్లాల్లోనూ బీసీ స్టడీసర్కిళ్ల ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు నిర్వహించామన్నారు. ఈ కేంద్రాల ద్వారా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందజేశామన్నారు. ఆఫ్ లైన్ లో కోచింగ్ కు పొందలేని గృహిణులు, సుదూర ప్రాంతవాసులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చిన్న ఉద్యోగాలు చేసే వారితో ఆర్థికంగా ఉన్న వెనుకబడిన వారికి లబ్ధికలిగే ఆన్ లైన్ కోచింగ్ ప్రారంభించినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులందరికీ ఉచిత కోచింగ్ అందజేస్తామన్నారు. ప్రస్తుతం 3,189 మంది దరఖాస్తులొచ్చాయని, ఇంకెంతమందైనా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఆన్ లైన్ ద్వారా డీఎస్సీ ఉచిత కోచింగ్ అందజేస్తామన్నారు. కాకినాడకు చెందిన శ్యామ్ ఇన్ స్టిట్యూట్ ద్వారా ఆన్ లైన్ డీస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం శ్యామ్ ఇన్ స్టిట్యూట్ ఆచార్య పేరుతో యాప్ రూపొందించారన్నారు. ఈ 24 గంటలూ పనిచేయడంతో పాటు అభ్యర్థులు రోజులు ఎన్ని పర్యాయాలైనా యాప్‌ను ఓపెన్ చేసేలా రూపొందించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, జేడీ తునాజరాణి, శ్యామ్ ఇన్ స్టిట్యూట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుత మీనన్ భూ సంస్కరణలు ఆదర్శనీయం

సీపీఐ ఏపీ, తెలంగాణ నేతలు

విశాలాంధ్ర బ్యూరో-తిరువనంతపురం: మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, కేరళ కమ్యూనిస్ట్ పార్టీ నిర్మాత సి.అచ్యుత మీనన్ జీవితాంతం ఆదర్శంగా ఉంటూ... ముఖ్యమంత్రిగా అనేక భూ సంస్కరణలు అమలు చేశారని సీపీఐ ఏపీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సీపీఐ జాతీయ సమితి సమావేశాలు సందర్భంగా పార్టీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం... పార్టీ నిర్మాత సి.అచ్యుత మీనన్ విగ్రహానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జాతీయ సమితి సభ్యులతోపాటు కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ నివాళులర్పించారు. అచ్యుత మీనన్ స్ఫూర్తితో పార్టీ శ్రేణులు ముందుకు నడవాలన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, చాడ వెంకటరెడ్డి, తెలంగాణ సభ్యులు భాగం హేమంత్ రావు, పల్లా వెంకటరెడ్డి, కె.శ్రీనువాస్‌రెడ్డి, టి.శ్రీనివాస్, బాలనర్సింహ, శంకర్, యూషఫ్, ఏపీ సీపీఐ సభ్యులు తాటిపాక మధు, కె.శివా రెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రవాదం నశించాలి

పెల్లుబికిన ప్రజాగ్రహం

పర్యాటకులపై ఉగ్రదాడి హేయం

దేహం ముక్కలైనా దేశాన్ని కాపాడుకుంటాం

నిరసన ప్రదర్శనలో సీపీఐ

విశాలాంధ్ర-విజయవాడ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులను పొట్టనపెట్టుకున్న ఉగ్రదాడిపై ప్రజాగ్రహం పెల్లుబిగింది. తీవ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసేందుకు కేంద్ర పాలకులు ధీటైన చర్యలు చేపట్టి దేశాన్ని కాపాడాలని కోరారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సీపీఐ నగర సమితి అధ్వర్యంలో గురువారం సాయంత్రం లెనిన్‌సెంటర్ లో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎర్రజెండాలు, ప్లకార్డులు చేత బూని ఉగ్రవాదం నశించాలి...ప్రపంచ శాంతి వర్ధిల్లాలి... పాకిస్థాన్ తీవ్రాదం నశించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వర్వయ్య మాట్లాడుతూ ఆహ్లాదకరమైన ప్రదేశంలో సేదతీరుతున్న అమాయక ప్రజలపై తీవ్రాదుల దాడి అమానుషమని మండిపడ్డారు. మాటలతో కాకుండా తీవ్రమైన చర్యలతో ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అణిచివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తీవ్రవాదుల దాడిలో చనిపోయిన 26 మందిలో 15 మంది ముస్లింలే ఉన్నారని, ఈ దాడి ఒక మతంపై జరిగిన దాడి కాదన్నారు. దేశ భద్రత కోసం దేహం ముక్కలైనా దేశాన్ని ముక్కలు కానివ్వబోమని, కమ్యూనిస్టువాదులుగా దేశ ఔన్నత్యాన్ని కాపాడుకుంటామని పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ సామాన్య ప్రజలను తీవ్రాదులు పొట్టనపెట్టుకోవడం హేయమన్నారు. విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ దేశ భద్రతకు పెనుసవాలుగా మారిన తీవ్రవాదాన్ని అంతమొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, కె.వి. భాస్కరరావు, తాడి పైడయ్య, పంచదర్ల దుర్గాంబ, కోట్టు రమణారావు, కార్యవర్గ నాయకులు డి.వి. రమణబాబు, సంగుల పేరయ్య, తూకం వీరయ్య, కొడాలి ఆనందరావు, ఓర్సు భారతి, దోనేపూడి సూరిబాబు, కంచర్ల నాగేశ్వరరావు, సింగంరాజు సాంబశివరావు, బుద్దె రాజా, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఎం. సాయికుమార్, డివిజన్ నాయకులు పడాల కనకరావు, రొండపల్లి కృష్ణ, కరోది వెంకటేశ్వరరావు, పి.రాము, చిన్నప్ప, చింతడ పార్వతి, విజయ్, కోండేటి శ్రీనివాసరావు, దుర్గసి రమణమ్మ, ఎస్‌కె నజీర్, ప్రతిపాటి రాజు, కాకర్లపూడి విజయ్, మురిగేషన్ రాము నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ కొవ్వొత్తుల ప్రదర్శన

ఉగ్రవాదుల నరమేథంపై టీడీపీ నేతల అధ్వర్యంలో ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద గురువారం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్ర మూకల్ని మట్టిలో కలపాలని అన్నారు. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌ను ప్రపంచం వెలివేయాలని తెలిపారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ... మీరు ఎవరు, ఏ దేశస్థులు అని అడిగి మరీ చంపడం చాలా దుర్మార్గమన్నారు.

సానుకూలంగా ముందుకెళితే విజేతలవుతారు

'మైండ్‌సెట్ షిఫ్ట్' పుస్తకావిష్కరణలో చంద్రబాబు, చిరంజీవి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అవసరమైన సమయంలో ఆలోచనా దృక్పథాన్ని మార్చుకుంటూ ముందుకు వెళ్లిన వారే రాణిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మెగాస్టార్ చిరంజీవి అన్నారు. మంత్రి నారాయణ కుమార్తె శరణి పొంగూరు రచించిన 'మైండ్ సెట్ షిఫ్ట్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ రచన యువతకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విజయవాడలో గురువారం జరిగిన పుస్తకావిష్కరణ సందర్భంగా తమ తమ రంగాల్లో ఎదరైన సవాళ్లు, అనుభవాలను చంద్రబాబు, చిరంజీవి పంచుకున్నారు. సానుకూలమైన ఆలోచనలు, సంకల్పం, పట్టుదల, కృషి ఉంటే అనుకున్నది సాధించవచ్చన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించిన మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 'ఎంఏ చేసిన తర్వాత అధ్యాపకుడు అవుతారా అంటే ఎమ్మెల్యే అవుతానని చెప్పాను. పోటీ చేసి గెలిచాను. ఆ తర్వాత మంత్రి పదవి కోసం ప్రయత్నించాను. యూనివర్సిటీ నుంచి బయటకు వచ్చి ఎన్నో రోజులు కాలేదు... కొత్తగా ఎమ్మెల్యే అయ్యావు. అప్పుడే మంత్రి ఏమిటని అప్పటి ముఖ్యమంత్రి చెన్నారెడ్డి అడిగారు. అర్హత ఉంటేనే పదవి ఇవ్వమన్నాను. రెండేళ్లకే మంత్రి అయ్యాను' అని చంద్రబాబు చెప్పారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా సినిమా వాళ్లతో పరిచయాలు ఏర్పడ్డాయని, ఆ సమయంలోనే ఎన్‌టీఆర్‌ను కలిశానని, ఆయన కోరిక మేరకు తన వివాహం జరిగిందని సీఎం వెల్లడించారు. దేశంలో ఏ రాజకీయ నాయకుడు ఎదుర్కోని సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఎన్‌టీఆర్ కూడా సాధారణ కుటుంబంలో జన్మించారని, పట్టుదలతో సినీ రంగంలో ఆ తర్వాత రాజకీయ రంగంలో రాణించారని చంద్రబాబు అన్నారు. చిరంజీవి మాట్లాడుతూ జీవితం ఎవరికీ పూలపాన్పు కాదని, సవాళ్లు అధిగమిస్తూ ముందుకు సాగాలన్నారు. ఎంతో మందికి ఉపయోగపడే మంచి పుస్తకాన్ని రచించారని శరణిని అభినందించారు. తొలినాళ్లలో హీరో పాత్రలు చేసే తనను కొందరు చిన్న రౌడీ పాత్రలు ఇచ్చినా కాదనలేదని చెప్పారు. ప్రేక్షకుల ఆదరణ తనను ఈ స్థాయికి చేర్చిందని, వారికి ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. సభలో పహల్గాం ఉగ్రదాడి మృతులకు సంతాప సూచికంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. మంత్రి నారాయణ, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి బలైన మధుసూదన్‌కు పవన్ నివాళి

విశాలాంధ్ర-కావలి: జమ్మూకశ్మీర్, పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సోమిశెట్టి మధుసూదన్ భౌతికకాయానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా నివాళు లర్పించారు. మధుసూదన్ అంతిమ యాత్రలో నాదెండ్ల మనోహర్, సత్యకుమార్, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి గారు, కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. మధుసూదన్ అంత్యక్రియలు గురువారం ముగిశాయి. ఆయన భౌతికకాయాన్ని కాశ్మీర్ నుంచి విమానంలో చెన్నై విమానాశ్రయానికి, ఆపై రోడ్డు మార్గంలో అంబులెన్స్‌లో కావలిలోని ఇంటికి తరలించారు. మధుసూదన్ అంతిమ యాత్ర కావలిలోని ఆనాలవీధిలోని నివాసం నుంచి నాలుగు కిలో మీటర్లు దూరంలో ఉన్న బుడంగుంట స్మశానవాటిక వరకు జరిగింది.

ఉగ్రవాదుల్ని ఏరివేయాలి: పవన్

పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడిని పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. ఈ పైశాచికత్వాన్ని దేశం మరువదన్నారు. ఉగ్రవాదుల్ని ఏరివేయాలని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మధుసూదన్ కుటుంబ సభ్యుల ఆవేదన వింటే మనసు వికలమైందని విలేకరులతో పవన్ అన్నారు. ఓదార్చేందుకు మాటలు రాలేదని చెప్పారు. ఉగ్ర దాడిలో చనిపోయిన చంద్రమౌళి కుటుంబాన్ని విశాఖపట్నం వెళ్లి పరామర్శించిన తర్వాత మంగళగిరిలో విలేకరుల సమావేశం నిర్వహించి అన్ని వివరాలు తెలుపుతానని పవన్ కల్యాణ్ అన్నారు. కశ్మీర్ పరిస్థితులు తనకు తెలుసని, 1986 నుంచి 1989 వరకు అక్కడ షూటింగ్ శిక్షణ తీసుకున్నట్లు తెలిపారు. కశ్మీర్‌లో పేలే తూటాల ప్రభావం దేశం నలు మూలలా కనబడుతుం దనడానికి పహల్గాం ఉదంతమే నిదర్శనమని పవన్ అన్నారు.

వేతనాలివ్వకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన

ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్చరిక

విశాలాంధ్ర-గుంటూరుకలెక్టరేట్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి ముందుకు నడిపిస్తున్న సిబ్బందికి 12 నెలలుగా వేతనాలు విడుదల చేయకపోవడం వల్ల వారి కుటుంబాలు పూటగడవక పస్తులుంటున్నాయని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే 12 నెలల వేతనాలు విడుదల చేయాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలతో పాటుగా నిరాహార దీక్షలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో గురువారం గుంటూరు గోరంట్ల దగ్గరున్న రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అనంతరం సీఈఓ రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెలుగూరి, రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల మంది ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని, వీరికి 12 నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు విడుదల చేయకపోతే ఆర్‌వైఎస్ఎస్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు దిగుతామని హెచ్చరించారు. మహిళా కార్మికులకు పనిగంటల అమలు, పెన్షన్, పీఎఫ్ఈఎస్ఐ సౌకర్యంతో ఎస్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వరప్రసాద్, రాహేల్ రావు, నాయకులు సీమోను, జేపీ స్వామి, సుధాదేవి, వీర్ల వెంకటేశ్వర్లు, వినయ్ కుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకిటి అరుణ్ కుమార్, హనుమంతరావు, కోట మాల్యాద్రి, అంజిబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రతా దళాల వైఫల్యం వల్లే ఉగ్రదాడి

న్యూఢిల్లీ: పహల్గామ్‌లో ఉగ్రదాడి జరగబోతోందనే సమాచారం మన నిఘా వర్గాలకు కొద్దిరోజుల క్రితమే తెలిసిందా... 'ఒక టెర్రర్ గ్రూప్ స్థానికేతరులపై (కశ్మీర్‌కు వచ్చే పర్యాటకులపై) దాడికి ప్రణాళికలు రచిస్తోంది' అంటూ నిఘావర్గాలు అప్రమత్తం చేశాయా... అయినా భద్రతా సంస్థలు పట్టించుకోకపోవడం వల్లే ఇంతమంది చనిపోయారా అంటే... విశ్వసనీయ వర్గాలు ఈ ప్రశ్నలకు ఔననే సమాధానమే ఇస్తున్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు (పీవోకే) చెందిన ఒక ఉగ్రవాది... ఈ దాడికి సంబంధించి సూచనప్రాయ వ్యాఖ్యలు చేశాడని, తాము ఆ సమాచారాన్ని అందించినా భద్రతా దళాలు వాటిని పట్టించుకోలేదని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఈ దాడికి వ్యూహరచన మొత్తం పీవోకే, పాక్‌కు చెందిన అంతర్జాతీయ హ్యాండ్లర్లు చేశారని... దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులకు రియల్‌టైమ్‌లో ఎప్పుడేం చేయాలో ఆదేశాలు ఇచ్చారని, ఏయే ప్రాంతాల్లో భద్రతా దళాల సంఖ్య తక్కువగా, పర్యాటకుల సంఖ్య ఎక్కువగా ఉంటుందో సమగ్ర సమాచారం అందించారని ఆ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదులకు ఆయుధాల వినియోగంలో సమగ్ర శిక్షణ ఇచ్చారని తెలిపాయి. వారి హెల్మెట్లపై కెమెరాలున్నాయని... దాడి ఘటనలను చిత్రీకరించి, సూత్రధారులకు పంపేందుకే వాటిని వినియోగించారని పేర్కొన్నాయి. అయితే, పహల్గామ్‌లో ఉగ్రదాడి విషయంలో భద్రతా సంస్థల వైఫల్యం నిజమేగానీ... పూర్తిగా విఫలమయ్యాయని చెప్పలేమని కర్నాటకకు చెందిన రక్షణ రంగ వ్యవహారాల విశ్లేషకుడు గిరీశ్ లింగన్న అభిప్రాయపడ్డారు. దాడికి ముందు ఆ పరిసర ప్రాంతాల్లో ఉగ్ర వాదులు రెక్కీ నిర్వహించిన విషయం, వారి అనుమానాస్పద కదలికల గురించి నిఘా వర్గాలకు సమాచారం ఉన్నట్టుగా తెలుస్తోందని... కానీ, ఏ సమయంలో దాడి జరగబోతోంది... ఏ స్థాయిలో జరగబోతోందనే అంశంపై పూర్తి సమాచారం లేనందునే భద్రతా దళాలు స్పందించలేకపోయాయని ఆయన వివరించారు. దాడి జరిగిన వెంటనే మాత్రం భద్రతా దళాలు వేగంగా స్పందించాయని, మన దళాల సన్నద్ధత సామర్థ్యాన్ని ఇది సూచిస్తోందని ఆయన పేర్కొన్నారు.

2030కి 300 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి లక్ష్యం: సందీప్ పౌండ్రిక్

న్యూఢిల్లీ: ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 2030 నాటికి 300 మిలియన్ టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోగా, దీనిని తప్పక సాధిస్తామని భారత ఉక్కు కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ దీమాగా చెప్పారు. ఉక్కు దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి, స్థానిక పరిశ్రమలకు చేయూతనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. చైనా నుంచి వచ్చే నిర్దిష్ట ఉక్కు ఉత్పత్తుల దిగుమతులపై తాత్కాలికంగా 12 శాతం సుంకాన్ని భారత్ విధించింది. మొత్తం దేశీయ ఉక్కు తయారీ సామర్థ్యం 200 మిలియన్ టన్నులు కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో ముడి ఉక్కు ఉత్పత్తి 151.10 మిలియన్ టన్నులుగా ఉంది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద ముడి ఉక్కు ఉత్పత్తిదారు అయిన భారత్, ప్రధానంగా చైనాకు సంబంధించిన చౌక ఎగుమతుల పెరుగుదలను ఎదుర్కోవడానికి కొన్ని ఉక్కు దిగుమతులపై తాత్కాలికంగా సుంకాన్ని విధించింది. గత రెండేళ్లలో ఉక్కు నికర దిగుమతిదారు దేశంగా భారత్ ఉంది. 2024-25లో ఎగుమతులు తొమ్మిదేళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 9.50 మిలియన్ టన్నులకు ఎగుమతులు పెరిగాయని ప్రభుత్వ డేటా పేర్కొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.